

దోర్నాల మండలం తిమ్మాపురం వద్ద ఎదుగుదల లేని పత్తి

ఆంధ్రజ్యోతి



" దోర్నాల మండలంలో పత్తి సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బోరుబావుల కింద 500 ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. పైరు నెల, నెలన్నర దశలోకి వచ్చింది. ఇప్పుడు కీలకమైన సమయం. అయితే వర్షాభావంతో బోర్లు ఒట్టిపోయాయి. పైగా ఎండలు మండిపోతూ వడగాలులు వీస్తున్నాయి. నీటి తడులు లేక పైరు బెట్టకు వచ్చింది. ఇప్పటికే ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేలు ఖర్చయిందని, పంటను కాపాడుకోవడం ఎలా అని రైతులు మదనపడుతున్నారు. "

వానాకాలంలో ఎండలు మండిపోతున్నాయి. కాడి పట్టాలనుకునే కర్షకుడి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. మూడేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ ఏడాది మే ఆఖరులో మోస్తరు వాన కురిసి మురిపించింది. ఆ తర్వాత మేఘాలు దోబూచులాడుతున్నాయి. వారం నుంచి వేసవిని మించి ఎండలు దంచికొడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ వచ్చి నెల గడుస్తున్నా చినుకు జాడ కరువైంది. దీంతో సాగు ముందుకు కదలడం లేదు. వేసిన పైర్లు మొక్క దశలోనే వాడుముఖం పట్టాయి. అది చూసి రైతులకు కునుకు పట్టడం లేదు. ఈఏడాది కూడా సాగు కష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. మరోపక్క గ్రామాల్లో ప్రజలు నీటి కోసం నానా తిప్పలు పడుతున్నారు. కొన్నిచోట్ల బోరుబావుల్లో కొద్దో గొప్పో వస్తుండగా, మరికొన్నింటికి ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. అవి ఏమాత్రం సరిపోవడం లేదంటూ రోజూ ఏదోఒక ప్రాంతంలో ధర్నాలు చేయడం పరిపాటైంది.

త్రిపురాంతకం వద్ద వాడుముఖం పట్టిన మినుము పైరు



కురవని వాన.. కదలని సాగు

- మండుతున్న ఎండలు
- ఆందోళన చెందుతున్న రైతులు
- మేలో మోస్తరు.. ఇప్పుడు వర్షాభావం
- పక్షం రోజులుగా వేడి గాలులు
- వేసిన పైర్లు ఎండుముఖం
- ఖరీఫ్ సాగు సందిగ్ధం
- దుక్కులు దున్ని ఎదురుచూస్తున్న కర్షకులు

ఒంగోలు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి)/పెద్దదోర్నాల : ముందస్తు వర్షాలతో ఆశలు రేకెత్తించిన వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో తొలకరి సాగు సందిగ్ధంలో పడింది. ఇప్పటికే వేసిన ప్రధాన పంటలు దెబ్బతినే పరిస్థితి కనిపిస్తోంది. జూన్ ఆఖరి వారంలోకి వచ్చినా పట్టుమని పదివేల హెక్టార్లలో కూడా పంటలు సాగు కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం లక్షా 72వేల హెక్టార్లు కాగా తొలకరి (జూన్)లో దాదాపు 12 నుంచి 15 వేల హెక్టార్లలో సజ్జ, నువ్వు, పెసరతోపాటు పశుగ్రాసం పంటలు వేశారు. అలాగే జూన్ రెండో పక్షం నుంచి ప్రధాన పంటలైన కంది, పత్తి విత్తనాలు వేయడం ప్రారంభిస్తారు. జూలై, ఆగస్టుల్లో విస్తారంగా పంటలు సాగవుతాయి. మే ఆఖరులో లేదా జూన్ తొలివారంలో కురిసే వర్షాలతో తొలకరి పైర్లు వేయడంతోపాటు ఖరీఫ్ పంటలకు దుక్కులు సిద్ధం చేస్తారు. ఈ ఏడాది అలాంటి వ్యవసాయ సీజన్‌కు పరిస్థితి అనుకూలించింది. మే ఆఖరులో ఒక మోస్తరు జల్లులు పడగా ఈనెల తొలి వారంలో విస్తారంగానే వర్షం కురిసింది. ఈ నెలలో 57.90 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా తొలివారం నాటికే ఇంచుమించు 75 మి.మీ కురిసింది. నెలమొత్తం కురవాల్సిన దానికన్నా ఎక్కువగా పడటమే కాక కొన్నిచోట్ల భారీవర్షంతో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలలో నీరు చేరింది. దీనికి తోడు ఈ ఏడాది మంచి వర్షాలు ఉంటాయన్న సంకేతాలను వాతావరణ శాఖ ఇచ్చింది.


దోర్నాల మండలం కడపరాజుపాలెం వద్ద దున్ని వర్షం లేక పైరు వేయని భూమి

ఉత్సాహంగా పంటల సాగు

సీజన్ బాగుంటుందన్న ఆశతో రైతులు ఉత్సాహంగా సాగుకు ఉపక్రమించారు. చాలాచోట్ల పలురకాల విత్తనాలు వేయడంతోపాటు ఖరీఫ్ సీజన్ సాగు కోసం దుక్కులు దున్ని భూములను సిద్ధం చేశారు. ఈ పరిస్థితులలో ఇంచుమించు పక్షంరోజులుగా వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో పంటల సాగు మందగించింది. ఈ సమయానికి కనీసం 12వేల నుంచి 15వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంటల సాగై ఇతర పంటలు విత్తే పనులు ముమ్మరంగా సాగుతుండాలి. అయితే ఇప్పటివరకు 6,400 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అందులో సుమారు 1,120 హెక్టార్లలో పత్తి, 850 హెక్టార్లలో నువ్వు, 560 హెక్టార్లలో కొర్ర, 400 హెక్టార్లలో సజ్జ, మరికొంత విస్తీర్ణంలో కూరగాయలు, పశుగ్రాసం పంటలు ఉన్నాయి. పక్షం రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. వారంరోజుల నుంచి జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవడంతోపాటు వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో వేసిన పైర్లు వాడుముఖం పడుతున్నాయి. దున్నిన దుక్కుల్లో తేమ ఎండిపోయి విత్తనాలు వేసే అవకాశం లేకుండాపోయింది. ఈ వారంలోనైనా మంచి వర్షాలు కురవకపోతే తొలకరి పైర్లు సాగుకు సమయం మించిపోవడంతోపాటు కీలకమైన ఖరీఫ్ పైర్లు వేయడం ఆలస్యమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మిర్చి సాగుకు ఎదురుచూపులు

దోర్నాల మండలంలో ప్రధానంగా మిర్చి సాగుకు రైతులు మొగ్గు చూపుతారు. అందుకు తగ్గట్టుగా నేలను దుక్కి చేసి పశువుల ఎరువులు వేసి కలియదున్ని సాగుకు సిద్ధం చేశారు. ఈక్రమంలో వాతావరణం అనుకూలంగా ఉంటే ఈ పాటికే నారుమళ్లు పోసేవారు లేదా పెద్ద యజమానుల వద్ద మాట్లాడుకునే వారు. అయితే రోహిణి కార్తెకు మించి ఎండలు మండిపోతుండడంతో రైతులు ఆసక్తి కనబర్చడం లేదు. మిరప సాగుకు ఇంకా చాలా సమయం ఉందని రైతులు చెబుతున్నారు. మరో నెల వరకూ సాగు చేసుకోవచ్చని, వాన కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు.

టీచర్ల సర్దుబాటుకు గ్రీన్‌సిగ్నల్

» వెంటనే చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ ఆదేశం

ఒంగోలు (విద్య), జూన్ 25 : ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు పిల్లలు లేని పాఠశాలల నుంచి టీచర్లను సర్దుబాటు చేయాలని పాఠశాల విద్య గుంటూరు ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. హైస్కూలు ప్లస్‌లకు టీచర్లను సర్దుబాటు చేయాలని సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ఆర్జేడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెబెక్స్ నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతాక్రమమైన నేను బడికిపోతా, విద్యాప్రకాశం కార్యక్రమాలను విజయవంతం చేసి బడిఈడు బాలబాలికలను నూరు శాతం పాఠశాలల్లో నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వచ్చిన మెటీరియల్‌ను అందజేయాలన్నారు. కేజీబీవీలు, ఏపీ మోడల్ స్కూళ్ళ, హైస్కూలు ప్లస్‌ల పనితీరును సమీక్షించారు. హైస్కూలు ప్లస్‌లలో విద్యార్థుల అడ్మిషన్‌లను పెంచాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫాం, షూలు, ఇతర మెటీరియల్‌ను అందించాలన్నారు. సమీక్షలో డీఈవో సుభద్ర పాల్గొన్నారు. మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి సందర్శించారు. విద్యార్థి కిట్ల పంపిణీని పరిశీలించారు.



వీడ్కోలు సభలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అధికారుల సహకారంతో అభివృద్ధి

అధికారుల సహకారం, సమన్వయంతో జిల్లాను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లానని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయనకు జిల్లా అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి రిమ్స్ ఆడిటోరియంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ సతీమణి, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయ్‌కృష్ణన్, జేసీ గోపాలకృష్ణ, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు లోపలి పేజీల్లో..


నిలువునా దోచేశారు!

- గ్రామ పంచాయతీలకు తీవ్ర అన్యాయం
- కేంద్రం నిధులను లాగేసుకున్న వైసీపీ సర్కారు
- 2019 నుంచి 2024 వరకు రూ.650 కోట్లు రాగా రూ.250 కోట్లు దారి మళ్లింపు
- మరో రూ.300 కోట్లు విద్యుత్ చార్జీలకు జమ
- ఐదేళ్లలో 730 పంచాయతీలకు ఇచ్చింది కేవలం రూ.100 కోట్లే!

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 25: స్థానిక సంస్థలపై గత వైసీపీ ప్రభుత్వం దమననీతిని ప్రదర్శించింది. గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసింది. కేంద్రం నుంచి వచ్చే నిధులను అడ్డంగా లాగేసుకుంది. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంటులను రాత్రికిరాత్రే హాంఫట్ చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు చూసుకుంటే ఐదేళ్ల కాలానికి కేంద్రప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.335కోట్లు ఇవ్వగా, రాష్ట్రప్రభుత్వం నుంచి వివిధ పన్నుల రూపంలో గ్రామ పంచాయతీలకు మరో 350 కోట్ల గ్రాంట్లు వచ్చాయి. అలా వచ్చే నిధులు గ్రామ పంచాయతీల అకౌంట్లకు ఇలా జమ అయ్యాయో లేదో. వైసీపీ ప్రభుత్వం రాత్రికిరాత్రే అలా దారిమళ్లించింది. విద్యుత్ చార్జీల బకాయిల పేరుతో రూ.300 కోట్ల వరకు లాగేసుకోగా, మరో రూ.250 కోట్లను దారిమళ్లించింది. కేవలం రూ.100 కోట్లు మాత్రమే ఈ ఐదేళ్లకు కేటాయించగా ఆ నిధులను కూడా సకాలంలో డ్రా చేసుకోకుండా ఆంక్షలు విధించింది.

అత్యవసర సేవలకు ఇబ్బందులే

జిల్లాలోని 730 గ్రామపంచాయతీల్లో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో అభివృద్ధి పనులతోపాటు ప్రజలకు అత్యవసరమైన సేవలను అందించాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వం అవేమీ పట్టించుకోకుండా మంజూరు చేసిన నిధులను వెంటనే డ్రా చేసుకోకుండా ఆంక్షలు విధించి, ఆ తర్వాత సర్కారే ఆ నిధులను వెనక్కు తీసుకొని సంక్షేమ పథకాలకు వినియోగించుకొందనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్రప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సంఘం నిధుల ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాలతోపాటు ప్రజలకు తాగునీరు, కాలువలు, కల్వర్టులు, సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. అలాగే భారీవర్షాలు కురిస్తే ఆ సమయంలో ప్రజానీకం వ్యాధుల బారిన పడకుండా నిధులను వినియోగించుకోవాల్సి ఉంది. రాష్ట్రప్రభుత్వం నుంచి సీనరేజ్, జనాభా గ్రాంటు, ప్రొఫెషనల్ ట్యాక్స్ కింద ఇచ్చే నిధులను ఆ పంచాయతీల అభివృద్ధికి వినియోగించుకోవచ్చు. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఉత్సవ విగ్రహాలుగా మిగిల్చింది. గ్రామ పంచాయతీల్లో పాలక వర్గాలు 80శాతానికిపైగా వైసీపీ సానుభూతిపరులే ఉన్నా ప్రభుత్వం అవేమీ పట్టించుకోకుండా ఇష్టారీతిన వ్యవహరించడమే కాకుండా గ్రామాల అభివృద్ధిని విస్మరించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాదికి నాలుగు విడతలుగా ఈ నిధులను మంజూరు చేస్తున్నా కనీసం గ్రామాల్లో ఒక్క పని అంటే ఒక్కటి కూడా చేసిన పరిస్థితి లేకుండా పోయింది. గ్రామపంచాయతీ నిధులను దారిమళ్లింపును వ్యతిరేకిస్తూ పార్టీలకతీతంగా సర్పంచ్‌లు రోడ్డెక్కినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించడంతో గ్రామ పంచాయతీలకు చెందిన సొమ్మును వైసీపీ ప్రభుత్వం ఏవిధంగా దారిమళ్లించిందో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే గ్రామపంచాయతీల్లో వందలాది మంది సర్పంచ్‌లు పలు అభివృద్ధి పనులు చేసి బిల్లులు రాక రోడ్డున పడ్డారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాలకవర్గాలకు పూర్వవైభవం తిరిగి వస్తుందన్న ఆశతో ముందుకు సాగుతున్నారు.





నెరవేరనున్న కల

» మెగా డీఎస్సీకి మంత్రి మండలి ఆమోదం » ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందం

ఒంగోలు (విద్య), జూన్ 25 : జిల్లాలో ఉపాధ్యాయ అభ్యర్థుల కల నెరవేరనుంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ కార్యరూపం దాల్చింది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు తన తొలి సంతకాన్ని మెగా డీఎస్సీ ఫైల్‌పై పెట్టి ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని నిరూపించారు. మొదటి మంత్రివర్గ సమావేశంలోనే మెగా డీఎస్సీ నిర్వహణకు ఆమోదముద్ర వేసి నిబద్ధతను చాటుకున్నారు మొత్తం 16,347 టీచర్ పోస్టుల భర్తీకి జూలై 1న నోటిఫికేషన్ జారీచేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మెగా డీఎస్సీ నిర్వహణ నేపథ్యంలో మరోసారి ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. అయితే ఈ తరుణంలో టెట్ నిర్వహణకు పూనుకుంటే డీఎస్సీ ఆలస్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి రెండు ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు ఉంచారు. ఈ రెండింటిలో ప్రభుత్వం ఏ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసి డీఎస్సీపై ముందుకువెళుతుందో చూడాల్సి ఉంది. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఒక డీఎస్సీ కూడా నిర్వహించలేదు. డీఎస్సీ-1998, డీఎస్సీ 2008 అభ్యర్థులకు కొంతమందికి ఉద్యోగాలు కల్పించి మమ అనిపించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు 6,100 టీచర్ పోస్టులను భర్తీచేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే ఆ ప్రక్రియను ఎన్నికల కమిషన్ నిలిపివేసింది.

జిల్లాలో 672 పోస్టులు

మెగా డీఎస్సీలో జిల్లాలో 672 ఖాళీలను చూపించారు. అందులో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు కేవలం 124 కాగా స్కూలు అసిస్టెంట్లు, ఇతర పోస్టులు 548 ఉన్నాయి. విద్యాశాఖ అధికారిక లెక్కల ప్రకారం జూన్ 1 నాటికి మొత్తం 978 ఖాళీలు ఉన్నాయి. వీటిల్లో ఎస్జీటీ పోస్టులు 422 ఉన్నాయి. మెగా డీఎస్సీకి మాత్రం 398 పోస్టులు తగ్గించి కేవలం 124 పోస్టులను మాత్రమే ప్రకటిస్తున్నారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలు 24, స్కూలు అసిస్టెంట్ బీఎస్ 61, ఇంగ్లీషు 65, హిందీ 25, గణితం 65, ఫిజికల్ ఎడ్యుకేషన్ 167, పీఎస్ 45, సోషల్ స్టడీస్ 83, తెలుగు 21 కలిపి మొత్తం 556 ఖాళీలు ఉన్నాయి. అయితే వీటిలో అధికారికంగా డీఎస్సీకి ఎన్ని పోస్టులు ప్రకటిస్తారో వేచి చూడాల్సి ఉంది.

న్యూస్ పేపర్ అలవెన్స్ కట్

ఒంగోలు (విద్య), జూన్ 25 : గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు న్యూస్ పేపరు అలవెన్స్‌ను ప్రభుత్వం కట్ చేసింది. ఈమేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల జూన్ వేతన బిల్లులు కూడా నిలిపివేయాలని ప్రభుత్వం ఖజానా శాఖ డైరెక్టర్‌కు లేఖ రాసింది. డీడీవోలు వీరి జీతం, గౌరవవేతనంతోపాటు న్యూస్ పేపర్ అలవెన్స్ రూ.200 కలిపి బిల్లులు ఖజానా శాఖకు సమర్పించారు. అయితే ప్రభుత్వం వీరికి తక్షణమే న్యూస్ పేపర్ అలవెన్స్ కట్ చేయాలని సూచించినందున ఖజానాకు సమర్పించిన బిల్లులను రద్దుచేయాలని ఆశాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. న్యూస్ పేపర్ అలవెన్స్‌ను మినహాయించి కేవలం జీతం, గౌరవ వేతనం బిల్లులు మాత్రమే డీడీవోలు తిరిగి ఖజానాకు సమర్పించాల్సి ఉంటుంది.

నేడు మంత్రిగా స్వామి బాధ్యతల స్వీకరణ



కొండపి, జూన్ 25 : రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి టీడీపీలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరవుతున్నారు. ఆమేరకు అన్ని మండలాల నాయకులు అమరావతి వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

విశ్వకర్మ యోజనలో దళారీ దందా



- ఊరూరా ఏజెంట్ల ఏర్పాటు
- డ్వాక్రా మహిళలే లక్ష్యం
- యూనిట్‌కు రూ.50వేలు కమీషన్

మార్కాపురం, జూన్ 25: ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో దళారుల దందా పెచ్చుమీరుతోంది. కొందరు పైరవీకారులు తమ అతి తెలివితేటలతో అటు అధికారులను, ఇటు లబ్ధిదారులను మభ్యపెట్టి తమ జేబులు నింపుకొంటున్నారు. ఈ తరహాకు చెందిన వ్యక్తే ఒంగోలులో నివాసముండే జాతీయపార్టీకి చెందిన ఓ మాజీ నాయకుడు. ఆయన ప్రస్తుతం ఎంచుకున్న పథకం ఎన్డీఏ ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం 50శాతం సబ్సిడీతో అమలు చేస్తున్న విశ్వకర్మ యోజన.

గతంలోనూ మోసం

అతను మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తి. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలో జిల్లాస్థాయిలో పలు పదవులను వెలగబెట్టాడు. ఆయన ప్రవర్తన గురించి ఫిర్యాదులు అందడంతో పార్టీ పెద్దలు ప్రస్తుతం అయనను దూరంగా పెట్టారు. పదవుల్లో ఉన్న సమయంలో జిల్లాలో మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి భారీఎత్తున డబ్బులు వసూలు చేసి మోసం చేశాడు. నిబంధనలకు విరుద్ధంగా అతనికి తోడ్పాటు అందించడానికి యత్నించిన వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది సైతం విధులకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయన ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం అమలుచేస్తున్న విశ్వకర్మ యోజనను ఎంచుకున్నాడు.

మహిళా ఏజెంట్ల నియామకం

సదరు దళారీ నేత తన మోసపు ఆర్థిక లావాదేవీల నిర్వహణకు ఊరూరా మహిళా ఏజెంట్లను నియమించుకున్నాడు. అందులోనూ డ్వాక్రా సంఘాలకు లీడర్లుగా ఉన్నవారితో నిరంతర సంబంధాలున్న వారు అతని మాటలకు మోసపోయి ఏజెంట్లుగా చేరుతున్నారు. వారు డ్వాక్రా మహిళలను లక్ష్యంగా చేసుకొని తమ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. 'మీరు పథకానికి అర్హులై, దరఖాస్తు మీద సంతకం పెట్టి ఆధార్ కార్డ్ మాకిస్తే చాలు అన్నీ మేమే చూసుకుంటాం. మీ సెల్‌కు లోన్ మంజూరైనట్లు మెసేజ్ వస్తుంది. అయితే మీకు వచ్చే మొత్తం డబ్బులు రూ.2లక్షలు. వాటిలో తిరిగి మీరు చెల్లించేది రూ.లక్ష మాత్రమే. అంటే లక్ష తిరిగి బ్యాంక్‌కు కట్టనక్కరలేదు. అందులో మాకు రూ.50వేలు మీరు ముందుగా చెల్లించాలి' అనేది వారు పెడుతున్న నిబంధన. ఏజెంట్లు చెబుతున్న మాటల మేరకు లబ్ధిదారుడు ఇచ్చే రూ.50వేలలో దళారీకి, ఏజెంట్లకు, బ్యాంక్ సిబ్బందికి, పథకాన్ని మంజూరు చేయమని చెప్పే నేతకు సైతం వాటాలు ఉన్నట్లు సమాచారం.

మార్కాపురంలో అధిక సంఖ్యలో ఏజెంట్లు

జిల్లాలో ఒంగోలు తర్వాత చెప్పుకోదగ్గ పట్టణం మార్కాపురం. ఈ విషయాన్ని ఎరిగిన సదరు దళారీ నాయకుడు మార్కాపురం లక్ష్యంగా ఎక్కువమంది మహిళలను ఏజెంట్లుగా నియమించుకున్నాడు ముఖ్యంగా వారంతా ఉన్నత, దిగువస్థాయి వారిని లక్ష్యంగా చేసుకోలేదు. కేవలం మధ్యతరగతి వారి ఆశలను లక్ష్యంగా చేసుకొని తమ దళపతి వ్యూహాలను ప్రచారం చేస్తున్నారు.

అక్రమంగా నిర్మించిన బ్యారన్లు తొలగింపు



బ్యారన్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కాకుటూరివారిపాలెం (టంగుటూరు) జూన్ 25 : మండలంలోని కాకుటూరివారిపాలెంలో అక్రమంగా నిర్మించిన మూడు పొగాకు బ్యారన్‌లను పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే జాన్‌బాషా అధ్వర్యంలో మంగళవారం తొలగించారు. ఎక్స్‌కవేటర్‌తో వాటిని కూలగొట్టారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో ఇళ్ల మధ్యన స్థానికుడైన మార్పూరి వెంకట్రావు మూడు బ్యారన్‌లను నిర్మించాడు. వీటికి అటు పంచాయతీ, ఇటు పొగాకు బోర్డు అనుమతులు లేవు. బ్యారన్లు ఉన్న ప్రదేశం బీసీ కాలనీ. అక్కడివారంతా వీటి నిర్మాణాలకు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇళ్ల మధ్యన పొగాకు బ్యారన్లు ఏమిటని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని వారికి అర్జీ ఇచ్చారు. దీనిపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి చర్చించుకొన్నారు. తక్షణమే ఆ బ్యారన్‌లను తొలగించాలని పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం కూడా చేసింది. అదేసమయంలో పంచాయతీ డొంకలో కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. ఈవిషయాలన్నింటిపై పంచాయతీ కార్యదర్శి విచారించారు. మంగళవారం పోలీసుల సహకారంతో బ్యారన్లను ఎక్స్‌కవేటర్‌తో పడగొట్టారు.

ఈకేవైసీ కోసం మహిళల క్యూ



హెచ్‌పీ గ్యాస్ డీలర్‌పాయింట్ వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

కొండపి, జూన్ 25 : ఉచితంగా ఇవ్వనున్న ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు పొందేందుకు లబ్ధిదారుడు ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం నిబంధన విధించింది. దీంతో పక్షంరోజులుగా మండలంలోని హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులంతా స్థానిక గ్యాస్ డీలర్ పాయింట్ వద్ద క్యూ కడుతున్నారు. దీంతో రద్దీ పెరిగింది. దీనికితోడు ఇటీవల పీఎంవైఎస్ పథకంలో కేంద్రం బీపీఎల్ కుటుంబాల వారికి గ్యాస్ కనెక్షన్‌లు మంజూరు చేసింది. ప్రస్తుతం వీరంతా ఈకేవైసీ కోసం హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం వద్దకు వందల సంఖ్యలో వస్తున్నారు.

వీఆర్వోల ద్వారా రేషన్ పంపిణీ చేయాలి

- తహసీల్దార్‌కు టీడీపీ నేతల వినతి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న నాయకులు

కొండపి, జూన్ 25 : కార్డుదారులకు వచ్చేనెల 1 నుంచి ఇచ్చే రేషన్‌ను వీఆర్వోల ద్వారా పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను కోరారు. టీడీపీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్యచౌదరి అధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల టీడీపీ నాయకులు మంగళవారం తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో రెవెన్యూ సమస్యలపై చర్చించారు. వచ్చేనెల రేషన్ పంపిణీ బాధ్యతల నుంచి ఇప్పటి వరకూ ఉన్న డీలర్లను తొలగించాలని కోరారు. వీఆర్వోల అధ్వర్యంలో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొర్రపాటి వసంతరాయుడు, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, చాగంరెడ్డి నరసారెడ్డి, దామా మురళి, గుండపనేని రామ్మూర్తినాయుడు, చింతల వెంకటరావు, వేముల మల్లిఖార్జున, చాగంటి శేషయ్య, బొడ్డులూరి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాలతో మంత్రి సమావేశం



మంత్రి పవన్‌కల్యాణ్‌కు బొకే ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 25: అమరావతిలో పంచాయతీ వింగ్‌లోని అన్ని ఉద్యోగ సంఘాలతో మంగళవారం పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జి.రామకృష్ణ నేతృత్వంలో పవన్‌కల్యాణ్‌కు బొకే ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా పంచాయతీ వింగ్‌లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం అయితేనే ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని పవన్‌కల్యాణ్ చెప్పారని యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీతారామయ్య, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

టెట్‌లో శ్రీవికాస్ విద్యార్థుల ప్రతిభ



ఎస్తేరమ్మ, మౌనిక

ఒంగోలు(విద్య), జూన్ 25 : ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన టెట్ పేపరు-1ఎలో ఒంగోలులోని శ్రీవికాస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి తమ సత్తా చాటారు. పి.ఎస్తేరమ్మ అత్యధికంగా 137.10 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలువగా, కరవదికి చెందిన ఐ.మౌనిక 129.7 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. పేర్నమిట్టకు చెందిన కె.అంజమ్మ 125 మార్కులు సాధించారు. శ్రీవికాస్‌లో శిక్షణ పొందినవారిలో 10మంది 130కిపైగా, 35 మంది 125కు పైగా మార్కులు పొందారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను మంగళవారం స్థానిక కోచింగ్ సెంటర్‌లో కరస్పాండెంట్ కె.మోహనరావు, డైరెక్టర్ వి.వీరయ్యలు ప్రత్యేకంగా అభినందించారు.

వైభవంగా కల్యాణమహోత్సవం

చీమకుర్తి, జూన్25 : నేకునంబాదు గ్రామంలో శ్రీ భ్రమరాంబిక సమేత మల్లిఖార్జునస్వామి కళ్యాణమహోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా జరిపారు ఆలయం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా కళ్యాణమహోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, విశేషపూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యనిర్వాహకులు అన్నదానం చేశారు.



పూజలలో పాల్గొన్న భక్తులు

సరస్వతీ కటాక్షం కోసం గిరిపుత్రుల నిరీక్షణ

- పాఠశాల లేక చిన్నారులు విద్యకు దూరం
- పదేళ్ల క్రితం ఎమ్మెల్యే స్వామి చొరవతో పక్కా గృహాల నిర్మాణం
- సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా
- వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి



పాఠశాల ఏర్పాటు చేయాలని అధికారులను వేడుకుంటున్న గిరిజనులు

మర్రిపూడి, జూన్ 25 : అది మండలంలోని గార్లపేట పంచాయతీ పరిధిలోని శివారు గిరిజన కాలనీ. ఇక్కడ నివాసం ఉండే యానాదులు పంట పొలాలకు కాపలాదారులుగా ఉంటూ జీవనం సాగిస్తుంటారు. పదేళ్ల క్రితం వరకూ వారికి పక్కా గృహాలు కూడా లేవు. పూరిగుడిసెల్లో నిత్యం విష పురుగుల సంచారం మధ్య బిక్కుబిక్కుమంటూ గడిపేవారు. రెక్కాడితే గాని డొక్కాడని ఈబడుగు జీవుల దుస్థితిని చూసి అప్పట్లో ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చలించిపోయారు. కేంద్రప్రభుత్వ నిధులతోపాటు స్వచ్ఛంద సంస్థ సహకారంతో 30 పక్కా గృహాలను నిర్మించారు. అంతేకాకుండా పంచాయతీ కేంద్రానికి, గిరిజన కాలనీని అనుసంధానం చేస్తూ రూ.కోటి వ్యయంతో తారురోడ్డు సౌకర్యం కల్పించారు. ఆగమేఘాలపై కాలనీలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయించారు. రక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా తీర్చిదిద్దారు. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో గ్రామాభివృద్ధి కుంటుపడింది. దామచర్ల అంజనేయులు పేరుతో వెలసిన ఈ కాలనీలో అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయించాలనే స్వామి లక్ష్యానికి ప్రభుత్వం మారడంతో బ్రేకులు పడ్డాయి. పాఠశాల ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గార్లపేటకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. తల్లిదండ్రులు పొట్టకూటికోసం పొద్దున్నే పిల్లలను వదిలేసి పనుల కోసం వెళుతుంటారు. ఈ సమయంలో చిన్నారులు రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లలేక విద్యకు దూరమయ్యారు. 20మందికిపైగా బడిబయట ఉండిపోయారు. రెండు రోజుల క్రితం మండల విద్యాశాఖాధికారి బి.వి.రంగయ్య గ్రామానికి చేరుకొని పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులను కోరారు. ఈసందర్భంగా పిల్లలకు రవాణా సౌకర్యం కల్పించడం కానీ, ప్రత్యామ్నాయంగా పాఠశాల ఏర్పాటు కానీ చేయించాలని గ్రామస్థులు ముక్తకంఠంతో వేడుకున్నారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్వామి పాఠశాల ఏర్పాటుకు చొరవ చూపించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో
అక్రమాలపై విచారణ చేపట్టాలి

- టీడీపీ నగర అధ్యక్షుడు కొఠారి డిమాండ్
- దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కొఠారి నాగేశ్వరరావు

ఒంగోలు(కల్చరల్), జూన్ 25: ఒంగోలు కొత్తపట్నం బస్టాండులోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒంగోలులోని దేవదాయశాఖ కార్యాలయంలో ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదును అందజేశారు. దేవస్థాన ఇన్‌చార్జి ఈవో పి.అంజనీదేవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చాకిరి ధనుంజయలు దేవాలయంలో అనేక ఆర్థిక అవినీతి, కులదూషణ, భక్తులను, దాతలను అవమానపర్చటం వంటి చర్యలకు పాల్పడున్నారని ఆయన పేర్కొన్నారు. దీనిపై 2023వ సంవత్సరంలోనే యరమాల అంజనేయులు అనే భక్తుడు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి విచారణ జరపకుండా పక్కన పెట్టారన్నారు. 2023 మార్చి 9న దేవస్థానంలో జరిగిన హుండీ లెక్కింపులో ఈవో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించి నిధులు పక్కదారి పట్టించారని, అలాగే అంచనా ప్రకారం దేవస్థానానికి రంగులు వేయించకుండా ఈవో, చైర్మన్‌లు సుమారు రూ.4.40 లక్షల అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ ఈవోతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకొని అసిస్టెంట్ కమిషనర్‌కు తప్పుడు రిపోర్టులు పంపారన్నారు. ఈ విషయాలన్నింటిపై సమగ్రంగా విచారణ జరపాలని నాగేశ్వరరావు కోరారు.

పార్కు అక్రమ నిర్మాణం తొలగింపుపై పరిశీలన

హైకోర్టు ఆదేశాలతో కదిలిన అధికారులు



అప్రోచ్ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు



అక్రమంగా చేపట్టిన పార్కు నిర్మాణం

సంతనూతలపాడు, జూన్ 25: సంతనూతలపాడులోని తంబళ్లగుంట వాగు వద్దనున్న జగనన్న కాలనీకి ఎదురుగానున్న వాగు పోరంబోకు భూమిలో ఆక్రమణలు, పార్కునిర్మాణాల తొలగింపుపై మంగళవారం రెవెన్యూ, మండలపరిషత్, పోలీసుల అధికారులు పరిశీలించారు. సర్వేనెంబరు 220/1లోని వాగు పోరంబోకులో 2.96 ఎకరాల భూమి ఉందని తహసీల్దార్ మీరావలి తెలిపారు. ఈ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా గత ప్రభుత్వ హయాంలో స్థానిక నాయకులు అప్రోచ్ రోడ్డు, అక్రమ పార్కు నిర్మాణలు చేపట్టారని, ఓ ఇంటి నిర్మాణం చేపట్టేందుకు బేస్‌మట్టం సైతం ఏర్పాటు చేశారని చెప్పారు. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాల మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్ వెంటనే వాగు పోరంబోకు భూమిలోని ఆక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశాలను జారీ చేశారు. దీనితోపాటు వాగుపోరంబోకును పునరుద్ధరణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.శ్రీహరి, నాయకులు సాదినేని శ్రీరామూర్తి, తన్నీరుశ్రీను, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

స్వతంత్రబలంతో సీపీఎం అభివృద్ధి చెందాలి

- రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 25: స్వతంత్ర బలంతో సీపీఎం అభివృద్ధి చెందాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలు- ప్రజలిచ్చిన తీర్పుపై మంగళవారం ఒంగోలులోని సుందరయ్యభవన్‌లో జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారానే తమను తిరిగి అధికారంలోకి తెస్తారని వైసీపీ ఆశించిందని, ఆ పథకాల కంటే ప్రజలమీద వేసిన భారాలు, కేంద్ర ప్రభుత్వం వేసిన భారాలు కలిపి వైసీపీ ప్రభుత్వ పరాజయానికి దారి తీశాయన్నారు. ఉద్యోగ వర్గాలను, నిరుద్యోగులను విస్మరించడం, అమరావతిలో రాజధాని కాదని, మూడు రాజధానులంటూ ఊదరగొట్టిన నిర్ణయాన్ని ప్రజలు తిరస్కరించారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వైసీపీని ఓడించాలనే ప్రజా వ్యతిరేకత టీడీపీ కూటమి విజయానికి దోహదపడిందని ఆయన చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు కూటమికి బాగా లాభించిందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడాలని చెప్పారు. జిల్లాకార్యదర్శివర్గ సభ్యుడు జీవీకొండారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, కంకణాల ఆంజనేయులు, దగ్గుబాటి సోమయ్య, ఎం.రమేష్, ఉసా వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణకు కృషి చేయాలి

- పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణ్‌కుమార్



ఏడుగుండ్లపాడులో బావినీటిని పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది, నాయకులు

మద్దిపాడు, జూన్ 25: డయేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మద్దిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఏడుగుండ్లపాడు గ్రామంలో డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విరేచనాలు, టైఫాయిడ్, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులను నియంత్రించటానికి వ్యక్తిగత పరిశుభ్రత అవసరమన్నారు. సర్పంచ్ దాసరి శిల్ప సౌందర్య మాట్లాడుతూ బావులు, వాటర్‌ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మండవ వెంకటస్వామి, దాసరి రమేష్, హెల్త్ సూపర్‌వైజర్ కె.బాలకోటయ్య, గురువర్ధని, సాయి తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: డయేరియా నివారణపై ప్రణాళిలను సిద్ధం చేసి తగిన తీసుకోవాలని ఇన్‌చార్జి ఈవోఆర్డీ రాధిక తెలిపారు. మంగళవారం సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎమ్‌లతో ఎంపీడీవో శ్రీహరి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 15రోజులకొకసారి వాటర్‌ట్యాంకులను శుభ్రయం చేయించాలని, ట్యాంకు బోర్డుపై ఏఏ తేదీల్లో శుభ్రం చేయించారో రాయించాలన్నారు. ట్యాంకు నుంచి క్లోరినేషన్ చేసిన 45 నిమిషాల తర్వాత నీటిని వదలాలన్నారు. వాటర్ ట్యాంకుపై ఉన్న నిచ్చెనలకు మరమ్మతులు చేయించాలని సూచించారు. పైపులైను లీకేజీలు, మురుగు కాలువల వద్దనున్న మంచినీటిపైపులకు అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. ప్రతి పంచాయతీలో క్లోరినేషన్ కిట్స్ ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎమ్‌లు సమన్వయంలో పనిచేయాలన్నారు. మంచినీటికలుషితంపై నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు.

నిత్యాన్నదానం



భోజనం చేస్తున్న పేదలు

మద్దిపాడు, జూన్ 25: మద్దిపాడులోని బ్రహ్మంగారి చెట్టు వద్ద మణికంఠాచారి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు ఏలూరి లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. ప్రస్తుతం నిత్యం 50 మందికి అన్నదానం చేస్తున్నామని, రానున్న రోజుల్లో సేవలు మరింత విస్తృతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా ఏకాంతసేవ

మద్దిపాడు, జూన్ 25: నందిపాడు గంగా పార్వతీ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి ఏకాంత సేవ వైభవంగా జరిగింది. అర్చకులు రాజుపంతులు అధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో కుంకుమార్చన, స్వామివారికి రుద్రాభిషేకం జరిగాయి.

కారు, లారీ ఢీ - యువకుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేష్

మద్దిపాడు, జూన్ 25: కారును గుర్తు తెలియని లారీ ఢీకొన్న సంఘటనలో లింగసముద్రం మండలం పెదపవనికి చెందిన షేక్ రహంతుల్లా (25) అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం వెల్లంపల్లి బ్రిడ్జి సమీపంలో బొలేరా కారు గుంటూరు వైపు నుంచి వస్తుంది. ఈక్రమంలో కారు ముందుటైరు పగిలి ఓ పక్కకు ఒరిగిపోవడంతో వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో కారులోని రహంతుల్లా అక్కడిక్కడే చనిపోయాడు. ఎస్సై మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు.

అవీ..ఇవీ..

వైసీపీ నేత 'ఆనం' విద్యుత్ చౌర్యం

టంగుటూరు, జూన్ 25 : మండలంలోని కారుమంచిలో రెండేళ్లుగా వైసీపీ నాయకుడు చేస్తున్న విద్యుత్ చౌర్యం మంగళవారం వెలుగు చూసింది. విద్యుత్ శాఖకు చెందిన విజిలెన్స్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఇది వెల్లడైంది. ఈ విషయాన్ని స్థానికుడైన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పత్రికలకు తెలియజేశారు. కారుమంచి వాటర్ ప్లాంట్‌కు వైసీపీ నేత ఆనం సత్యనారాయణరెడ్డి పేరుతో విద్యుత్ మీటరు ఉంది. దీన్ని స్తంభింపజేసి ప్రతినెలా రూ.10వేల విలువైన విద్యుత్ చౌర్యం జరిగినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంపై విద్యుత్ అధికారులు విచారణ చేసి నిందితులను శిక్షించాలని లక్ష్మణరెడ్డి డిమాండ్ చేశారు. దీనిపై విద్యుత్ శాఖ టంగుటూరు రూరల్ ఏఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఆనం సత్యనారాయణరెడ్డి పేరుతో ఉన్న మీటర్ నుంచి విద్యుత్ చౌర్యం జరిగిందిన వాస్తవమేన న్నారు.

హిందూ శ్మశానవాటిక అభివృద్ధి



శ్మశానవాటికలో మట్టిని తోలుతున్న ట్రాక్టర్లు

నాగులుప్పలపాడు, జూన్ 25 : రిటైర్డ్ ఉద్యోగులు, ట్రాక్టర్ యజమానులు తమ గ్రామంలోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధి చేసేందుకు నడుం బిగించారు. నాగులుప్పలపాడులోని హిందూ శ్మశానవాటిక అధ్వానంగా ఉంది. మురుగు గుంతలు ఏర్పడి దుర్గంధం వెదజల్లుతున్నది. దాంతో గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు జిల్లెలమూడి వెంకటేశ్వర్లు, చిడిపోతు సుబ్బారావు, మున్నంగి వెంకయ్య తమ సంఘంతో పాటు గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానుల అధ్వర్యంలో శ్మశానవాటికకు పక్కనున్న కందిపట్టేరు చెరువులోని మట్టిని ట్రాక్టర్లతో తరలించి మెరకలు తోలి చదును చేస్తున్నారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

నాగులుప్పలపాడు, జూన్ 25 : ఒమ్మెవరంలోని కమ్యూనిటీ హాలు వద్ద ఒంగోలుకు చెందిన చైతన్య కార్డియాక్ వైద్యశాల, స్మార్ట్ విజన్ ఐ హాస్పటల్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు ఎస్.శివకృష్ణ తదితర వైద్యులు 180 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

వాటర్‌ప్లాంట్ మరమ్మతుకు చర్యలు



వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న హరిబాబు

నాగులుప్పలపాడు, జూన్ 25 : అమ్మనబ్రోలులోని సీఎస్ఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గల వాటర్ ప్లాంట్ మరమత్తులకు గురికావడంతో మాజీ జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు చొరవ తీసుకున్నారు. రూ.40వేలు తన సొంత నిధులను వెచ్చించి రిపేరు చేయించి పాఠశాలలోని విద్యార్థులకు మంచినీటి సమస్యను పరిష్కరించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించడంతో హెచ్‌ఎం ఎం.సత్యవతి, స్టాఫ్ సెక్రటరీ బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు మంగళవారం ఈదర హరిబాబును అభినందించారు.

దంత ఆరోగ్యంపై అవగాహన అవసరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ఒంగోలు(కల్చరల్), జూన్ 25: దంత ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాను ఆదిలక్ష్మి పేర్కొన్నారు. పాఠకులు, సిబ్బంది కోసం మంగళవారం ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో ఆపిల్ ఇంటర్నేషనల్ డెంటల్ కేర్ సంస్థ అధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ దంతాలను రెండు పూటలా శుభ్రపరచుకోవాలన్నారు. డాక్టర్ పావని మాట్లాడుతూ దంతాలు, చిగుళ్ల సమస్యలు తలెత్తినపుడు వెంటనే తగు చికిత్స తీసుకోవాలని, లేకపోతే అవి ఇతర సమస్యలకు దారితీస్తాయన్నారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, ఉపగ్రంథ పాలకురాలు కోటేశ్వరి, లైబ్రేరియన్ కె.సంపూర్ణ, ఎస్.అనిల్, లక్ష్మి, మున్నా అంజనేయులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం

ఒంగోలు(కల్చరల్), జూన్ 25: గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు పూర్తిగా కాలిపోయిన ఘటనలో బాధితురాలికి సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ మంగళవారం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్థానిక చంద్రయ్యనగర్‌కు చెందిన మేరి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అంతేకాకుండా అమె రెండు కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ చేయించుకుంటున్నట్లు సెక్రటరీ సర్దార్ బాషా తెలిపారు. ఈ దశలో తమను సంప్రదించగా ఇంటి నిర్మాణానికి నగదును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ట్రస్ట్ చైర్‌పర్సన్ షహనాజ్, సుబ్బారావు, జనసేవ నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవీఎఫ్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాజేశ్‌కుమార్, సేవానాయక్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 25: ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ అండ్ ఫెడరేషన్ (ఏపీఎన్‌జీవీఎఫ్)కార్యాలయాన్ని ఏపీఎన్‌జీవో సంఘం ఉపాధ్యక్షుడు పి. రాజేశ్‌కుమార్, ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ సేవానాయక్ మంగళవారం ఒంగోలులో ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా ఫెడరేషన్ చైర్మన్ టీవీ.రమేష్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జేవీ వోఅండ్‌వీఎల్‌వో ప్రధానకార్యదర్శి జి.రామకృష్ణ, ఫెడరేషన్ సెక్రటరీ బోనం గోవిందరాజులు, రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.లక్ష్మయ్య ప్రతినిధులు మునసూరి కోటేశ్వరరావు, డి.కృష్ణాంజనేయులు, పి.రవిచంద్రకుమార్, కె.శంకరరావు, బి.చరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారం సంచులతో ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 25: లక్ష్మీకోటయ్య మెమోరియల్ సొసైటీ ద్వారా హెచ్ఐవీతో బాధపడుతున్న వారికి ప్రతినెలా పౌష్టికాహారాన్ని అందజేసి అండగా నిలుస్తున్నామని సొసైటీ గౌరవాధ్యక్షుడు డి.ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక పాత మార్కెట్ సూర్యటవర్ వద్ద ఉన్న సొసైటీ కార్యాలయంలో మంగళవారం పది మంది హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఏవై.రావు, సెక్రటరీ సీహెచ్‌వీ.రాఘవ, సభ్యులు నాగరాజు, పైనం ప్రభాకరరావు పాల్గొన్నారు.

కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సత్కారం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 25: బదిలీపై వెళ్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్‌ను సర్పంచ్‌ల సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. మంగళవారం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీరభద్రాచారి అధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సింగరాయకొండ సర్పంచ్ తాటిపర్తి వనజ, ఉపాధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.354



కొనసాగుతున్న పొగాకు వేలం

టంగుటూరు, జూన్ 25 : టంగుటూరు వేలం కేంద్రంలో పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.354 లభించింది. సోమవారం రూ.341 ఉండగా ఒక్కరోజుకే అది రూ.354కు చేరింది. మంగళవారం కె.ఉప్పలపాడు రైతులకు చెందిన 1,191 పొగాకు బేళ్లను వేలానికి అనుమతించారు. అందులో 1,090 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. కనిష్ఠ ధర కిలో రూ.205 నిలకడగా ఉంది. సరాసరి ధర రూ.291.32కు చేరింది. మొత్తం 19 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలపై వైసీపీ రంగు..!

టెన్త్ పుస్తకాల అట్టలన్నీ నీలి రంగులోనే..

పార్టీ తొత్తులుగా మారిన నాటి అధికార యంత్రాంగం



నీలిరంగులో ఉన్న పాఠ్యపుస్తకాలు

నాగులుప్పలపాడు, జూన్ 25 : నాటి వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి దిగిపోయే వరకు అవకాశం దొరికిన ప్రతిచోట తమ పార్టీ రంగులు ఉండేలా చేసింది. నాడు చంద్రబాబు నాయుడు కట్టించిన టిడ్కో ఇళ్లకు మూడు రంగులు వేశారు. ఇక సచివాలయాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఆర్బీకేలు ఇలా చెప్పుకుంటూ పోతే చాదస్తం చాంతాడంత అన్న తీరులో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ రంగుల పిచ్చి ముదిరిపోయింది. అంతా బులుగు రంగు మయం చేసే తాపత్రయంలో కోట్ల రూపాయలు రంగులకు ఖర్చు చేయడంపై నాడు విపక్షాలు తీవ్రంగా ఖండించాయి. అయితే ఇప్పుడు ఏకంగా ఈ ఏడాది పదో తరగతి పాఠ్యపుస్తకాల అట్టలు కూడా బులుగు రంగులను అద్దడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల వర్గం విస్తుపోయేలా చేసింది. ఇంతక ముందెప్పుడూ ఇలాంటి సంఘటనలు లేవు. పుస్తకాల లోపలున్న అంశాలు స్పష్టంగా కనిపించేలా బొమ్మలు ఉండేవి. ఇప్పుడు బులుగు రంగులోపల కనిపించీ కనిపించనట్లు పైగా అన్నీ దాదాపు పన్నెండు పుస్తకాలు ఉంటే తెలుగు కొద్దిగా మినహాయింపుగా ఉంది. మిగతా అన్ని పుస్తకాల అట్టలు బులుగుగా ఉండటంపై నాటి ఉన్నతాధికారులు అత్యుత్సాహం కన్పిస్తోందని విమర్శలు వినిపిస్తున్నారు. అయితే ఎన్నికల్లో వైసీపీ అధికారం కోల్పోయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు చేసేదేమి లేక అలాగే ఆయా పుస్తకాలు పాఠశాలలకు అందించారు. కాగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యార్థులకు ఇచ్చే కిట్లపై ఎలాంటి బొమ్మలు ఉండకూడదని, ప్రజాధనం వృథాగా పోకూడదని ఆదేశించారు.

అమరావతి పాఠంపైనా అక్కసు..

నవ్యాంధ్రకు కొత్త రాజధానిని అమరావతిని 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంపిక చేసి పనులను కొనసాగించారు. రాజధాని చరిత్రను విద్యార్థులకు వివరించేందుకు పదో తరగతి పాఠ్యపుస్తకంలో రెండో పాఠంగా ముద్రించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ ప్రభుత్వం తెలుగు పాఠ్యపుస్తకంలో రెండవ పాఠం అమరావతి ఉండగా దాన్ని ఆ ఏడాది సిలబస్ నుంచి తొలగించారు. ఆ తదుపరి ఏడాది పాఠ్యపుస్తకంలో నుంచి అమరావతి పాటను పూర్తిగా తొలగించి 12 పాఠ్యాంశాలకు బదులుగా 11 పాఠాలతోనే సిలబస్‌ను నాలుగేళ్ళు కొనసాగించారు. ఈక్రమంలో వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాది మళ్ళీ ఈ విద్యా సంవత్సరంలో 12వ పాఠంగా మరొక పాఠ్యాంశాన్ని చేర్చడంపై ప్రజలు బాహాటంగా చర్చించుకుటున్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 25 : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు స్వీప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన కాంపిటేషన్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ దినేష్‌కుమార్ బహుమతులు అందజేశారు. మంగళవారం రాత్రి స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో పలు కళాశాలల్లో విద్యార్థులకు ఓటుహక్కు వినియోగంపై నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్వీప్ అధికారులు డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం

దొనకొండ, జూన్ 25 : అక్రమంగా నిల్వ చేసిన భారీ మద్యం డంప్‌ను దర్శి ఎస్ఈబీ పోలీసులు గుర్తించిన సంఘటన వీరేపల్లిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వీరేపల్లికి చెందిన విప్పర్ల బాలకోటయ్య తన పశువుల చావిడిలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచినట్లు ఎస్ఈబీ పోలీసులకు సమాచారం అందింది. దర్శి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సుందరరామయ్య తన సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారితో గ్రామానికి చేరుకొని బాలకోటయ్య పశువుల చావిడిలో తనిఖీలు చేపట్టారు. 180 ఎంఎల్ ఏడు రకాల బ్రాండ్లు గల 1077 మద్యం సీసాలు, 650 ఎంఎల్ రెండు రకాల బ్రాండ్లు గల 146 బీరు సీసాలు పట్టుబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సుందరరామయ్య తెలిపారు. ఎస్ఈబీ ఎస్సై కళ్యాణ్‌చక్రవర్తి, వీఆర్వో హుస్సేన్‌సాహెబ్‌లు పాల్గొన్నారు.

బెదిరించాడని..అంతమొందించారు..!

యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు ● మేస్త్రీతో పాటు మరో వ్యక్తి అరెస్టు ● ఏఎస్పీ శ్రీధర్‌రావు వెల్లడి

ఒంగోలు(క్రైం), జూన్ 25: అడ్వాన్సు డబ్బుల విషయంలో మేస్త్రీతో గొడవ పడి బెదిరించడంతో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. ఆదివారం అర్ధరాత్రి ఒంగోలు నగర శివారు ప్రాంతంలోని పేర్నమిట్ట-మంగమూరు రోడ్డు మధ్య ఉన్న రాంబాబు వెంచర్ దగ్గర సాగర్ కాలువలో హత్యకు గురైన యువకుడిని పోలీసులు గుర్తించారు. హతుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వినీత్‌శ్రీవాస్తవ(30)గా అతని జేబులో దొరికిన ఫోన్ నంబర్ ఆధారంగా గుర్తించిన పోలీసులు అత్యంత వేగంగా నిందితులను పట్టుకున్నారు. ఈ కేసులో పీవోపీ మేస్త్రీగా పనిచేస్తున్న పేర్నమిట్టలోని ఇందిరనగర్‌లో నివాసం ఉండే ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధ్రువ్‌చంద్రవర్మ, అతని వద్ద పనిచేస్తున్న అదే రాష్ట్రానికి చెందిన రామ్‌చరణ్‌లను నిందితులుగా గుర్తించి అరెస్టు చేసినట్లు అదనపు ఎస్పీ (క్రైమ్స్) శ్రీధర్‌రావు తెలిపారు. మంగళవారం ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు.

హత్య జరిగింది ఇలా...

ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధ్రువ్‌చంద్రవర్మ గత 20 ఏళ్లుగా పేర్నమిట్టలో నివాసం ఉంటున్నాడు. ఆయన పీవోపీ సీలింగ్ పనులు చేస్తూ మేస్త్రీగా వ్యవహరిస్తున్నాడు. అతని వద్దకు వినిత్ శ్రీవాస్తవ 20 రోజుల క్రితం పనుల కోసం వచ్చాడు. ధ్రువ్‌చంద్రవర్మ వద్ద పనిచేసే వారు అంతా స్థానిక సుజాతనగర్‌లో ఓ గదిలో నివాసం ఉంటూ పనులు చేస్తుంటారు. ఈనెల 23 సాయంత్రం మేస్త్రీ ధ్రువ్‌చంద్రవర్మ వద్దకు వినిత్‌శ్రీవాస్తవ వచ్చి తన అన్న వివాహం ఉందని రూ.10వేలు నగదు అడ్వాన్స్ కావాలని అడిగాడు. అయితే పనిలో చేరి 20 రోజులు కాలేదని, అంత అడ్వాన్సు ఎలా ఇస్తారని మేస్త్రీ చెప్పాడు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ శ్రీధర్‌రావు, హత్యకు ఉపయోగించిన కత్తి (ఇన్‌సెట్‌లో)

ఈ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో మేస్త్రీని వినిత్‌శ్రీవాస్తవ నెట్టడంతో ఆయన కింద పడిపోయాడు. అంతేగాకుండా తన గురించి నీకు తెలియదని, గతంలో ముంబయ్‌లో రెండు మర్డర్లు చేశానని వినిత్‌శ్రీవాస్తవ బెదిరించాడు. దీంతో అవమానంగా భావించిన మేస్త్రీ ధ్రువ్‌చంద్రవర్మ ఎలాగైనా వినిత్‌శ్రీవాస్తవను ఏదో ఒకటి చేయాలని అప్పుడే నిర్ణయం తీసుకున్నాడు. గత ఆదివారం అర్ధరాత్రి తన వద్ద పనిచేస్తున్న రామ్‌చరణ్ కలిసి మోటార్‌సైకిల్‌పై వినిత్‌శ్రీవాస్తవకు మాయమాటలు చెప్పి ఎక్కించుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద అమ్మాయిలు ఉంటారని నమ్మించి మోటార్‌సైకిల్‌పై నేరుగా పేర్నమిట్ట-మంగమూరు రోడ్డు మధ్య ఉన్న వెంచర్ వద్దకు తీసుకెళ్ళారు. అక్కడ వాహనం దిగిన వెంటనే ధ్రువ్‌చంద్రవర్మ తన వద్ద నున్న కత్తి తీసి వినిత్‌శ్రీవాస్తవ పొట్టలో పొడిచాడు. మళ్లీ అతడి గొంతును కిరాతకంగా కోశారు. అనంతరం ఆ పక్కన ఉన్న కాలువలో అతడిని పడవేసి పరారీ అయ్యారని అదనపు ఎస్పీ తెలిపారు.

కత్తి, మోటార్‌సైకిల్ స్వాధీనం

హత్య కేసులో దొరికిన ఫోన్‌నంబరు ఆధారంగా హత్యకు గురైంది వినిత్ శ్రీవాస్తవ గా పోలీసులు గుర్తించారు. అతను ఎవరి వద్ద పని చేస్తుంటారని దర్యాప్తు చేసి మేస్త్రీ ధ్రువ్‌చంద్రవర్మను, రామ్‌చరణ్‌లను మంగళవారం మధ్యాహ్నం ఒంగోలు రైల్వేస్టేషన్ వద్ద తాలుకా పోలీసులు అరెస్టు చేసినట్లు ఏఎస్పీ శ్రీధరరావు తెలిపారు. వారి వద్ద హత్యకు వినియోగించిన కత్తి, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. కాగా హత్య కేసులో కీలకంగా దర్యాప్తు చేసిన అదనపు ఎస్పీ క్రైమ్స్ శ్రీధరరావు, ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు, టూటౌన్ సీఐ జగదీష్, తాలుకా ఎస్ఐ విజయకుమార్‌లను ఎస్పీ అభినందించారు.

అధికారుల సహకారం, సమన్వయంతోనే అభివృద్ధి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 25 : జిల్లాలోని అధికారుల సహకారం, సమన్వయంతో జిల్లాను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లగలిగానని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయనకు జిల్లా అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఒంగోలులోని రిమ్స్ ఆడిటోరియంలో ఘనంగా ఆత్మీయవీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో కలెక్టర్‌తో తమకున్న ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ భౌగోళికంగా, సామాజికంగా భిన్న పరిస్థితులు కలిగిన జిల్లాలో పనిచేసే అవకాశం తనకు దక్కిందన్నారు. జిల్లాను అభివృద్ధి దిశగా తీసుకెళ్ళడంలో తన వంతు ప్రయత్నం చేసినట్లు చెప్పారు. ఎస్పీ గరుడ్‌సుమిత్‌సునీల్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడంలో పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయం వల్లనే సాధ్యపడిందన్నారు. అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ విజయకృష్ణన్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో శ్రీలత, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కృష్ణమోహన్, ఎన్‌జీవో సంఘం నాయకుడు శరత్, వీఆర్వోల అసోసియేషన్ నాయకుడు ఆదిరెడ్డి, ఏపీజీఈఎఫ్ నాయకులు చిట్టిబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ దినేష్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న అధికారులు

మహిళా మార్ట్ లెక్కలు చెప్పాల్సిందే !

అద్దంకిలో సీఎంఎంని నిలదీసిన ఆర్పీలు

సరైన సమాధానం చెప్పకుండా దాటవేయడంపై ఆగ్రహం

సభ్యుల పెట్టుబడి సొమ్మును బొక్కేసిన వైనం

అధికారులకు ఫిర్యాదు

అద్దంకి, జూన్ 25: అద్దంకి పట్టణంలోని మెప్మాలో సిగపట్లు మొదలయ్యాయి. ఇప్పటి వరకు తన అధికారం అడ్డుపెట్టుకొని హవా సాగించిన సీఎంఎం ఫణికుమారిపై ఆర్పీలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. గతంలో పలు సందర్భాలలో పలువురు ప్రశ్నించినా టీడీపీ వర్గీయులుగా ముద్రవేసి తన దోపిడీకి అడ్డు లేకుండా చేశారని పలువురు ఆర్పీలు ఆరోపిస్తున్నారు. రెండున్నరేళ్ల కిందట మెప్మా సభ్యుల పెట్టుబడితో అద్దంకిలో మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. ఏటా లాభాలు పంచుతామని చెప్పిన అధికారులు ఇంతవరకు వాటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. మహిళా మార్ట్‌ను గతంలో ఉన్న అన్న క్యాంటీన్‌లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో మహిళా మార్ట్ మూసి వేసేందుకు రంగం సిద్ధమయింది. అయితే మెప్మా సభ్యులు ఒక్కొక్కరూ రూ.150 చొప్పున సుమారు 8వేల మంది నుంచి సుమారు రూ.12లక్షల పెట్టుబడి నిధిని వసూలు చేశారు. ప్రస్తుతం మార్ట్‌లో ఉన్న సరుకు విలువ పట్టుమని 50 వేల రూపాయలు కూడా ఉండదని సభ్యులు ఆరోపిస్తున్నారు. పర్యవేక్షణ చేసే అధికారులు మాత్రం రూ.2లక్షల సరుకు ఉన్నట్లు చెప్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం అయినా రూ.2లక్షల సరుకు పోను మిగిలిన రూ.10లక్షల సంగతి ఏమిటనే దానికి సమాధానం మాత్రం లేదని సభ్యులు, ఆర్పీలు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు ఆర్పీలు మార్ట్ జమా లెక్కలు గురించి ప్రశ్నించారు. అయితే సీఎంఎం మాత్రం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆర్పీలలో ఆగ్రహం తెప్పించింది. దీంతో మాటామాటా పెరిగి సిగపట్లు వరకు వెళ్లినట్లు తెలుస్తుంది. ఆర్పీలు వెంటనే మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళా మార్ట్‌కు సంబంధించి మొత్తం లెక్కలు తేల్చే విధంగా చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. లెక్కలు తేలేనా... లేక మరుగున పడి పోతాయా అన్న అనుమానాలు సభ్యులలో నెలకొంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి మహిళామార్ట్‌లో చోటు చేసుకున్న అవినీతిపై విచారణ జరిపి సభ్యుల నుంచి వసూలు చేసిన పెట్టుబడి నిధిని తిరిగి చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



మెప్మా సీఎంఎం ఫణికుమారిని నిలదీస్తున్న ఆర్పీలు

బిల్లుల కోసం వైసీపీ నేతల కొత్త ఎత్తు

టీడీపీ నాయకుల ద్వారా యత్నాలు

నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి కంటే ఎంపీకి 300 ఓట్లు తక్కువరావడంతో మాగుంట ఆగ్రహం

దర్శి, జూన్ 25 : దర్శి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయించుకునేందుకు వైసీపీ నాయకులు కొత్తమార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగా టీడీపీ కూటమి నాయకులను ప్రసన్నం చేసుకునే యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మరికొందరు గతంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో తమకు ఉన్న పరిచయాల ద్వారా తమ పనులు చేయించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఎంపీ మాగుంటతో పాటు కూటమి నాయకులు వైసీపీ నేతలకు ఎలాంటి అవకాశం లేకుండా ద్వారాలు మూసివేసినట్లు వినికిడి.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, మార్కెటింగ్ శాఖలలో కోట్లాది రూపాయల మేర అభివృద్ధి పనులు చేపట్టారు. కొన్ని పనులు మధ్యలో నిలిచిపోయాయి. అదేవిధంగా జడ్పీ నిధుల ద్వారా కూడా పనులు చేశారు. ఈ పనులకూ బిల్లులు రాలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బిల్లులు వస్తాయని ఆ పార్టీ నాయకులు ఎంతో ఆశతో ఎదురు చూశారు. సాధారణ ఎన్నికల్లో వైసీపీ మళ్లీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది, తమ బిల్లులు మంజూరవుతాయని గట్టి ధీమాతో ఉన్నారు. ఫలితాలు వారి ఆశలను తుంచివేశాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో వారందరూ కంగుతిన్నారు. కోట్లాది రూపాయలు నిలిచిపోవటంతో పెనుభారమై ఇబ్బందులు పడుతున్న వారు.. కూటమి నాయకులను ప్రసన్నం చేసుకొని బిల్లులు చేయించుకునేందుకు కొత్త మార్గాలను అనుసరిస్తున్నారు.

కొద్ది రోజుల క్రితం తాళ్లూరు మండలంలోని కొందరు వైసీపీ నాయకులు ఎంపీ మాగుంటకు అభినందనలు తెలిపే ఎత్తుగడలో భాగంగా ఒంగోలులోని ఆయన క్యాంప్‌కార్యాలయం వద్దకెళ్లారు. ఎంపీని కలిసే ప్రయత్నం చేయగా గేటు బయట గన్‌మ్యాన్లు అడ్డుకొని వెనక్కి పంపినట్లు సమాచారం. నియోజకవర్గంలోని మరికొంతమంది నాయకులు ఎలాగోలా మాగుంటను కలిసి "మేము మీకు అంతర్గతంగా సహకరించామని, తమను ఆదుకోవాలని" కోరగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

వాస్తవంగా నియోజకవర్గంలో అసెంబ్లీ అభ్యర్థికి వచ్చిన ఓట్ల కంటే ఎంపీ మాగుంటకు 300 ఓట్లు తక్కువగా వచ్చాయి. ఈ సమాచారం తెలిసి కూడా వైసీపీ నాయకులు ఎంపీ మాగుంటను మభ్యపెట్టే ప్రయత్నం చేయడం గమనార్హం. నియోజకవర్గ టీడీపీ, జనసేన నాయకులు వైసీపీ నేతలను దరిదాపులకు కూడా చేరనివ్వటం లేదు. దీంతో వైసీపీ నాయకులు కొంతమంది స్థానిక బీజేపీ నాయకుల ద్వారా పనులు చేయించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

లక్ష్మి నిర్ణయం మేరకే పనులంటూ మంత్రుల ప్రకటన

రాష్ట్ర మంత్రులు దర్శి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలోనే జరుగుతాయని ఇప్పటికే స్పష్టం చేశారు. ఎంపీ మాగుంట కూడా దర్శిలో ఎటువంటి కార్యక్రమం చేపట్టాలన్నా కూటమి నాయకులను సంప్రదించి నిర్ణయం తీసుకుంటున్నారు. దీంతో వైసీపీ నాయకుల కొత్త ప్రయత్నాలు ఎక్కడా ఫలించే అవకాశం లేకుండా పోయింది.

నిబంధనల ప్రకారమే ఆర్టీసీ స్థలాలు లీజు

● ఆర్టీసీ జోన్-3 ఈడీ వివరణ

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 25: ఆర్టీసీ స్థలాలు లీజు కేటాయింపులు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరిగిందని, ఎలాంటి అవకతవలు జరగలేదని, పారదర్శకంగా టెండర్‌ల ప్రక్రియ నిర్వహించినట్లు నెల్లూరు జోన్-3 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన చెవిరెడ్డి చేతిలో ఆస్తులు కథనంపై స్పందించిన ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఆదాయం పెంపు, అలాగే సంస్థ అభివృద్ధి దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా టెండర్లు ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఒంగోలు, అద్దంకిలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు, మోహిత్ రెడ్డి సీఎంఆర్ సంస్థ పేరుతో అధిక బిడ్ వేశారని, అంతకుముందు ఇద్దరు టెండరు వేసినప్పటికీ వారు తాము తప్పుకుంటున్నట్లు తెలిపారు. ఆ తర్వాత వరుసలో ఉన్న సీఎంఆర్‌కు స్థలాలు కేటాయించినట్లు ఆయన వెల్లడించారు.

29న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 25: జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 29వతేదీ ఉదయం పదిన్నర గంటలకు స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జరుగుతుందని జడ్పీ సీఈవో మాధురి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగే సమావేశంలో పలు అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి సంబంధిత అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని ఆమె కోరారు.

ప్రైవేటు స్కూళ్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

చీమకుర్తి, జూన్25 : ప్రైవేటు పాఠశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులకు, అధికరేట్లకు పుస్తకాల విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం చీమకుర్తిలో ఎంఈవో శివాజీని కలిసిన వారు వినతిపత్రాన్ని అందచేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు, ఇతర కార్యకలాపాలు నిర్వహిస్తున్న పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేవరాజు, మండల అధ్యక్షుడు వాసుబాబు, నాగూర్‌మీరా, ఇత్తడి శ్రీకాంత్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నిందితుల తల్లిపై కూడా చర్యలు తీసుకోవాలి

ఈపూరుపాలెం గ్రామస్థుల డిమాండ్ ● నిరసన ర్యాలీ

ఈపూరుపాలెం (చీరాలటౌన్), జూన్ 25 : చీరాల మండలం ఈపూరుపాలెంలో ఓ యువతిపై కొందరు దుర్మార్గులు హత్యాచారం చేశారు. ఆ దుండగులు ప్రస్తుతం రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. రెండు రోజులుగా నిందితుల్లో ఒకరి తల్లి మరో మహిళతో ఫోన్‌లో మాట్లాడుతూ పోలీస్‌వ్యవస్థతో పాటు బాధిత కుటుంబాన్ని అవహేళన చేస్తూ దూషించింది. దీంతో ఈ వాయిస్ అన్ని సోషల్ మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ విషయమై ఆగ్రహించిన ఈపూరుపాలెం మహిళలు మంగళవారం స్ట్రయిట్ కట్ కాలువ దగ్గర నుంచి ప్రజా చైతన్య నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్మార్గానికి పాల్పడిన మృగాళ్లకు మద్దతు తెలిపిన తల్లిపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఎస్ఐ శివకుమార్‌కు అందించారు. కార్యక్రమంలో పవన్, బాల సందీప్, శివసాయిబాబు, వెంకటేష్, అవ్వారు లక్ష్మీ, నాశన మణికంఠ, తారక రామారావు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బండ లాగుతున్న ఎడ్ల జత


గజవాహనంపై తిరుమలనాథస్వామి

పెద్దారవీడు(మార్కాపురం), జూన్ 25: పెద్దారవీడు మండలం రాజంపల్లిలో గొబ్రాలి కొండపై వెలసిన శ్రీతిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారి మూల విరాట్‌ను ఆలయ ప్రధానార్చకుడు భవానీ ప్రసాద్ ప్రత్యేకంగా అలంకరించారు. ఈసందర్భంగా రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం ఎండ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో ముండ్లమూరు మండలం గంగన్నపాలెంకు చెందిన ఉమ్మారెడ్డి శ్రీవల్లికి చెందిన ఎడ్ల జత ప్రథమ బహుమతి రూ.50 వేలు, కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లెకి చెందిన మార్తాల సుబ్బారెడ్డి ఎడ్ల జత ద్వితీయ బహుమతి రూ.30 వేలు, కంభం మండలం దర్గాకు చెందిన కృష్ణయాదవ్‌కు చెందిన ఎడ్ల జత తృతీయ బహుమతి రూ.20 వేలు, కొమరోలు మండలం ఎడమకల్లుకు చెందిన ఎడ్ల జత చతుర్థ బహుమతి రూ.15 వేలు, దోర్నాల మండలం తిమ్మాపురంకు చెందిన నాగపోగు యోహాన్‌కు చెందిన ఎడ్ల జంట పంచమ బహుమతి రూ.10 వేలు గెలుపొందాయి. భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎమర్జెన్సీలో జైలుకెళ్లిన మల్లారెడ్డికి సన్మానం


మల్లారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు, జూన్ 25: ఎమర్జెన్సీ సమయంలో జైలుకెళ్లిన బీజేపీ మేథోకమిటీ సభ్యులు మల్లారెడ్డిని ఆపార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. 19975లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ఎమర్జెన్సీ విధించగా, దీనిని వ్యతిరేకించిన వారిని జైళ్లకు పంపారు. ఎమర్జెన్సీని వ్యతిరేకించి జైలుకు వెళ్ళినవారిలో రెడ్డి మల్లారెడ్డి ఉన్నారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు బ్లాక్‌డేగా భావిస్తూ జైలుకు వెళ్ళిన రెడ్డి మల్లారెడ్డిని సన్మానించారు. పట్టణంలోని రెండు చోట్ల ఈకార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాలలో మాజీ జడ్పీటీసీ పిడతల సరస్వతి, కిసాన్‌మోర్చ కార్యవర్గ సభ్యుడు రమేష్‌రెడ్డి, ఓబీసీ మోర్చ నాయకులు కె.నరసింహులు, దూదేకుల బాదుల్లా, అంజనేయులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు, చిన్ని సేవా సంస్థ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్, వాకర్స్ కమిటీ మాజీ అధ్యక్షుడు సూరె రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో.. మార్కాపురం వన్‌టౌన్, జూన్ 25: కాంగ్రెస్ పార్టీ విధించిన ఎమర్జెన్సీని వ్యతిరేకించిన వ్యక్తికి బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. 1975 జూన్ 25 భారత ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అని అన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ముప్పల వెంకటేశ్వర్లు పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సహకారం, సమన్వయంతోనే అభివృద్ధి

» కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 25: జిల్లాలోని అధికారుల సహకారం, సమన్వయంతో జిల్లాను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లగలిగానని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయనకు జిల్లా అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఒంగోలులోని రిమ్స్ ఆడిటోరియంలో ఘనంగా ఆత్మీయవీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో కలెక్టర్‌తో తమకున్న ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా అధికారులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ భౌగోళికంగా, సామాజికంగా భిన్న పరిస్థితులు కలిగిన జిల్లాలో పని చేసే అవకాశం తనకు దక్కిందన్నారు. జిల్లాను అభివృద్ధి దిశగా తీసుకెళ్ళడంలో తన వంతు ప్రయత్నం చేసినట్లు చెప్పారు.

ఎస్పీ గరుడ్‌సుమిత్‌సునీల్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడంలో పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయం వల్లనే సాధ్యపడిందన్నారు. అనంతరం కలెక్టర్ దినేష్‌కుమార్, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ విజయకృష్ణన్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో శ్రీలత, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కృష్ణమోహన్, ఎన్‌జీవో సంఘం నాయకుడు శరత్, వీఆర్వోల అసోసియేషన్ నాయకుడు ఆదిరెడ్డి, ఏపీజీఈఎఫ్ నాయకులు చిట్టిబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవీఎఫ్ కార్యాలయం ప్రారంభం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 25: ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ అండ్ ఫెడరేషన్ (ఏపీఎన్‌జీవీఎఫ్)కార్యాలయాన్ని ఏపీఎన్‌జీవో సంఘం ఉపాధ్యక్షుడు పి.రాజ్‌కుమార్, ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన సేవనాయక్ మంగళవారం ఒంగోలులో ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశానికి ఉమ్మడి ప్రకాశం జిల్లా ఫెడరేషన్ చైర్మన్ టీవీ.రమేష్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జేవీవోఅండ్‌వీఎల్‌వో ప్రధానకార్యదర్శి జి.రామకృష్ణ, ఫెడరేషన్ సెక్రటరీ బోనం గోవిందరాజులు, రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.లక్ష్మయ్య, ఉమ్మడి జిల్లాకు చెందిన ఫెడరేషన్ ప్రతినిధులు మునసూరి కోటేశ్వరరావు, డి.కృష్ణాంజనేయులు, వి.రవిచంద్రకుమార్, కె.శంకరరావు, బి.చరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారమైన పశుపోషణ

» పాడికి కరువు దెబ్బ

» తక్కువ ధరకు విక్రయం

» తగ్గిపోతున్న పశువుల సంఖ్య



కంభం, జూన్ 25: జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో పశుసంపదకు కరువు దెబ్బ తగిలింది. రోజురోజుకు పశువుల సంఖ్య తగ్గిపోతున్నది. పంటలు పండకపోయినా, సాగులో నష్టాలను చవిచూసినా ఆ రైతుకు ఆసరాగా ఉండే పశువులు కబేళాలకు తరలిపోతున్నాయి. ఒకవైపు కరువు, మరో వైపు వర్షాభావ పరిస్థితులతో పశుపోషణ భారమైందని రైతులు, పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాలను సంతలో అమ్మకాలకు పెడుతున్నారు. పల్లెల్లో గత వైభవం కోల్పోయి గేదెలు, ఎద్దుల కొట్టాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. రైతులకు ఎద్దులు అవసరం ఉన్నా వేల రూపాయల వ్యయం చేసి కొనుగోలు చేయలేక, చేసినా మేత కరువుపై పోషణ భారమవుతుంది. పాలిచ్చే గేదెలకు మేత కరువై విక్రయానికి సిద్ధపడుతున్నారు. పాడి పశువులకు పచ్చిమేత, తాగునీరు సైతం దొరికే పరిస్థితి లేదు. దీనితో పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతున్నది. గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా అరకొరగా నీటిని సరఫరా చేస్తున్నా పశువుల దాహం తీరడం లేదు. సకాలంలో మేత, నీరు లేకపోవడంతో బక్కచిక్కి పోతున్నాయి. పశుదానా లేక రైతులు కొండలకు వెళ్ళి ఎండుముఖం పట్టిన పచ్చిగడ్డిని సైకిళ్లపై వ్యయప్రయాసాలకోర్చి తెచ్చుకుంటున్నారు. ఎండు గడ్డి కొనే స్థోమతలేక పశువులను కబేళాలకు తరలిస్తున్నట్లు పలువురు పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం


కల్యాణంలో భూనీళా సమేత వేంకటేశ్వరుడు, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 25: బ్రహ్మోత్సవాలలో భాగంగా స్థానిక శివాజీ నగర్‌లో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరుడి ఆలయంలో మంగళవారం స్వామికి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితులు ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి పులకరించారు. అనంతరం హనుమంత వాహనంపై స్వామికి నగరోత్సవం నిర్వహించారు.

కంభంలో.. కంభం, జూన్ 25: శ్రవణ నక్షత్రం సందర్భంగా మంగళవారం కంభంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. ఈ కల్యాణానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. కల్యాణం అనంతరం నక్షతహారతి, మధ్యాహ్నం అన్న ప్రసాదం నిర్వహించారు.

వేడకగా అయ్యప్ప స్వామి జయంతి ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 25: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం లో 19వ ప్రతిష్ఠ వార్షికోత్సవం 34వ జయంతి ఉత్సవాలు మంగళవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, మహా కలశాభిషేకాలు, స్వామికి చందనాభిషేకం, పెరుగాభిషేకం, కుంకుమాభిషేకం, పసుపాభిషేకం, పాలాభిషేకం, వివిధ సుగంధ ద్రవ్యాల అభిషేకం, వివిధ పండ్ల రసాల అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం నిర్వహించారు. పెద్దఎత్తున పూజ, భజన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. సాయంత్రం పులి వాహనంపై స్వామికి నగరోత్సవం నిర్వహించారు. అయ్యప్ప స్వామి సేవా సంఘం అధ్యక్షుడు తాడువాయి గోపాల మల్లికార్జునరావు, కార్యదర్శి పడుచూరి కృష్ణయ్య, కోశాధికారి పువ్వాడ వెంకట సత్యమోహనరావు, కమిటీ నాయకులు, సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

భూసార పరీక్షలతో అధిక ప్రయోజనాలు


కంభంలో భూసార పరీక్షపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దదోర్నాల, జూన్ 25: భూసార పరీక్షలతో అధిక ప్రయోజనాలు పొందవచ్చునని వ్యవసాయాధికారి డి.జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎగువచెర్లోపల్లి గ్రామంలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. పొలంలో మట్టి సేకరణ, పరీక్షల ఆవశ్యకత, ప్రయోజనాలు వివరించారు. అనంతరం మట్టినమూనా సేకరణ విధానాన్ని ప్రయోగాత్మకంగా తెలియజేశారు. ఈఏడాది మండలంలో 498 మట్టి నమూనాలు సేకరించేందుకు ప్రభుత్వం అనుమతించిందని చెప్పారు. గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి నమూనాలను పొలాల్లో సేకరించుకోవాలని ఆయన సూచించారు.

కంభంలో.. కంభం, జూన్ 25: కంభం-1 రైతు భరోసా కేంద్రం పరిధిలో మంగళవారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మట్టి నమూనాలను సేకరించినట్లు వ్యవసాయాధికారిణి బి.స్వరూప తెలిపారు. 2024-25 సంవత్సరానికి ఆర్‌బీకే పరిధిలో 42 నమూనాలను సేకరించాల్సిందిగా లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. ఈ నమూనాలను భూసార పరీక్ష కేంద్రం ఒంగోలు వారు ఉచితంగా పరీక్షించినట్లు తెలిపారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్

» గతంలో అక్రమాలకు యత్నించిన వైనం


విలువైన స్థలాన్ని నిరుపయోగంగా వదిలేసిన ఆర్టీసీ

పొదిలి, జూన్ 25 : పట్టణంలో కోట్ల రూపాయలు విలువ చేసే పొదిలి రథం రోడ్డులో ఉన్న ఆర్టీసీ బస్ షెల్టర్ స్థలం నిరుపయోగంగా ఉంది. ఎంతో విలువైన స్థలం కావడంతో అక్రమార్కులు గతంలో ఆక్రమించుకునేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ అధికారులు బోర్డు ఏర్పాటుచేసి వబ్బం గడిపారనే విమర్శలు ఉన్నాయి. అయితే, అక్కడ ఎలాంటి కార్యకలాపాలు జరవకపోవడంతో కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంది. రాత్రిపూట మందుబాబులకు, పగలు ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్‌కు అడ్డాగా మారింది. అంతకుమించి ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడటంలేదు. రాత్రిపూట మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆప్రాంత నివాసితులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందని గృహాలవారు చెబుతున్నారు.

పొదిలిలో జాగా కనిపిస్తే చాలు పాగా వేసేస్తున్న ఈ పరిస్థితుల్లో ఆర్టీసీ వారు అంత విలువైన స్థలాన్ని వదిలేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ స్థలం షెల్టర్ మాత్రమే ఉందని, దాన్ని కూడా ఆక్రమించుకునేందుకు కొందరు పెద్దలు ప్రయత్నిస్తున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రజల సౌకర్యార్థం దాతలు ఇచ్చిన స్థలాన్ని కూడా ఆర్టీసీ యాజమాన్యం ప్రజలకోసం వినియోగించకపోవడం దురదృష్టకరమని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయం నిర్మించాలంటే స్థలం దొరకడం గగనమైపోతున్న పొదిలిలో దాతలు ఉచితంగా ఇచ్చిన స్థలాన్ని ఆర్టీసీ యాజమాన్యం వినియోగించుకోకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్సులు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు


మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూన్ 25: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాల అధ్యాపకులతో సమావేశమై సమస్యలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ డిగ్రీకళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కళాశాలలో ఉన్న బాలుర, బాలికల హాస్టల్ భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తామన్నారు. వాటిని వినియోగించుకునేందుకు కృషి చేస్తామన్నారు. డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం విద్యాశాఖ మంత్రిని కలసి నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు.

గత ఐదు సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వం కళాశాల భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించకుండా నిర్లక్ష్యం చేసిందని ఎరిక్షన్‌బాబు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా ఎరిక్షన్‌బాబును దుశ్శాలువాతో ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, అధ్యాపకులు సన్మానించారు.

రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలి


విత్తనాల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

బేస్తవారపేట, జూన్ 25: బేస్తవారపేటలోని విత్తనాల షాపులను మంగళవారం స్క్వాడ్ అధికారులు ఈ.వెంకటరమణ, వ్యవసాయాధికారి జె.మేర్సీలు ఆకస్మిక తనిఖీలు చేశారు. విత్తనాలు నిల్వ రిజిష్టర్లు, రసీదులు, రైతులకు ఇచ్చిన బిల్లులను పరిశీలించారు. విత్తన దుకాణాలలో విత్తనాల నమూనాలను సేకరించి సంబంధిత ల్యాబ్‌లకు పంపాలని వ్యవసాయాధికారికి ఆదేశించారు. దుకాణదారులు తప్పనిసరిగా కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదులు ఇవ్వాలన్నారు. దుకాణం వద్ద స్టాక్ నిల్వ, రేట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈసందర్భంగా ఓ దుకాణంలో స్టాక్ రిజిష్టర్లులో నమోదు చూపని 26 క్వింటాళ్ళ విత్తనాలను సీజ్ చేశారు. వాటికి సంబంధించిన రసీదులు చూపితే రిలీజ్ చేస్తామని చెప్పారు.

మ్యాన్ హోల్‌ను పట్టించుకోని అధికారులు

» ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేసుకున్న ప్రజలు


మ్యాన్‌హోల్‌పై ఐరన్‌గ్రిల్ ఏర్పాటు చేసుకుంటున్న ప్రజలు

గిద్దలూరు, జూన్ 25: పట్టణంలోని పాత సత్యనారాయణ థియేటర్ వద్ద మూడు రోడ్ల కూడలిలో డ్రైనేజీ కాలువపై మున్సిపల్ అధికారులు కల్వర్టును నిర్మించారు. కల్వర్టు మధ్యలో మ్యాన్‌హోల్ ఏర్పాటుచేశారు. నెలలు గడుస్తున్నా మ్యాన్ హోల్‌పై సిమెంటు దిమ్మెను గాని, ఐరన్ గ్రిల్‌నుగాని ఏర్పాటు చేయలేదు. రాత్రుళ్లు ఆ మ్యాన్‌హోల్ కనిపించక కిందపడి పలువురు గాయాలవుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలే రంగంలోకి దిగారు. చుట్టుపక్కల ప్రజలందరూ తలా ఇంత చందాలు వేసుకుని కల్వర్టుపై గల మ్యాన్ హోల్‌పై ఇనుప గ్రిల్‌ను రక్షణగా ఏర్పాటుచేసుకున్నారు. కల్వర్టు కింద ఉన్న మురికినీటి కాలువలో చెత్తాచెదారం తీయడానికి సైతం ఇనుప గ్రిల్‌ను పక్కకు తొలగించి మళ్ళీ పెట్టుకునే వెసులుబాటుతో నిర్మించుకుని మున్సిపల్ అధికారులకు చెంపపెట్టుతో సమాధానం చెప్పారు. ఈసంఘటన అధికారుల నిర్లక్ష్యానికి, ప్రజాప్రతినిధుల వైఫల్యానికి అద్దం పడుతున్నదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ మండలి గౌరవాధ్యక్షుడిగా నాగయ్య


నాగయ్య

పెద్దారవీడు(మార్కాపురం), జూన్ 25: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి గౌరవాధ్యక్షుడిగా పెద్దారవీడు మండలం సానికవరంకు చెందిన ఉప్పలపాటి నాగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండలి రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ, సాధన కోసం కృషి చేస్తానని నాగయ్య తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

త్రిపురాంతకం, జూన్ 25: మండలంలో రెండుచోట్ల జరిగిన ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. దోర్నాల మండలం అయినముక్కలకు చెందిన కుటుంబం కారులో గుంటూరు నుంచి వస్తున్నారు. ఈక్రమంలో వెల్లంపల్లి వద్ద ఎదురుగా వస్తున్న బైకును ఢీకొన్న ప్రమాదంలో కారులోని ఇద్దరికి గాయాలయ్యాయి. బైకుపై వెళుతున్న సుంకేసులకు చెందిన గుడ్డెపోగు సుబ్బయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను హైవే అంబులెన్స్ ద్వారా వైద్యశాలకు తరలించారు. త్రిపురాంతకం సమీపంలోని దయ్యపువాగు వద్ద జరిగిన మరో ప్రమాదంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో కొత్తఅన్నసముద్రంకు చెందిన పోట్ల చిన్న అంకారావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని త్రిపురాంతకంలోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు.

గిద్దలూరుకు మరిన్ని నిధులు ఇవ్వాలి

బేస్తవారపేట, జూన్ 25: గిద్దలూరు నియోజకవర్గానికి మరిన్ని నిధులు ఇవ్వాలని బీసీ గాండ్ల,తెలికుల సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు బోయిళ్ళ రోషన్‌బాబు కోరారు. ఈమేరకు మంగళవారం వెలగపూడి సచివాలయంలో నారా లోకేష్‌కు విన్నవించారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చేసిన అభివృద్ధి మరలా విజయానికి దోహదపడిందన్నారు. నియోజకవర్గానికి అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని రోషన్ బాబు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

గిద్దలూరు టౌన్, జూన్ 25: గిద్దలూరు-నంద్యాల మధ్య గల దిగువమెట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని భిక్షువు మృతిచెందాడు. రోడ్డువెంట వెళుతుండగా తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం ఆపకుండా వెళ్ళిపోయిందని, మృతిచెందిన వ్యక్తి భిక్షువు అని పోలీసులు తెలిపారు.

రూ.4 లక్షల సొత్తు చోరీ


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

తర్లుపాడు, జూన్ 25: మండలంలోని నాగెళ్లముడుపులో కందుల తిరుపాలు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కందుల తిరుపాలు పది రోజుల క్రితం ఇంటికి తాళాలు వేసి బెల్గాం వెళ్లాడు. ఇంటిలో ఎవరూలేని సమయంలో దొంగలు బీరువాల తాళాలు పగులగొట్టి అందులో ఉన్న 3 జతల కమ్మలు, 8 ఉంగరాలు, చైన్, రూ.68 వేల నగదును చోరీ చేశారు. మంగళవారం తిరుపాలు తిరిగి ఇంటికి వచ్చి తలుపులు తీయగా చోరీ జరిగినట్లు గుర్తించి తర్లుపాడు ఎస్‌ఐ వేముల సుధాకర్‌కు సమాచారం అందించారు. ఎస్‌ఐ క్లూస్ టీమ్‌తో వెళ్లి బీరువాల మీద ఉన్న వేలిముద్రలను సేకరించారు. సుమారు రూ.4 లక్షల మేర సొమ్ము చోరి జరిగినట్లు బాధితుడు తిరుపాలు తెలిపాడు. ఈమేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సరస్వతీ కటాక్షం కోసం గిరిపుత్రుల నిరీక్షణ

» పాఠశాల లేక చిన్నారులు విద్యకు దూరం


పాఠశాల ఏర్పాటు చేయాలని అధికారులను వేడుకుంటున్న గిరిజనులు

మర్రిపూడి, జూన్ 25: అది మండలంలోని గార్లపేట పంచాయతీ పరిధిలోని శివారు గిరిజన కాలనీ. ఇక్కడ నివాసం ఉండే యానాదులు పంట పొలాలకు కాపలాదారులుగా ఉంటూ జీవనం సాగిస్తుంటారు. పదేళ్ల క్రితం వరకూ వారికి పక్కా గృహాలు కూడా లేవు. పూరిగుడిసెల్లో నిత్యం విష పురుగుల సంచారం మధ్య బిక్కుబిక్కుమంటూ గడిపేవారు. రెక్కాడితే గాని డొక్కాడని ఈబడుగు జీవుల దుస్థితిని చూసి అప్పట్లో ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చలించిపోయారు.

కేంద్రప్రభుత్వ నిధులతోపాటు స్వచ్ఛంద సంస్థ సహకారంతో 30 పక్కా గృహాలను నిర్మించారు. అంతేకాకుండా పంచాయతీ కేంద్రానికి, గిరిజన కాలనీని అనుసంధానం చేస్తూ రూ.కోటి వ్యయంతో తారురోడ్డు సౌకర్యం కల్పించారు. ఆగమేఘాలపై కాలనీలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయించారు. రక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా తీర్చిదిద్దారు. ఆతరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో గ్రామాభివృద్ధి కుంటుపడింది. దామచర్ల అంజనేయులు పేరుతో వెలసిన ఈ కాలనీలో అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయించాలనే స్వామి లక్ష్యానికి ప్రభుత్వం మారడంతో బ్రేకులు పడ్డాయి.

పాఠశాల ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గార్లపేటకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. తల్లిదండ్రులు పొట్టకూటి కోసం పొద్దున్నే పిల్లలను వదిలేసి పనుల కోసం వెళుతుంటారు. ఈసమయంలో చిన్నారులు రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లలేక విద్యకు దూరమయ్యారు. 20మందికిపైగా బడిబయట ఉండిపోయారు. రెండు రోజుల క్రితం మండల విద్యాశాఖాధికారి బి.వి.రంగయ్య గ్రామానికి చేరుకొని పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులను కోరారు. ఈసందర్భంగా పిల్లలకు రవాణా సౌకర్యం కల్పించడం కానీ, ప్రత్యామ్నాయంగా పాఠశాల ఏర్పాటు కానీ చేయించాలని గ్రామస్థులు ముక్తకంఠంతో వేడుకున్నారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్వామి పాఠశాల ఏర్పాటుకు చొరవ చూపించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం


పట్టుబడినమద్యం సీసాలతో పోలీసులు

దొనకొండ, జూన్ 25 : అక్రమంగా నిల్వ చేసిన భారీ మద్యం డంప్‌ను దర్శి ఎస్‌ఈబీ పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని వీరేపల్లిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. దర్శి ఎస్‌ఈబీ పోలీసుల సమాచారం మేరకు... వీరేపల్లికి చెందిన విప్పర్ల బాలకోటయ్య తన పశువుల చావిడిలో అక్రమ మద్యం నిల్వ ఉంచినట్లు ఎస్‌ఈబీ పోలీసులకు సమాచారం అందింది. దర్శి ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సుందరరామయ్య తన సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారితో హుటాహుటిన గ్రామానికి చేరుకొని బాలకోటయ్య పశువుల చావిడిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో 180 ఎంఎల్ ఏడు రకాల బ్రాండ్లు గల 1077 మద్యం సీసాలు, 650 ఎంఎల్ రెండు రకాల బ్రాండ్లు గల 146 బీరు సీసాలు పట్టుబడ్డాయి. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సుందరరామయ్య తెలిపారు. ఈ దాడిలో ఎస్‌ఈబీ ఎస్సై కళ్యాణ్‌చక్రవర్తి, పోలీసు సిబ్బంది, వీఆర్వో హుస్సేన్‌సాహెబ్‌లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు అందజేత


నగదు అందజేస్తున్న శ్రీనివాసులు

తాళ్లూరు, జూన్ 25 : గుంటిగంగమ్మ దర్శనానికి వచ్చిన ఓ వృద్ధుడు నగదు పోగొట్టుకుని ఆందోళన చెందుతుండగా దొరికిన వ్యక్తి అందించారు. వివరాల్లోకెళ్తే.. మండలంలోని పాపిరెడ్డిపాలేనికి చెందిన వృద్ధుడు గంగిరెడ్డి యర్రయ్య గుంటిగంగ పుణ్యక్షేత్రానికి వచ్చాడు. ఆ సమయంలో తన జేబులో ఉన్న రూ.16 వేల నగదు (500నోట్ల కట్ట) జారి పడిపోయింది. తూర్పుగంగవరానికి చెందిన జొష్టి శ్రీనివాసులు బైక్‌పై వెళుతుండగా రోడ్డుపై నోట్ల కట్ట ఉన్న కవర్ కనిపించింది. డబ్బులు పోగొట్టుకున్న వృద్ధుడు తన జేబులో రూ.16 వేల నోట్లకట్ట పోయిందని పలువురికి చెప్పాడు. ఈ విషయం తెలియడంతో శ్రీనివాసులు వచ్చి బాధితునికి నగదు అందించారు.

29 నుంచి మహారుద్రపీఠం వార్షికోత్సవం

పీసీపల్లి, జూన్ 25 : మండలంలోని పెదయిర్లపాడులో మహారుద్ర పీఠం వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు పీఠం ప్రధాన అర్చకులు పలుకూరి సుబ్బారావు తెలిపారు. ఈ వార్షికోత్సవం 29 నుంచి జూలై 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం గణపతి పూజ, నవగ్రహ మండపారాధన, లక్ష్మీగణపతి హోమం, రుద్రాభిషేకం వంటి పూజలు చేస్తామన్నారు. ఆదివారం మహా మృత్యుంజయ హోమం, బిల్వార్చన, అభిషేకాలు నిర్వహిస్తామని చెప్పారు. సోమవారం మహారుద్రపీఠంలోని 1,116 శివలింగాలకు అభిషేకం, రుద్రహోమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని భక్తులందరూ రావాలని ఆయన కోరారు.

భక్తుల ఆరాధ్య దేవత అచ్చమాంబ

నేటి నుంచి దేవస్థాన బ్రహ్మోత్సవాలు


అచ్చమాంబ తల్లి పేరంటాళ్లు

పామూరు, జూన్ 25 : భక్తుల పాలిట కల్పవల్లి, కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా భక్తుల పూజలందుకుంటున్న అచ్చమాంబపేరంటాలు. దేవస్థాన బ్రహ్మోత్సవాలు 26వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నట్లు దేవస్థాన నిర్వాహకులు తెలిపారు. మండలంలోని బొట్లగూడూరు పంచాయతీ కమ్మవారిపాలెం, రఘునాథపురం మధ్య శ్రీ అచ్చమాంబ తల్లి పేరంటాళ్ల బ్రహ్మోత్సవాలకు ఇతర ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. బుధవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 30న కుంభాభిషేకం, పూర్ణాహుతి, శ్రీ వెంగమనాయుడు సమేత అచ్చమాంబ తల్లి కల్యాణ మహోత్సవం, అన్నదానం, సాయంత్రం పసుపుకుంకుమపూజలు, పెద్ద ఊరేగింపు, పాటకచేరి 1న సోమవారం ప్రాతఃకాల దర్శనాలు, అమ్మవారిపూజలు, వాహనపూజలు, పొంగళ్లు, అన్నదానం, సాయంత్రం ఎడ్లపందేలతో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

బిల్లుల కోసం వైసీపీ నేతల కొత్త ఎత్తు

టీడీపీ నాయకుల ద్వారా పలువురి యత్నాలు

ఎలాగైనా మాగుంట దగ్గరకు చేరేందుకు వ్యూహాలు

నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి కంటే ఎంపీకి 300 ఓట్లు తక్కువరావడంతో ఆయన ఆగ్రహం

ఇటీవల తాళ్లూరు మండల నేతలు కలిసేందుకు వెళ్లగా అవకాశం ఇవ్వని మాగుంట



దర్శి, జూన్ 25 : దర్శి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయించుకునేందుకు వైసీపీ నాయకులు కొత్తమార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగా టీడీపీ కూటమి నాయకులను ప్రసన్నం చేసుకునే యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మరికొందరు గతంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో తమకు ఉన్న పరిచయాల ద్వారా తమ పనులు చేయించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఎంపీ మాగుంటతో పాటు కూటమి నాయకులు వైసీపీ నేతలకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ద్వారాలు మూసివేసినట్లు వినికిడి.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మార్కెటింగ్ శాఖలలో కోట్లాది రూపాయల మేర అభివృద్ధి పనులు చేపట్టారు. కొన్ని పనులు మధ్యలో నిలిచిపోయాయి. అదేవిధంగా జడ్పీ నిధుల ద్వారా కూడా పనులు చేశారు. ఈ పనులకూ బిల్లులు రాలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బిల్లులు వస్తాయని ఆ పార్టీ నాయకులు ఎంతో ఆశతో ఎదురుచూశారు. సాధారణ ఎన్నికల్లో వైసీపీ మళ్లీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది, తమ బిల్లులు మంజూరవుతాయని గట్టి ధీమాతో ఉన్నారు. ఫలితాలు వారి ఆశలను తుంచివేశాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో వారందరూ కంగుతిన్నారు. కోట్లాది రూపాయలు నిలిచిపోవటంతో పెనుభారమై ఇబ్బందులు పడుతున్న వారు.. కూటమి నాయకులను ప్రసన్నం చేసుకొని బిల్లులు చేయించుకునేందుకు కొత్త మార్గాలను అనుసరిస్తున్నారు.

కొద్ది రోజుల క్రితం తాళ్లూరు మండలంలోని కొందరు వైసీపీ నాయకులు ఎంపీ మాగుంటకు అభినందనలు తెలిపే ఎత్తుగడలో భాగంగా ఒంగోలులోని ఆయన క్యాంప్‌కార్యాలయం వద్దకెళ్లారు. ఎంపీని కలిసే ప్రయత్నం చేయగా గేటు బయట గన్‌మ్యాన్లు అడ్డుకొని వెనక్కి పంపినట్లు సమాచారం. నియోజకవర్గంలోని మరికొంతమంది నాయకులు ఎలాగోలా మాగుంటను కలిసి "మేము మీకు అంతర్గతంగా సహకరించామని, తమను ఆదుకోవాలని" కోరగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వాస్తవంగా నియోజకవర్గంలో అసెంబ్లీ అభ్యర్థికి వచ్చిన ఓట్ల కంటే ఎంపీ మాగుంటకు 300 ఓట్లు తక్కువగా వచ్చాయి. ఈ సమాచారం తెలిసి కూడా వైసీపీ నాయకులు ఎంపీ మాగుంటను మభ్యపెట్టే ప్రయత్నం చేయడం గమనార్హం. నియోజకవర్గ టీడీపీ, జనసేన నాయకులు వైసీపీ నేతలను దరిదాపులకు కూడా చేరనివ్వటం లేదు. దీంతో వైసీపీ నాయకులు కొంతమంది స్థానిక బీజేపీ నాయకుల ద్వారా పనులు చేయించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

లక్ష్మి నిర్ణయం మేరకే పనులు అంటూ మంత్రుల ప్రకటన

రాష్ట్ర మంత్రులు దర్శి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆ నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలోనే జరుగుతాయని ఇప్పటికే స్పష్టం చేశారు. ఎంపీ మాగుంట కూడా దర్శిలో ఎటువంటి కార్యక్రమం చేపట్టాలన్నా కూటమి నాయకులను సంప్రదించి నిర్ణయం తీసుకుంటున్నారు. దీంతో వైసీపీ నాయకుల కొత్త ప్రయత్నాలు ఎక్కడా ఫలించే అవకాశం లేకుండా పోయింది.

రంగు మారిన ఎన్‌ఏపీ నీరు

నీటిలో పురుగులు.. ఆందోళనలో ప్రజలు


పచ్చగా ఉన్న ఎన్‌ఏపీ నీరు



ముండ్లమూరు, జూన్ 25 : మండలంలోని పలు గ్రామాలకు దర్శి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి సరఫరా అవుతున్న ఎన్‌ఏపీ నీరు(నెదర్లాండ్ ఎయిడ్ ప్రాజెక్ట్) కొన్ని నెలల నుంచి రంగు మారిపోయాయి. ఈ నీటినే కుళాయిలకు సరఫరా అవుతుండటంతో గత్యంతరం లేక ప్రజలు వాటిని పట్టుకుని దాహార్తి తీర్చుకుంటున్నారు. రంగు మారిన నీరు దుర్వాసన రావటంతో పాటు తలకప్పలు, పురుగులు సరఫరా అవుతున్నాయి. దీంతో పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కలుషితమైన నీటిని తాగితే జలుబు, దగ్గు, జ్వరాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల క్రితం రంగు మారిన నీరు ప్రజలు తాగటం వల్ల ఒళ్లంతా దద్దుర్లు వచ్చి నడుములు పట్టుకోవటం వంటి సంఘటనలు పలు గ్రామాల్లో జరిగాయి.

మండలంలోని పులిపాడు, పెదఉల్లగల్లు, పసుపుగల్లు, చింతలపూడి, కమ్మవారిపాలెం, వేముల గ్రామాలకు ఎన్‌ఏపీ నీరు సరఫరా అవుతోంది. కుళాయిల వద్ద పట్టుకునే బిందెలలోకి ఎక్కువగా తల కప్పల మాదిరే ఉండే పురుగులు వస్తున్నాయి. దీంతో ప్రజలు చేసేదేమి లేక కుళాయిల వద్దే వడబోసుకుని ఇంటికి తెచ్చుకుంటున్నారు. రంగు మారిన నీరు దుర్వాసన కూడా వస్తున్నాయి.

ప్రధానంగా దర్శి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నీరు అడుగంటడం, బురదగా ఉండటంతో ఆ నీటినే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పలు గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. కనీసం రెండు మూడు రోజులకు ఒకసారి సరఫరా అయ్యే నీటిలో కనీసం బ్లీచింగ్ పౌడర్ అయినా కలపాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి రంగు మారిన నీటి స్థానంలో మంచి జలాలు సరఫరా అయ్యే విధంగా చూడాలని కోరుతున్నారు.

రేపు మున్సిపల్ ఎక్స్‌అఫిషియోగా ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం

కనిగిరి, జూన్ 25 : కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గురువారం మున్సిపల్ ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ గఫార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను చైర్మన్ గఫార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. కమిషనర్ టీవీ రంగారావు, అధికారులు ఉన్నారు.

విత్తన దుకాణాలలో తనిఖీ


నిల్వలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకురాలు నీరజ

కురిచేడు, జూన్ 25 : కురిచేడు మండలంలోని విత్తనాల దుకాణాలలో యర్రగొండపాలెం వ్యవసాయ సహాయ సంచాలకులు నీరజ మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. విత్తనం అమ్మకపు లైసెన్సులు, ఇన్వాయిస్ డీలర్స్ రైతులకు ఇచ్చే రసీదులు, వివిధ విత్తనాల నిల్వ రికార్డులను పరిశీలించారు. డీలర్లకు విత్తనాల అమ్మకాలపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన అంశాలు తదితర విషయాలపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏవో మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుల తల్లిపై కూడా చర్యలు తీసుకోవాలి

ఈపూరుపాలెం గ్రామ ప్రజలు డిమాండ్

పెద్దఎత్తున నిరసన ర్యాలీ

ఈపూరుపాలెం (చీరాలటౌన్), జూన్ 25 : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలో ఓ యువతిపై కొందరు దుర్మార్గులు హత్యాచారం చేశారు. ఆ దుండగులు ప్రస్తుతం రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. రెండు రోజులుగా నిందితుల్లో ఒకరి తల్లి మరో మహిళతో ఫోన్‌లో మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థతో పాటు బాధిత కుటుంబాన్ని అవహేళన చేస్తూ దూషించింది. దీంతో ఈ వాయిస్ అన్ని సోషల్ మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ విషయమై ఆగ్రహించిన ఈపూరుపాలెం మహిళలు మంగళవారం స్ట్రయిట్ కట్ కాలువ దగ్గర నుంచి ప్రజా చైతన్య నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్మార్గానికి పాల్పడిన మృగాళ్లకు మద్దతు తెలిపిన తల్లిపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఎస్ఐ శివకుమార్‌కు అందించారు. కార్యక్రమంలో పవన్, బాల సందీప్, శివసాయిబాబు, వెంకటేష్, ఆవ్వారు లక్ష్మీ, నాశన మణికంఠ, తారక రామారావు, బాలు, ఈశ్వర్, పెద్దసంఖ్యలో మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవు : ఎంపీడీవో


మాట్లాడుతున్న ఎంపీడీవో యుగకీర్తి

తాళ్లూరు, జూన్ 25: వర్షాకాలం ఆరంభమై సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నందున గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది పారిశుధ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో కె.యుగకీర్తి హెచ్చరించారు. పారిశుధ్యంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈవోఆర్‌డీ కేజేఎస్ రాజు మాట్లాడుతూ నీటి ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదరులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లదేనన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వాలి మాట్లాడుతూ ట్యాంక్‌లను శుభ్రం చేశాక బ్లీచింగ్ చల్లాని చెప్పారు.

పాఠశాలలను తనిఖీ చేసిన జిల్లా ఉపవిద్యాశాఖాధికారి


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో

కురిచేడు, జూన్ 25 : మండలంలోని పలు పాఠశాలలను ఒంగోలు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిణి అనితారోజ్‌రాణి మంగళవారం తనిఖీలు చేశారు. పడమరనాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని పల్లెల యానాది కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో సస్పెండ్‌కు గురైన ఉపాధ్యాయుడి వివరాలను పరిశీలించారు. నాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలకు దూరంగా కడుతున్న ఒక గది గురించి వివరాలు అడిగారు. అలా ఎందుకు నిర్మించాల్సి వచ్చిందంటూ ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించారు. పాఠశాలకు దూరంగా ఉన్న గది వలన ఎవరికీ ఉపయోగం ఉండదని, తరగతి నిర్వహించటం కష్టంగా ఉంటుందని, ఆ గదిని ఎలా వినియోగంలోకి తేవాలో పరిశీలించాలని హెచ్‌ఎంకు సూచించారు. అనంతరం ఎంఆర్‌సీని సందర్శించి ఎంఈవోలను మండలంలోని పాఠశాలల గురించి, ఉపాధ్యాయుల పనితీరు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోధనంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించి అక్కడ నిర్మాణంలో ఉన్న తరగతి గదులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంఈవోలు వస్త్రాంనాయక్, సీహెచ్ సుబ్బారావులు ఉన్నారు.

పిల్లలందరూ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలి


అవగాహన కల్పిస్తున్న పద్మజ

పామూరు, జూన్ 24 : బడి వయస్సు పిల్లలందరూ బడిలో ఉండాలని, పనులకు పంపిస్తే నేరమని అంగన్‌వాడీసూపర్‌వైజర్ జి పద్మజ చెప్పారు. మండలంలోని కంభాలదిన్నె ప్రాథమిక పాఠశాలలో నేను బడికిపోతా, గ్రాడ్యుయేషన్ డే గురించి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గోవిందమ్మ, సంపూర్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మోడీ పాలనలో దేశం అగ్రస్థానం


పార్టీలో చేరిన వారితో కేవీ రమణయ్య

పామూరు, జూన్ 24 : మోదీ నాయకత్వంతో భారతదేశం అగ్రరాజ్యాల సరసన చేరిందని, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య చెప్పారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇమ్మడిశెట్టి శ్రీను, చామల శ్రీనివాసులరెడ్డి, కోనేటి సతీష్, ఆకాష్, శ్రీరామ్ రాఘవరావు, గాలేటి నాగబాబు, టీ నగేష్, చల్లగుండ్ల గోకుల్, మహేష్ తదితరులు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నేతలు చిన సుబ్బయ్య, కేవీ సుబ్బారావు, మల్లికార్జున, పీ శ్రీనివాసులు, బీ హజరత్, పాడే అరవింద్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఉగ్ర పామూరు రాక

పామూరు, జూన్ 24 : కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా పామూరులో మండల పరిషత్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో బుధవారం పాల్గొంటున్నారు.



బీపీటీ బ్లాక్

◆ నల్లబజారులో వరి విత్తనాలు
◆ కొరత పేరుతో బహిరంగ మార్కెట్లో దందా
◆ అవకాశం ఉన్నంత వరకు రైతుల నుంచి దోపిడీ
◆ డీసీఎంఎస్ కేంద్రాల్లోనూ అధిక ధరకు అమ్మకాలు

అడపాదడపా వర్షాలు పడుతున్నాయి.. పదునెక్కిన పొలాల్లో వరి సాగుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. విత్తనాలు, ఎరువులను డిమాండ్‌కు అనుగుణంగా సిద్ధం చేయాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదు. ఇదే అవకాశంగా రైతులను అందినకాడికి దోచుకోవడానికి వ్యాపారులు సిద్ధమయ్యారు. వరిలో డిమాండ్ ఉండే బీపీటీ రకం విత్తనాలను బ్లాక్ చేసేశారు. కొరత పేరుతో అధిక ధరకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ శాఖల తరపున అమ్మకాలు జరుపుతున్న కేంద్రాల్లోనూ దోపిడీ తప్పడంలేదు. విత్తనాల కొరత పేరుతో అదనపు ధరకు విక్రయిస్తున్నా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు పట్టించుకోకపోవడంతో విత్తనాల నల్లబజార్ వ్యాపారం జోరుగా సాగిపోతోంది. ఖరీఫ్‌కు ఆర్‌బీకేలు రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాలపై ఇండెంట్లు పంపలేదు. మార్కెటింగ్ శాఖ ప్రతి ఏడాది అమ్మకాలు జరిపే పరిమాణాలను దృష్టిలో ఉంచుకుని విత్తనాలను ఆయా విక్రయ కేంద్రాలకు పంపారు. అయితే ఇక్కడా అధిక రేట్లు తప్పడంలేదు.. రైతులు దోపిడీకి గురవుతున్నా పట్టించుకోవడంలేదు. 25 కిలోల బస్తాకు అదనంగా రూ.50 నుంచి రూ.100 వరకు అవకాశం ఉన్నంత వరకు రైతుల దగ్గర నుంచి దోచేస్తున్నారు.

14,275 క్వింటాళ్ల విత్తనాలు అవసరం

కృష్ణా పశ్చిమ డెల్టాలో ఖరీఫ్ సందడి వచ్చేసింది. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో 5.71 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంటుంది. ఒక్కో ఎకరాకు 20 కిలోల వరకు వరి విత్తనాలు అవసరం. ఎలుకల బెడద, ఇతర కారణాలతో నారు దెబ్బతినిపోతుందన్న ముందుచూపుతో రైతులు ఎకరాకు 25 కిలోల బస్తా తీసుకుంటున్నారు. 5.71 లక్షల ఎకరాలకు 25 కిలోల చొప్పున 14,275 క్వింటాళ్ల వరి విత్తనాల అవసరం ఉంది. అయితే ఆ మేరకు రైతు భరోసా కేంద్రాల నుంచి కానీ వ్యవసాయ శాఖ నుంచి కానీ ప్రభుత్వానికి ఇండెంట్ పంపలేదని సమాచారం. వ్యాపారులు విత్తన కొరత సృష్టించడంతో రైతుల్లో ఆందోళన మొదలైనా వ్యవసాయ శాఖ అధికారుల్లో చలనం లేదు.




విత్తనాల బస్తాలను బండిపై తీసుకు వెళుతున్న రైతు



నారుమడి సిద్ధం చేసుకుంటున్న రైతు

తెనాలి, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు వ్యవసాయ శాఖ విత్తన అవసరాలు ఎంతనేది గుర్తించి ఏపీ సీడ్స్ ప్రైవేటు కంపెనీల ద్వారా విత్తనాలను రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలి. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దీనిని విస్మరించి రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు సరఫరా అని చెప్పి కాలం గడిపారు. ఈ ఏడాది కూడా అదే తీరును చేయడంతో వ్యాపారుల పంట పండింది. తమ అవసరాలకు అనుగుణంగా విత్తనాలు అందవేమోనని రైతులు గాబరా పడుతుండగా.. అధికారులు ఆ విషయం తమకు సంబంధించినది కాదన్నట్లుగా ఉన్నారు. ఇదే అవకాశంగా వ్యాపారులు విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లుగా సబ్సిడీలను ఎగ్గొట్టేందుకు ఆర్‌బీకేల ద్వారా విత్తన విక్రమాలను చేపట్టింది. ఆర్బీకేల ద్వారా విత్తన విక్రయాలు తూతూమంత్రంగా చేపట్టారు. దీనిని ఆసరా చేసుకుని బయటి వ్యాపారులు ఇష్టానుసారంగా అధిక ధరలకు విత్తనాలను విక్రయించడం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం విత్తనాల కొరత అంతగా లేకపోయినా వ్యాపారులు విత్తన కొరతను సాకుగా చూపి రైతులను దోచేస్తున్నారు. వారిదగ్గర ఉన్న విత్తనాల్లో ఎక్కువ డిమాండ్ ఉన్న బీపీటీ విత్తనాలను అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బీపీటీ 5204, ఎంటీయూ 1262, 1224, 1061 రకాలను ఎక్కువగా పండిస్తున్నారు. అయితే వీటిలో బీపీటీ విత్తనాలకే నల్లబజార్ వ్యాపారం ఎక్కువగా సాగుతోంది. మార్కెటింగ్ శాఖ ద్వారా డీసీఎంఎస్ కేంద్రాల్లో గత ఖరీఫ్‌కు 25 కిలోల బీపీటీ 5204 విత్తనాల బస్తా రూ.1030కి అమ్మితే, ఈ ఏడాది రూ.1100 చేశారు. ఒక సీజన్‌కే బస్తాకు రూ.70 పెంచేశారు. దీనితో సరిపెట్టుకుందామనుకుంటే, కొన్ని కేంద్రాల్లో రైతుల అవసరాలను అదనుగా చేసుకుని బస్తాకు రూ.50 నుంచి రూ.100కిపైగా అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. అదేమని రైతులు ఎవరైనా అడిగితే అవన్నీ మా జేబులోకి వెళ్లవని, పైవారికి పంపాలని చెప్పిమరీ వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. బీపీటీ రకాల్లో కూడా కరీంనగర్, వరంగల్ ప్రాంతాల విత్తనాలకు తక్కువ డిమాండ్ ఉంటే, నంద్యాల రకాలకు మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో కరీంనగర్, వరంగల్ విత్తనాలను బస్తాపై రూ.50కి అదనంగా అమ్మేస్తుంటే, నంద్యాల రకాలను మాత్రం నిలబెట్టి రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల, తెనాలి, పొన్నూరు ప్రాంతాల్లోని కేంద్రాల్లో ఈ అధిక రేట్ల దోపిడీ సాగుతోందనేది రైతుల మాట. దుగ్గిరాలలో రూ.100 చొప్పున అదనంగా ఇవ్వాల్సిందేనని సిబ్బంది డిమాండ్ చేయటంతో సోమశేఖర్ అనే రైతు బిల్లు కావాలని కోరగా సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. ఇక వ్యాపారులు ఒక్కో రైతు దగ్గర ఒక్కోరేటు తీసుకుంటున్నారు. ఏ రకం విత్తనాలకయినా రూ.100 అదనంగా తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు.



సాధారణంగా.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నకిలీలు ఉంటాయి. ఈ నకిలీలను పసిగట్టాల్సిన.. అరికట్టాల్సిన.. వ్యవసాయ శాఖ కూడా నకిలీ మయంగా మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి. నకిలీలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన వ్యవసాయ అధికారులు కూడా నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు వెలగబెడుతున్నారంటే ఆశ్చర్యం కాదు. ఇలాంటి వారు రైతులకు వ్యవసాయ పాఠాలు ఏవిధంగా చెప్తారో ఎవరికీ తెలియదు. పదో తరగతి ఫెయిలై.. ఇంటర్‌లో ఎంపీసీ చదివిన వారు కూడా ఏజీబీఎస్సీ సర్టిఫికెట్లు పొంది ఏవోలుగా ఉద్యోగాలు సాధించారు. పదో తరగతి పాసై.. ఇంటర్‌లో బైపీసీ చదివిన వారికే ఏజీబీఎస్సీ చదివే అవకాశం ఉంటుంది. అయితే అలాంటిదేమీ లేకుండా మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని యూనివర్సిటీల్లో ఏజీబీఎస్సీ చదివినట్లుగా సర్టిఫికెట్లు పుట్టించి ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఉద్యోగాలు సాధించారు. వీరిపై గత టీడీపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించగా.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పట్టించుకోలేదు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు సాధించిన పలువురు ఏవోలుగా ఏడీఏలుగా ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఏవోల్లోనూ.. నకిలీలు

● సాగంటే తెలియని అధికారులు
● ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర డిగ్రీలతో ఉద్యోగాలు
● ఎంపీసీ.. పది ఫెయిలైనా ఏజీబీఎస్సీ సర్టిఫికెట్లు
● ఆ సర్టిఫికేట్లతో ఉద్యోగోన్నతులతో అర్హులకు అన్యాయం
● విచారణ నివేదికను బుట్టదాఖలు చేసిన వైసీపీ ప్రభుత్వం

గుంటూరు సిటీ, జూన్ 25: ఖరీఫ్.. రబీ అంటే ఏమిటో వారికి తెలియదు. భూమిలో ఉండాల్సిన పోషకాలు ఎన్నో అసలే ఎరుగరు. పది మంది రైతులను కూర్చోబెట్టి పట్టుమని పది నిమిషాలు పంటల సాగుపై అవగాహన కల్పించలేరు. అయినా వారు ఏవో(అగ్రికల్చర్ ఆఫీసర్, వ్యవసాయ అధికారులు)లు అయ్యారు. కొందరు ఏడీఏ(అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్)లు కూడా అయ్యారు. వీరంతా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో ఏజీబీఎస్సీ(అగ్రికల్చర్ బీఎస్సీ)లు చదివినట్లు డిగ్రీలు పుట్టించి దొడ్డిదారిలో ఇక్కడ ఉద్యోగాలు పొందారు. కొందరు ఇంటర్‌లో ఎంపీసీ చదివినా ఆ తదుపరి ఏజీబీఎస్సీ చదివినట్లుగా డిగ్రీలు తెచ్చారు. కొందరు పదో తరగతి తప్పినా కూడా ఏజీబీఎస్సీ చదివినట్లు సర్టిఫికెట్‌లు పుట్టించి ఉద్యోగాలు కొట్టేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం ఈ బాపతు ఏవోలే ఎక్కువ మంది ఉన్నారు. 2018లో వీరిపై అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం విచారణకు కమిటీ వేయగా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నివేదికను బుట్టదాఖలు చేసినట్లు తెలుస్తోంది. అనర్హులు అందలాలు ఎక్కడంతో అర్హులైన వారు ఇంకా వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులుగానే మగ్గిపోతున్నారు.

తేలికగా డిగ్రీలు

మన రాష్ట్రంలోని వ్యవసాయ కళాశాలల్లో ఏజీబీఎస్సీ సీటు రావడం చాలా కష్టం. ఒక వేళ సీటు వచ్చినా నాలుగేళ్లు చదివి 156 పరీక్షలు రాస్తేనే డిగ్రీ వస్తుంది. ఇంత కష్టం మనం ఎక్కడ పడతాములే అనుకున్న వారు ఉత్తరప్రదేశ్(ఆగ్రా యూనివర్సిటీ), మహారాష్ట్ర(బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ) నుంచి తేలిక పద్ధతిలో డిగ్రీలు తెచ్చుకున్నారు. అక్కడ సొయంత్రం కాలేజ్ పేరుతో ఈ చదువులు సాగాయి. వాస్తవానికి ఏజీబీఎస్సీ చదవాలంటే ఇంటర్‌లో బైపీసీ చదవాలి. పొరుగు రాష్ట్రాల యూనివర్సిటీల నుంచి డిగ్రీలు పొందిన వారు ఇంటర్‌లో ఎంపీసీ చదివినా ఏజీబీఎస్సీ చదివినట్లుగా డిగ్రీలు ఇచ్చారు. కొందరు అసలు పదో తరగతి కూడా చదవకుండానే డిగ్రీని పట్టేశారు.

విచారణ లేకుండానే..

నకిలీ డిగ్రీలతో వ్యవసాయ అధికారులుగా ఉద్యోగాలు పొందిన వారంతా ఒకే వర్గానికి చెందిన వారు. ఉమ్మడి జిల్లాలో 19 మంది ఈ బాపతు వారే ఉన్నారు. అప్పట్లో రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఉద్యోగాలు



పొందారు. వాస్తవానికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చాక పోలీసు విచారణ ఉంటుంది. వీరి విషయంలో అటువంటిదేమీ జరగలేదని సమాచారం. కనీసం ఏజీబీఎస్సీ సర్టిఫికెట్‌లు ఇచ్చిన యూనివర్సిటీలు ఉన్నాయా లేదా అని కూడా విచారించిన నాథుడు లేడు. నకిలీ సర్టిఫికెట్లతో కొందరు వ్యవసాయ అధికారులుగా ఉద్యోగాలు పొందడంపై 2018లో పెద్ద దుమారం రేగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పద్ధతిలో 175

అన్నీ పెద్ద తలలే..

అసలు వైద్యం తెలియని వ్యక్తి డాక్టర్ అవతారం ఎత్తితే ఎంత ప్రమాదం జరుగుతుందో.. అర్హత లేని వ్యక్తి వ్యవసాయ అధికారిగా చెలామణీ అయితే అంతకంటే ఎక్కువ ప్రమాదం జరుగుతుంది. అయినా వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లోని కొందరు పెద్ద అధికారులు నకిలీ వ్యవసాయ అధికారులు కేసును నీరుగార్చడంలో ప్రధాన పాత్ర పోషించారన్న ఆరోపణలున్నాయి. యూనియన్‌కు చెందిన ఓ నాయకుడి సతీమణి కనుసన్నల్లోనే ఇతర రాష్ట్రాల యూనివర్సిటీలు అడ్మిషన్లు ఇస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. వారే ఊరు పేరులేని యూనివర్సిటీలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ కేసు విచారణ ముందుకు సాగకుండా ఉండేందుకు అప్పట్లో కోట్ల రూపాయలు చేతులు మారినట్లు చెబుతున్నారు.

మంది ఉద్యోగాలు పొందడంపై ఏజీబీఎస్సీ చదివిన విద్యార్థులు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఆందోళనకు దిగారు. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం అమృతకుమార్ కమిటీని నియమించింది. దాంతోపాటు త్రీ మెన్ కమిటీని ఏర్పాటు చేసింది. సీఐడీ కూడా దర్యాప్తు ప్రారంభించింది. అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలినట్లు సమాచారం. ఇంతలో ప్రభుత్వం మారడంతో విచారణ నివేదికలు బుట్టదాఖలయ్యాయి.

తీరని అన్యాయం

నకిలీ డిగ్రీలతో కొందరు వ్యవసాయ అధికారులుగా ఉద్యోగాలు పొందడం వల్ల అర్హులైన వారికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. నకిలీ డిగ్రీతో ఉద్యోగం పొందిన వారిలో కొందరు ఏడీఏలుగా కూడా ఉద్యోగోన్నతి పొందారు. వాస్తవానికి మన రాష్ట్రంలో ఏజీబీఎస్సీ చదివిన వారికి ఎక్కువ మార్కులు ఉన్నప్పటికీ, పక్క రాష్ట్రాల డిగ్రీలకు ఎక్కువ గ్రేడ్ పాయింట్లు ఉన్నట్లుగా చూస్తుండటంతో ఉద్యోగోన్నతుల్లో ఇక్కడ చదివిన వారికి అన్యాయం జరుగుతోందంటున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 45 మంది వ్యవసాయ విస్తరణ అధికారులుగా పనిచేస్తున్నారు. వారికి ఎప్పుడో వ్యవసాయ అధికారులుగా ఉద్యోగోన్నతులు రావాల్సి ఉంది. వక్రమార్గంలో వచ్చిన వారి వల్ల వీరికి కూడా అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. టీడీపీ ప్రభుత్వం ఈ వ్యవహారంపై లోతైన విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రామాపురం బీచ్ వద్ద బందోబస్తు

జాగ్రత్తలు సరే.. ఆంక్షలు ఎలా?

● తీరంలో పర్యాటకులపై పోలీసు నిషేధాజ్ఞలు
● ప్రభుత్వ సూచనపై వేచిచూసే ధోరణిలో రిసార్ట్ నిర్వాహకులు
● ప్రణాళికతో కార్యాచరణ రూపొందించాలని పర్యాటకుల డిమాండ్

చీరాల, జూన్ 25: అలల సవ్వడి. ఆహ్లాదకర వాతావరణం.. ఆదమరిస్తే ప్రాణాలకే ముప్పు. ఇటీవల జిల్లా పరిధిలోని తీర ప్రాంతంలో పలు విషాదకర ఘటనలు సంభవించగా.. పదుల సంఖ్యలో మృతిచెందారు. తీరంలో జరుగుతున్న మానవ తప్పిదాలతో అంతిమంగా ప్రాణాలను మూల్యంగా చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తీరంలో వరుస సంఘటనల నేపథ్యంలో పోలీసులు పర్యాటకుల రాకను నిషేధించారు. దీనిని పర్యాటకులు తప్పుబడుతున్నారు. పోలీసుల నిర్ణయం కాలికి దెబ్బతగిలితే.. కంటికి మందు వేసినట్లుగా ఉందని ప్రజలంటున్నారు. జాగ్రత్తలు తీసుకోవడం అభినందనీయమే కానీ మూలాల్లోకి వెళ్లకుండా కేవలం పర్యాటకులను అడ్డుకున్నంత మాత్రాన సమస్య పరిష్కారం కాదంటున్నారు. ప్రమాదాల నివారణకు రిసార్టుల నిర్వాహకులు, పాలకులు, అధికారులు నిర్ణయాలు తీసుకోవాలని, అప్పుడే ఫలితం ఉంటుందనేది వారి వాదన.

సహజత్వం కోల్పోయిన తీరం..

సునామీకి ముందు బాగా ఉన్న సముద్రం ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలతో సహజత్వం కోల్పోయింది. బల్లపరుపుగా ఉండాల్సిన సముద్రపు అడుగుభాగంలో తీరానికి దగ్గర్లోనే భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ కారణంగానే మరణాలు ఎక్కువ అవుతున్నాయి. మత్స్యకారుల భూముల్లో ఏర్పాటు చేసిన రిసార్టుల కోసం తీరానికి రక్షణగా ఉండే మడచెట్లు, సరిగ చెట్లను తొలగించారు. మడ చెట్ల మాయంతో ప్రకృతి సిద్ధంగా అలలు, ఇసుక రాకపోకలలో సహజత్వం పోయింది. దీంతో క్రమేణా తీరంలో సముద్రపు అడుగు భాగంలో అస్థిర స్థితి ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతోందని మత్స్యకారులు చెప్తున్నారు.

వేచి చూసే ధోరణిలో రిసార్ట్ నిర్వాహకులు

తీరంలో చోటుచేసుకుంటున్న ఘటనలపై ప్రభుత్వం స్పందించింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పోలీస్ అధికారులు, రిసార్ట్‌ల నిర్వాహకులతో ఇటీవల సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్థిక పరమైన అంశాలపై స్పందించాల్సిన రిసార్టుల యజమానులు వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు సమాచారం. తమ పరిధి వరకు బాధ్యత తీసుకుంటామని, ఇతర ప్రాంతాల్లో జరిగే ప్రమాదాలకు తామెలా బాధ్యత తీసుకుంటామని ప్రశ్నిస్తున్నారు. వెంటనే స్పందిస్తే జాగ్రత్తలకు సంబంధించిన చర్యలను అధికారులు తమకు అంటగడతారనే భావనలో ఉన్నారు. ఆయా అంశాలపై సూర్యలంక నుంచి పొట్టి సుబ్బయ్యపాలెం వరకు ఉన్న రిసార్టుల యజమానుల్లో పలువురి మధ్య అంతరంగిక సంభాషణ జరుగుతున్నట్లు సమాచారం.

నిధుల సమీకరణ ఇలా చేస్తే..

సూర్యలంక నుంచి పొట్టి సుబ్బయ్యపాలెం వరకు చిన్నా, పెద్దా రిసార్టులలో సుమారు 300 గదులు ఉన్నాయి. వారాంతపు రోజుల్లో రిసార్టు లలో ఎక్కువ భాగం బిజినెస్ ఉండేది. ఆ క్రమంలో ప్రతి రిసార్ట్ నుంచి వారానికి ఒక రోజు లో గదికి ఎంత అద్దె వసూలు చేస్తారో అంత తీరంలో తీసుకునే భద్రతా చర్యలకు కాంట్రిబ్యూషన్‌గా కేటాయించాలి. ఆ క్రమంలో చిన్నా, పెద్దా రిసార్టులకు సంబంధించి గదికి సరాసరిన రూ.2,000 లెక్కన లెక్కకట్టినా, వారానికి రూ.6,00,000 అవుతాయి. నెలకు రూ.24 లక్ష లు అవుతాయి. అలానే ప్రభుత్వ పరంగా కొన్ని నిధులు సమీకరించుకుంటూ ముందుకు సాగా లి. వాటితో ప్రాథమికంగా నిర్లక్ష్య నీడన ఉన్న కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ (మెరైన్) విభాగాన్ని బలోపేతం చేయాలి. నిర్దేశిత స్నాన ప్రదేశాలను ఏర్పాటు చేయాలి. భద్రత చర్యలు చేపట్టాలి. ఇలా చేస్తే చాలా వరకు ప్రయోజనం ఉంటుంది.



పోలీస్ అధికారులు, రిసార్ట్స్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య (పాత చిత్రం)

రిసార్ట్స్ నిర్వాహకులతో మరోమారు చర్చలు

స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మరోమారు ఎమ్మెల్యే కొండయ్య, డీఎస్పీ బేతపూడి ప్రసాద్, రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, వేటపాలెం ఎస్ఐ సురేష్ రిసార్టుల నిర్వాహకులతో చర్చలు జరిపారు. ప్రమాదాల నివారణపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ముందుగా అసోసియేషన్‌గా ఏర్పడి నిధులు సమీకరించాలని నిర్ణయించారు. సదరు నిధులతో తీరంలో ఆరు ప్రదేశాలను బీచ్ ఏరియాలుగా శుభ్రపరచి, అక్కడే సముద్రంలో దిగేలా చర్యలు చేపట్టాలని, నిర్దేశిత పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని భావించారు. లైఫ్ జాకెట్లు, పోలీస్ పికెట్, వాచ్ టవర్స్ తదితర ఏర్పాట్లకు ఆ నిధులను వినియోగించేందుకు కార్యాచరణతో ముందుకు సాగుతామని రిసార్ట్స్ ప్రతినిధులు తెలిపారు.

ఏఎన్‌యూలో పీసెట్ దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం



రన్నింగ్ పోటీలో తలపడుతున్న అభ్యర్థులు

పెదకాకాని, జూన్ 25: ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ దేహదారుఢ్య పరీక్షలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షలను మంగళవారం నుండి ప్రారంభించినట్లు పీసెట్ -2024 కన్వీనర్ ప్రొఫెసర్ పి.జాన్సన్ తెలిపారు. చివరి రోజు 27వ తేదీన మహిళా అభ్యర్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. దేహదారుఢ్య పరీక్ష లలో 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, 800 మీటర్ల పరుగుతో పాటు అభ్యర్థి ఎంపిక చేసుకున్న ఒక ఆటలో ప్రావీణ్యం పరీక్షిస్తారు. వీటితోపాటు అభ్యర్థులు తాము సాధించిన జాతీయ, అంతర్జాతీయ పోటీలలో క్రీడా ప్రతిభకుగాను ప్రోత్సాహక మార్కులు కేటాయించ నున్నట్లు పేర్కొన్నారు. తొలిరోజు 580మంది అభ్యర్థులకుగాను 379మంది అభ్యర్థులు హాజర య్యారు. ఈ పరీక్ష నిర్వహణ కొరకు రాష్ట్రం నుండి వివిధ విశ్వవిద్యాలయాలు, అను బంధ కళాశాలల వ్యాయామ అధ్యాపకులు, స్టేట్ కమిటీ సభ్యులను పర్యవేక్షకులుగా వ్యవహరించారు.

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

పరిష్కరించాలని మంత్రి లోకేశ్ ఆదేశాలు



దివ్యాంగుడి సమస్య వింటున్న మంత్రి లోకేశ్

మంగళగిరి, జూన్ 25: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సామాన్యుల నుంచి ఉద్యోగులు, యువత, వివిధ సంఘాల ప్రతినిధులు లోకేశ్ ప్రజా దర్బార్‌కు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజలు తమ సమస్యలను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి అర్జీలను లోకేశ్ స్వయంగా స్వీకరించి సంబంధిత శాఖలకు పంపి పరిష్కరించాలని ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వం తొలగించిన సీఆర్డీఏ పింఛన్ పునరుద్ధరించాలని ఎర్రబాలెం గ్రామానికి చెందిన తాడిబోయిన నాగరాజు కోరారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం పొందుగలలో తనకు వంశపారంపర్యంగా వచ్చిన వ్యవసాయ భూమి, నివాస స్థలాన్ని తన బంధువులు కబ్జా చేశారని, వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని మంగళగిరికి చెందిన మల్లెల రామారావు కోరారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తె వైద్యానికి ఆర్థికసాయం చేయాలని ఆత్మకూరుకు చెందిన ఎం.సుజాత, డిగ్రీ చదివిన తనకు ఉద్యోగం కల్పించాలని పాతమంగళగిరికి చెందిన నాగభవాని అర్జీలు అందజేశారు. నూతన వైద్య కళాశాలల్లో మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి సంబంధించి జీవో 107, 108లతో పేద, మధ్యతరగతి విద్యార్థులు నష్టపోతున్నారని, తక్షణమే ఆయా జీవోలను రద్దు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు. ఏపీ కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, టెక్నికల్ బోటు సిబ్బందిని వైసీపీ ప్రభుత్వం విధుల నుంచి తొలగించిందని, తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని ఉద్యోగులు కోరారు.

మహిళలకు చేయూత అందిస్తాం



సర్టిఫికెట్‌లను అందజేస్తున్న డీడీఎం రవికుమార్

అద్దంకిటౌన్, మే 25 : మహిళా సాధికారతే లక్ష్యంగా నాబార్డు కృషి చేస్తుందని, అయా రంగాల్లో మహిళలకు చేయూతను అందిస్తామని నాబార్డు డీడీఎం జె.రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నాబార్డు సహకారంతో గ్రాస్ సంస్థ ఆధ్వర్యంలో వివిధ కోర్సులల్లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికేట్‌ల ప్రదాన కార్యక్రమం జరిగింది. గ్రాస్ సంస్థ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా బ్యూటీషియన్, బ్రైడల్ మేకప్, జ్యూలరీమేకింగ్, శారీ డ్రాపింగ్ వంటి వాటిలో శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లను అందజేశారు. శిక్షణ పొందిన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ మేనేజర్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

మేదరమెట్ల, జూన్ 25 : మండలంలోని రావినూతలల్లో మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా కరెంట్ కోత ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయ అభ్యర్థులలో ఆనందం

మెగా డీఎస్సీకి మంత్రిమండలి ఆమోదం

జిల్లాలో 672 ఖాళీలు

ఒంగోలు(విద్య), జూన్ 25 : జిల్లాలో ఉపాధ్యాయ అభ్యర్థుల కల నెరవేరనుంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ కార్యరూపం దాల్చింది. కూటమి నిరుద్యోగ టీచర్లకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబునాయుడు తన తొలి సంతకాన్ని మెగా డీఎస్సీ ఫైల్‌పై పెట్టి ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని నిరూపించారు. మొదటి మంత్రివర్గ సమావేశంలోనే మెగా డీఎస్సీ నిర్వహణకు ఆమోదముద్ర వేసి తన నిబద్ధతను చాటుకున్నారు. మొత్తం 16,347 టీచర్ పోస్టుల భర్తీకి జూలై 1న నోటిఫికేషన్ జారీచేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మెగా డీఎస్సీ నిర్వహణ నేపథ్యంలో మరోసారి ఉపాధ్యాయుల అర్హతా పరీక్ష(టెట్)ను నిర్వహించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ఈ తరుణంలో టెట్ నిర్వహణకు పూనుకుంటే డీఎస్సీ ఆలస్యం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి రెండు ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు ఉంచారు. ఈ రెండింటిలో ప్రభుత్వం ఏ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసి డీఎస్సీపై ముందుకుపోతుందో చూడాల్సి ఉంది. గత ప్రభుత్వం ఒక డీఎస్సీ కూడా నిర్వహించలేదు. డీఎస్సీ-1998, డీఎస్సీ 2008 అభ్యర్థులకు కొంతమందికి ఉద్యోగాలు కల్పించి మ.మ అనిపించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు 6,100 టీచర్ పోస్టులను భర్తీచేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో డీఎస్సీ ప్రక్రియను ఎన్నికల కమిషన్ నిలిపివేసింది.

జిల్లాలో 672 పోస్టులు

మెగా డీఎస్సీలో జిల్లాలో 672 ఖాళీలను చూపించారు. అందులో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు కేవలం 124 కాగా స్కూలు అసిస్టెంట్లు, ఇతర పోస్టులు 548 ఉన్నాయి. విద్యాశాఖ అధికారిక లెక్కల ప్రకారం జూన్ 1 నాటికి మొత్తం 978 ఖాళీలు ఉన్నాయి. వీటిల్లో ఎస్జీటీ పోస్టులు 422 ఉన్నాయి. మెగా డీఎస్సీకి మాత్రం 398 పోస్టులు తగ్గించి కేవలం 124 పోస్టులను మాత్రమే ప్రకటిస్తున్నారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలు 24, స్కూలు అసిస్టెంట్ బీఎస్ 61, ఇంగ్లీషు 65, హిందీ 25, గణితం 65, ఫిజికల్ ఎడ్యుకేషన్ 167, పీఎస్ 45, సోషల్ స్టడీస్ 83, తెలుగు 21 కలిపి మొత్తం 556 ఖాళీలు ఉన్నాయి. వీటిలో అధికారికంగా డీఎస్సీకి ఎన్ని పోస్టులు ప్రకటిస్తారో వేచి చూడాల్సి ఉంది.

టీచర్ల సర్దుబాటుకు గ్రీన్‌సిగ్నల్

వెంటనే చేయాలని ఆర్జేడీ ఆదేశం

ఒంగోలు(విద్య), జూన్ 25 : ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు పిల్లలు లేని పాఠశాలల నుంచి టీచర్లను సర్దుబాటు చేయాలని పాఠశాల విద్యా గుంటూరు ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. హైస్కూలు ప్లస్‌లకు టీచర్లను సర్దుబాటు చేయమన్నారు. మంగళవారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ఆర్జేడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వెబెక్స్ నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమమైన నేను బడికిపోతా, విద్యాప్రకాశం కార్యక్రమాలను విజయవంతం చేసి బడీడు బాలబాలికలను నూరు శాతం పాఠశాలల్లో నమోదుచేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు వచ్చిన మెటీరియల్‌ను అందజేయాలన్నారు. కేజీబీవీలు, ఏపీ మోడల్ స్కూళ్ళ హైస్కూలు ప్లస్ పనితీరును సమీక్షించారు. హైస్కూలు ప్లస్‌లలో విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫాం, షూలు, ఇతర మెటీరియల్‌ను అందించాలన్నారు. సమీక్షలో డీఈఓ సుభద్ర పాల్గొన్నారు. మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి సందర్శించారు. విద్యార్థి కిట్ల పంపిణీని పరిశీలించారు.

న్యూస్ పేపర్ అలవెన్స్ కట్

ఒంగోలు(విద్య), జూన్ 25: గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు న్యూస్ పేపరు అలవెన్స్‌ను ప్రభుత్వం కట్ చేసింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల జూన్ నెల వేతన బిల్లులు కూడా నిలిపివేయాలని ప్రభుత్వ ఖజానా శాఖ డైరెక్టర్‌కు లేఖ రాసింది. డీడీఓలు వీరి జీతం, గౌరవవేతనంతోపాటు న్యూస్ పేపర్ అలవెన్స్ రూ.200 కలిపి బిల్లులు ఖజానా శాఖకు సమర్పించారు. అయితే ప్రభుత్వం వీరికి తక్షణమే న్యూస్ పేపర్ అలవెన్స్ కట్ చేయమని ఆదేశాలు చేసినందున ఖజానాకు సమర్పించిన బిల్లులను రద్దుచేయమని ఆ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. న్యూస్‌పేపర్ అలవెన్స్‌ను మినహాయించి కేవలం గౌరవ వేతనం బిల్లులు మాత్రమే తిరిగి ఖజానాకు సమర్పించాల్సి ఉంటుంది.

కురవని వాన.. కదలని సాగు

మండుతున్న ఎండలు
ఆందోళన చెందుతున్న రైతులు
మేలో మోస్తరు.. ఇప్పుడు వర్షాభావం
పక్షం రోజులుగా వేడి గాలులు
తొలకరి సాగు సందిగ్ధం
దుక్కులు దున్ని ఎదురుచూస్తున్న రైతులు

ఒంగోలు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి)/పెద్దదోర్నాల : ఆశలు రేకెత్తించిన వరుణుడు మొహం చాటేశాడు. దీంతో తొలకరి సాగు సందిగ్ధంలో పడింది. వెరసి ఇప్పటికే వేసిన ప్రధాన పంటలు పాడయ్యే పరిస్థితి కనిపిస్తోంది. జూన్ ఆఖరి వారంలోకి వచ్చినా పట్టుమని పదివేల హెక్టార్లలో కూడా పంటల సాగు కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం లక్ష 72వేల హెక్టార్లు కాగా తొలకరి (జూన్)లో దాదాపు 12 నుంచి 15 వేల హెక్టార్లలో సజ్జ, నువ్వు, పెసరతో పాటు పశుగ్రాసం పంటలు సాగు చేశారు. అలాగే జూన్ రెండవ పక్షం నుంచి ప్రధాన పంటలైన కంది, పత్తి విత్తనాలు వేయడం ప్రారంభిస్తారు. జూలై, ఆగస్టు నెలల్లో విస్తారంగా పంటలు సాగవుతాయి. మే ఆఖరులో లేదా జూన్ తొలివారంలో కురిసే వర్షాలతో తొలకరి పైర్లు వేయడంతో పాటు ఖరీఫ్ పంటలకు దుక్కులు సిద్ధం చేస్తారు. ఈ ఏడాది అలాంటి వ్యవసాయ సీజన్‌కు పరిస్థితి అనుకూలించింది. మే నెలాఖరులో ఒక మోస్తరు జల్లులు పడగా ఈనెల తొలి వారంలో విస్తారంగానే వర్షం పడింది. ఈ నెలలో 57.90 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా తొలివారం నాటికే ఇంచుమించు 75 మి.మీ కురిసింది. నెలమొత్తం కురవాల్సిన దాని కన్నా ఎక్కువగా కురవడమే కాక కొన్నిచోట్ల భారీవర్షంతో వాగులు, వంకలు, చెక్‌డ్యాములలో నీరు చేరింది. దీనికి తోడు ఈ ఏడాది మంచి వర్షాలు ఉంటాయన్న సంకేతాలను వాతావరణ శాఖ ఇచ్చింది.

-దోర్నాల మండలంలో సాగు చేసిన పత్తి పైరు రైతులకు గుదిబండగా మారింది. మే నెలలో కురిసిన మోస్తరు వానతో పాటు వాతావరణంలో మార్పులు వచ్చాయని, ఈ ఏడాది వర్షాలు సాధారణ స్థాయికి మించి కురుస్తాయని ఆ శాఖాధికారులు ప్రకటించారు. దీంతో రైతుల్లో సాగు పట్ల ఆసక్తి పెరిగింది. ఈక్రమంలో బోరుబావుల కింద 500 ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారు. పైరు నెల, నెలన్నర దశల్లోకి వచ్చింది. ఇప్పుడు కీలకమైన సమయం. అయితే వర్షాభావంతో బోర్లు వట్టిపోయాయి. పైగా ఎండలు మండిపోతూ వడగాలులు వీస్తున్నాయి. నీటి తడులు లేక పైరు బెట్టకు వచ్చింది. మరో 20రోజులకు పూతదశకు వస్తుంది. ఇప్పటికే ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేలు ఖర్చయిందని, పంటను కాపాడుకోవడం ఎలా అని రైతులు మదనపడుతున్నారు.

ఎండలు చుక్కలు చూపిస్తున్నాయి. కాడీ పట్టాలనుకునే కర్షకుడికి కళ్లు బైర్లు కమ్మే పరిస్థితి. గత మూడేళ్లుగా ఇదే తంతు. మే ఆఖరులో మోస్తరు వాన కురిసి మురిపించింది. ఆ తర్వాత మేఘాలు దోబూచులాడాయి. వారం నుంచి వేసవిని మించి ఎండలు దంచి కొడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ వచ్చి నెల దగ్గరపడుతున్నా వాన జాడ లేదు. దీంతో సాగు ముందుకు కదలడం లేదు. వేసిన పైర్లు మొక్క దశలోనే వాడు మొహం పట్టాయి. అది చూసి రైతులకు కునుకు పట్టడం లేదు. ఈ ఏడాది కూడా సాగు కష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. మరోపక్క గ్రామాల్లో ప్రజలు నీటి కోసం నానా తిప్పలు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో బోరుబావుల్లో కొద్దో గొప్పో వస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. అవి ఏపాటికి సరిపోవడం లేదని రోజు ఏదొక ప్రాంతంలో ధర్నాలు చేయడం పరిపాటిగా మారింది.



దున్ని సాగుకు సిద్ధంగా ఉంచిన భూమి

ఉత్సాహంగా పంటల సాగు

సీజన్ బాగుంటుందన్న భావన రైతులలో కలిగి ఉత్సాహంగా సాగుకు ఉపక్రమించారు. చాలా చోట్ల పలురకాల విత్తనాలు వేయడంతో పాటు ఖరీఫ్ సీజన్ పంటల సాగు కోసం దుక్కులు దున్ని సిద్ధం చేశారు. అయితే ఈ పరిస్థితులలో ఇంచుమించు పక్షంరోజులుగా వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో పంటల సాగు మందగించింది. ఈ సమయానికి కనీసం 12వేల నుంచి 15వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంటల సాగై ఇతర పంటలు విత్తే పనులు ముమ్మరంగా సాగుండాలి.

అయితే ఇప్పటివరకు 6,400 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగవుతున్నాయి. అందులో సుమారు 1,120 హెక్టార్లలో పత్తి సాగుకాగా 850 హెక్టార్లలో నువ్వు, 560 హెక్టార్లలో కొర్ర, 400 హెక్టార్లలో సజ్జ, మరికొంత విస్తీర్ణంలో కూరగాయలు, పశుగ్రాసం పంటలు వేశారు. అయితే పక్షం రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతోపాటు ఎండల తీవ్రత పెరిగింది. వారంరోజులుగా జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో 40 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదవడంతోపాటు వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో వేసిన పైర్లు వాడుముఖం పడుతుండగా దున్నిన దుక్కులలో తేమ ఎండిపోయి విత్తనాలు వేసే అవకాశం లేకుండాపోయింది. ఈ వారంలోనైనా మంచి వర్షాలు కురవకపోతే తొలకరి పైర్ల సాగుకు సమయం మించిపోవడంతోపాటు కీలకమైన ఖరీఫ్ పైర్ల వేయడం ఆలస్యం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మిర్చి సాగుకు ఎదురుచూపులు

దోర్నాల మండలంలో ప్రధానంగా మిర్చి సాగు పట్ల రైతులు మొగ్గుచూపుతారు. అందుకు తగ్గట్టుగా నేలను దుక్కి చేసి పశువుల ఎరువులు వేసి కలియ దున్ని సాగుకు సిద్ధం చేశారు. ఈక్రమంలో వాతావరణం అనుకూలంగా ఉంటే ఈ పాటికి విత్తనాలు నారుమళ్లుగా పోసేవారు లేదా పెద్ద యజమానుల వద్ద మాట్లాడుకునేవారు. అయితే రోహిణీ కార్తెకు మించి ఎండలు మండిపోతుండడంతో రైతులు ఆసక్తి కనబర్చడం లేదు. మిరప సాగుకు ఇంకా చాలా సమయం ఉందని రైతులు చెబుతున్నారు. మరో నెలరోజుల వరకు సాగు చేసుకోవచ్చని వాన కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు.

మెప్మాలో సిగపట్లు..!

మహిళా మార్ట్ లెక్కలు చెప్పాల్సిందే
సీఎంఎంని నిలదీసిన ఆర్పీలు
సరైన సమాధానం చెప్పకుండా దాటవేయడంపై ఆగ్రహం
సభ్యుల పెట్టుబడి సొమ్మును బొక్కేసిన వైనం
అధికారులకు ఫిర్యాదు



మెప్మా సీఎంఎం ఫణికుమారిని నిలదీస్తున్న ఆర్పీలు

అద్దంకి, జూన్ 25 : మెప్మాలో సిగపట్లు మొదలయ్యాయి. ఇప్పటి వరకు తన అధికారం అడ్డుపెట్టుకొని హవా సాగించిన సీఎంఎం ఫణికుమారిపై ఆర్పీలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. గతంలో పలు సందర్భాలలో పలువురు ప్రశ్నించినా టీడీపీ వర్గీయులుగా ముద్రవేసి తన దోపిడీకి అడ్డు లేకుండా చేశారని పలువురు ఆర్పీలు ఆరోపిస్తున్నారు. మిగిలిన విషయాలను పక్కనపెడితే రెండున్నరేళ్ల కిందట మెప్మా సభ్యుల పెట్టుబడితో మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. ఏటా లాభాలు పంచుతామని చెప్పిన అధికారులు ఇంతవరకు వాటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. మహిళా మార్ట్‌ను గతంలో ఉన్న అన్న క్యాంటీన్‌లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో మహిళా మార్ట్ మూసి వేసేందుకు రంగం సిద్ధమయింది. అయితే మెప్మా సభ్యులు ఒక్కొక్కరూ రూ.150 చొప్పున సుమారు 8వేల మంది నుంచి సుమారు రూ.12లక్షల పెట్టుబడి నిధిని వసూలు చేశారు. ప్రస్తుతం మార్ట్‌లో ఉన్న సరుకు విలువ పట్టుమని 50 వేల రూపాయలు కూడా ఉండదని సభ్యులు ఆరోపిస్తున్నారు. పర్యవేక్షణ చేసే అధికారులు మాత్రం రూ.2లక్షల సరుకు ఉన్నట్లు చెప్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం అయినా రూ.2లక్షల సరుకు పోను మిగిలిన రూ.10 లక్షల సంగతి ఏమిటనేదానికి సమాధానం మాత్రం లేదని సభ్యులు, ఆర్పీ లు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో పలువురు ఆర్పీలు మార్ట్ జమా లెక్కలు గురించి ప్రశ్నించారు. అయితే సీఎంఎం మాత్రం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆర్పీలలో ఆగ్రహం తెప్పించింది. దీంతో మాటామాటా పెరిగి సిగపట్లు వరకు వెళ్లినట్లు తెలుస్తుంది. ఆర్పీలు వెంటనే మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళా మార్ట్‌కు సంబంధించి మొత్తం లెక్కలు తేల్చే విధంగా చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. లెక్కలు తేలేనా... లేక మరుగున పడిపోతాయా అన్న అనుమానాలు సభ్యులలో నెలకొంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి మహిళామార్ట్‌లో చోటు చేసుకున్న అవినీతిపై విచారణ జరిపి సభ్యుల నుంచి వసూలు చేసిన పెట్టుబడి నిధిని తిరిగి చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

నిందితుల తల్లిపై కూడా చర్యలు తీసుకోవాలి

ఈపూరుపాలెం గ్రామ ప్రజలు డిమాండ్
పెద్దఎత్తున నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న ప్రజలు

ఈపూరుపాలెం (చీరాలటౌన్), జూన్ 25 : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలో ఓ యువతిపై కొందరు దుర్మార్గులు హత్యాచారం చేశారు. ఆ దుండగులు ప్రస్తుతం రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. రెండు రోజులుగా నిందితుల్లో ఒకరి తల్లి మరో మహిళతో ఫోన్‌లో మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థతో పాటు బాధిత కుటుంబాన్ని అవహేళన చేస్తూ దూషించింది. దీంతో ఈ వాయిస్ అన్ని సోషల్ మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ విషయమై ఆగ్రహించిన ఈపూరుపాలెం మహిళలు మంగళవారం స్ట్రయిట్ కట్ కాలువ దగ్గర నుంచి ప్రజా చైతన్య నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్మార్గానికి పాల్పడిన మృగాళ్లకు మద్దతు తెలిపిన తల్లిపై కూడా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఎస్ఐ శివకుమార్‌కు అందించారు. కార్యక్రమంలో పవన్, బాల సందీప్, శివసాయిబాబు, వెంకటేష్ అవ్వారు లక్ష్మి, నాశన మణికంఠ, తారక రామారావు, బాలు, ఈశ్వర్, పెద్దసంఖ్యలో మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

ఇకపై పట్టణంలో ప్రత్యేక నిఘా
నేరాలకు పాల్పడితే జైలుకే
వివరాలు వెల్లడించిన వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు

చీరాలటౌన్, జూన్ 25 : హత్య కేసులో నిందితులను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలో ఇకపై ప్రత్యేక నిఘా ఉంటుందని సీఐ శేషగిరిరావు తెలిపారు. మంగళవారం వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. స్థానిక పాపరాజుతోటకు చెందిన కంచర్ల సంతోష్(30) స్థానిక సంఘం థియేటర్ సమీపంలో రెండేళ్లుగా అయ్యప్ప క్యాటరింగ్ పేరుతో కర్రీస్ పాయింట్ నడుపుతున్నాడు. ఇతనికి భార్య నవ్య తల్లి సైదిరోజు, అక్క లావణ్య ఉన్నారు. అంతేకాకుండా వ్యాపారం అభివృద్ధి చెందడంతో పట్టణంలో మరో రెండుచోట్ల కర్రీస్ పాయింట్‌లను ఏర్పాటు చేశారు. సంఘం థియేటర్ వద్ద ఉన్న వీరి షాపు ఎదురుగా బెస్తపాలెంకు చెందిన జోగి యూసఫ్ అలియాస్ చిన్నా తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తున్నాడు. ఇతని దగ్గర కొంత కాలంగా స్వర్ణకు చెందిన ఉమామహేశ్వరరావు పని చేస్తున్నాడు. ఈక్రమంలో వీరి సమీపంలో ఉన్న మంచినీటి ట్యాపు వద్ద గత ఆదివారం చిన్నా చేతులు కడుక్కుంటుండగా ఆ నీళ్లు కర్రీస్ పాయింట్ వైపు వచ్చాయి. దీంతో సంతోష్ తల్లి సైదిరోజు చిన్నాతో వాదనకు దిగింది. అదే సమయంలో ఇంటి నుంచి వండి తెచ్చిన కూరలను ఆటోలు సంతోష్ దించుతున్నాడు. ఈ సమయంలో వివాదం కొంచెం పెద్దదయింది. చిన్నా, సంతోష్ మధ్య వాదన జరుగుతుండగానే దుకాణంలో పనిచేస్తున్న ఉమామహేశ్వరరావు జేబులో ఉంచుకున్న పండ్లు కోసే చాకుతో సంతోష్ పొట్టలో, వెనుక భాగంలో మూడు బలమైన పోట్లు పొడిచాడు. సంతోష్ శరీరం నుంచి తీవ్రంగా రక్తస్రావమవుతుండడంతో పరుగులు తీసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ గేటు వద్దకు చేరి కేకలు వేశాడు. బయటకు పరిగెత్తుకుంటూ వచ్చిన రైటర్ సత్యరాజ్, కానిస్టేబుల్ అఖిల్ సంతోష్‌ను ప్రైవేటు వాహనం ద్వారా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే వైద్యులు చికిత్స అందిస్తుండగానే సంతోష్ ప్రాణాలు విడిచాడు. దీంతో తల్లి సైదిరోజు, భార్య నవ్య, అక్క లావణ్యతో పాటు బంధువులు హాస్పిటల్ వద్దకు చేరి విలపించారు. ఈ నేపథ్యంలో ఘటన వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముద్దాయిలను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు. సీఐ వెంట ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై సుబ్బారావు, రైటర్ సత్యరాజ్, కానిస్టేబుల్స్ సుబ్బారావు, అఖిల్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై ఊరేగిన వేంకటేశ్వరస్వామి

మేదరమెట్ల, జూన్ 25 : మేదరమెట్లలో వేంచేసి ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు హనుమంత వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. బుధవారం వేకువజాము నుంచే స్వామివారికి అభిషేకాలు నిర్వహించి పుష్పాలంకరణ తదితర సేవలను పూజారి హైగ్రీవచార్యులు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని హనుమత్‌వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పాదర్తి కాజారావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



హనుమంతవాహనంపై వేంకటేశ్వరస్వామి


పాతమద్రాస్ రోడ్డులో సర్వే చేస్తున్న వాహనం

సీసీ కెమెరాలతో రోడ్ల సర్వే

ఇంకొల్లు, జూన్ 25 : ఇంకొల్లు ప్రాంతంలోని రహదారులను 8 సీసీ కెమెరాలతో టెక్ మహీంద్ర సంస్థ వారు పరిశీలిస్తున్నారు. అమరావతికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న రహదారుల స్థితిగతులపై ఈ సంస్థ సర్వే చేపట్టింది. మంగళవారం ఇంకొల్లులో సంస్థ నుంచి వచ్చిన సీసీ కెమెరాల వాహనం రోడ్లను పరిశీలిస్తూ సర్వే చేపట్టింది. విషయం తెలుసుకున్న ఈ ప్రాంత ప్రజలు ఆనందోత్సాహాలలో ఉన్నారు. అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించడంతో రాజధానికి చుట్టూ 60 కిలో మీటర్ల మేర రోడ్ల పరిస్థితి ఎలా ఉన్నదో ప్రాథమికంగా సర్వే చేసి నాటి అభివృద్ధితో అమరావతి రింగ్ రోడ్డుకు సులభంగా రవాణా సౌకర్యం కలిపించేందుకు టెక్ మహీంద్ర పరిశీలన చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం ఇంకొల్లులోని పాతమద్రాసురోడ్డు, గంగవరం రోడ్డులో 8 సీసీ కెమెరాలతో సర్వే నిర్వహించారు.

అన్నగారి సంతకు పూర్వవైభవం వచ్చేనా..?



అద్దంకి మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహిస్తున్న సంత.. కొనుగోలు చేస్తున్న ప్రజలు

- వైసీపీ అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం
- మొక్కుబడి నిర్వహణ
- రైతుల కంటే వ్యాపారులే అధికం
- బయట మార్కెట్ కంటే అధిక ధరలు

అద్దంకి, జూన్ 25 : అద్దంకి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సుమారు దశాబ్ద కాలం నుంచి అద్దంకి, మేదరమెట్ల మార్కెట్ యార్డు ఆవరణలలో సంత నిర్వహణ జరుగుతోంది. అయితే టీడీపీ ప్రభుత్వ హయాంలో నాగినేని రామకృష్ణ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న సమయంలో అన్నగారి సంత నిర్వహణ ప్రారంభించారు. రైతులే నేరుగా తాము పండించిన కూరగాయలు సంతకు తీసుకు వచ్చి బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకు అమ్మకాలు చేశారు. తాజా కూరగాయలు తక్కువ ధరకే లభ్యమవుతుండటంతో కొనుగోలు దారులతో కిట కిటలాడాయి. అద్దంకి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో అద్దంకితో పాటు మేదరమెట్ల, పంగులూరులలో సంతలు నిర్వహించారు. అనంతరం పంగులూరులో నిర్వహణ నిలిపి వేయగా అద్దంకిలో ఆదివారం, మేదరమెట్ల బుధవారంలలో ఇప్పటికీ నిర్వహిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ముందస్తుగానే బహిరంగ మార్కెట్‌లో ధరల వివరాలను విచారించి, అంతకంటే కొంత మేర ధర తగ్గించి సంతలో నిర్వహించేలా ధరల పట్టికలు ప్రతి దుకాణానికీ పంపిణీ చేసేవారు. ధరల పట్టికలలో ఉన్న ధర కంటే ఎక్కువ ధరకు అమ్మకాలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు కూడా ఉండటంతో నిర్ణయించిన ధరలకే అమ్మకాలు జరిగేవి. దీనికి తోడు ధరల వివరాలను అన్ని పత్రికలకు కూడా విడుదల చేసేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నగారి సంత పేరును రాజన్న సంతగా మార్పు చేశారు. పేరు మార్పుతో పాటు నిర్వహణ కూడా పూర్తిగా మారిపోయింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పడ్డ మార్కెట్ కమిటీ పాలక మండళ్లు సంతను లాభాపేక్ష ధోరణితో చూడటంతో గాడి తప్పింది. రైతుల స్థానంలో వ్యాపారులు రంగ ప్రవేశం చేశారు. ఎక్కువ దుకాణాలు వ్యాపారుల ద్వారా అమ్మకాలు చేసేవారు. దీనికి తోడు ధరల నిర్ణయం లేకపోవటంతో బయట మార్కెట్‌లో ధరలతో పోటీ పడి అమ్మకాలు చేశారు. తాజా కూరగాయలు లభిస్తున్నాయన్న ఏకైక ఉద్దేశంతో కొంత మేర సంత నిర్వహణ జరుగుతోంది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అన్నగారి సంతకు నాటి పూర్వ వైభవం వస్తుందన్న ఆశతో అద్దంకి, కొరిశపాడు మండలాల రైతులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. కొత్త పాలకమండలి ఏర్పాటు వేగవంతంగా జరిగితే సంత నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా చేసేందుకు అవకాశం ఉంటుందని పలువురు అభి ప్రాయపడుతున్నారు.

రాష్ట్రంలో టీడీపీ అధికారం దక్కించుకొని 20 రోజులు గడిచినా మార్కెట్ కమిటీ పాలక మండలిలో కొంతమంది మాత్రం పదవులు వదులుకునేందుకు ఇష్టపడటం లేదని తెలుస్తోంది. ఈ క్రమంలో కొంత మంది సభ్యులు ప్రారంభంలోనే రాజీనామాలు చేసినప్పటికీ చైర్‌పర్సన్ మాత్రం తప్పనిసరి పరిస్థితులలో శనివారం రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. వైస్ చైర్మన్ మాత్రం ఇంకా తన రాజీనామాను ఇవ్వలేదని సమాచారం.


రైతులకు వరి వంగడాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

ఆర్బీకేలను సందర్శించిన శాస్త్రవేత్తలు

కారంచేడు (పర్చూరు), జూన్ 25 : కారంచేడులోని రైతు భరోసా కేంద్రాలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త జే.రాధాకృష్ణ, ఎం.ఉష మంగళవారం సందర్శించారు. ఏరువాక కేంద్రం వద్ద బాపట్ల కోర్డినేటర్ ఆర్.బాలమురళీధర్ నాయక్ ఆధ్వర్యంలో వరి గడ్డి 2595 రకం విత్తనాలను రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ రకం వరి వంగడాలకు కాలపరిమితి 150-155 రోజులని తెలిపారు. ఖరీఫ్‌కు అనుకూలంగా దోమకాటుతో పాటు, అగ్గి తెగులుని తట్టుకునే శక్తి ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె.సుధీర్, రైతులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల వద్ద సబ్‌స్టేషన్ ఏర్పాటు

- స్థలాన్ని పరిశీలించిన అధికారులు
- జగన్‌రెడ్డి పాలనలో నిర్లక్ష్యం
- టీడీపీ అధికారంలోకి రావడంతో చురుగ్గా పనులు
- మంత్రి గొట్టిపాటి ఆదేశంతో కదలిక


టిడ్కో ఇళ్ల వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న విద్యుత్ ఈఈ మస్తాన్‌రావు, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

అద్దంకి, జూన్ 25 : టిడ్కో ఇళ్ల వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారులు మంగళవారం స్థలపరిశీలన చేశారు. గత టీడీపీ హయాంలో అత్యధిక శాతం నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న టిడ్కో ఇళ్లు అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి నిర్లక్ష్య ధోరణితో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం మరలా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిలిచిపోయిన పనులు వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేసే దిశగా వేగవంతంగా అడుగులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో టిడ్కో ఇళ్ల విద్యుత్ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అక్కడే సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సిద్ధం అయ్యారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో పలు శాఖల అధికారులు మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు కు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ ఈఈ నల్లూరి మస్తానరావు, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, విద్యుత్ డీఈఈ సత్యనారాయణ, ఏఈలు శివప్రసాద్, శ్రీనివాసరావు, బాలకోటేశ్వరరావు, ఆర్ఐ శంకర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, అశోక్, అనిల్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, గుంటూరు మాదవరావు పాల్గొన్నారు.


వివరాలను నమోదు చేస్తున్న అధికారులు

సీఆర్‌జడ్ పరిధిలో లెక్కలు తేల్చేందుకు రంగం సిద్ధం

వేటపాలెం(చీరాల), జూన్ 25 : సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న వాస్తవ పరిస్థితులపై లెక్కలు తేల్చి, ఉన్నతాధికారలకు నివేదిక ఇచ్చేందుకు యంత్రాంగం కదిలింది. ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి ఆదేశాల మేరకు తహసీల్దార్ కృష్ణకాంత్ మంగళవారం ఆరు టీంలుగా అధికారులు, సిబ్బంది పొట్టి సుబ్బయ్యపాలెం నుంచి రామాపురం శివారు వరకు సీఆర్‌జడ్ పరిధిలో ఉన్న కట్టడాలు, ఇతర స్థితిగతులను నమోదు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందస్తుగా క్షేత్ర స్థాయిలో సీఆర్‌జడ్ నిబంధనల మేరకు 200 మీటర్ల లోపు, 500 మీటర్ల లోపు స్థితిగతులపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి వివరాలు నమోదు చేస్తున్నారు. అందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిపారు.

వలపర్ల సెంటర్‌లో వెలగని వీధిలైట్లు

మార్టూరు, జూన్ 25 : మండలంలోని వలపర్ల సెంటర్‌లో వారంరోజులుగా వీధి లైట్లు వెలగడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో వీధిలైట్లు వెలగకపోవడంతో చిమ్మచీకటై ఇబ్బంది పడుతున్నామని చెప్తున్నారు. ఎన్టీఆర్ బొమ్మ నుంచి రథం సెంటర్ రోడ్ వైపు, సినిమాహాలు సెంటర్ నుంచి అంజనేయస్వామి గుడి మీదుగా ప్రధాన సెంటర్ వరకు, ద్వారకపాడు రోడ్ వైపు వీధి లైట్లు వెలగడంలేదు. రాత్రిళ్లు వీధిలైట్లు లేని కారణంగా చిరువ్యాపారులు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై విద్యుత్ ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా గ్రామ పంచాయతీ అధికారులతో మాట్లాడతామన్నారు.


నోటు పుస్తకాలను అందజేస్తున్న వేలూరి

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

మార్టూరు, జూన్ 25 : మండలంలోని వలపర్ల ఆర్సీ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు విద్యా వికాస్ ట్రస్ట్ చైర్మన్ రాజమండ్రి వారి ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను పంపిణీ చేశారు. వేలూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ 10 వతరగతి పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు ట్రస్ట్ సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈకేవైసీ కోసం బారులు


గ్యాస్ కార్యాలయం వద్ద బారులుతీరిన వినియోగదారులు

పర్చూరు, జూన్ 25 : గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని గ్యాస్ కంపెనీదారులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్యాస్ వినియోగదారులు తప్పక ఈకేవైసీ చేయించుకోవాలని ప్రచారం సాగింది. స్థానిక గ్యాస్ కంపెనీ కార్యాలయం వద్దకు వినియోగదారులు బారులు తీరుతున్నారు. ఆయా గ్యాస్ కంపెనీ కార్యాయాలు ప్రజలతో కిక్కిరిస్తున్నాయి. దీనికి తోడు నూతన కూటమి ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు ఏటా ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్‌లు ఇస్తామన్న హామీతో కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. మండు టెండను సైతం లెక్కచేయకుండా కార్యాలయాల ప్రాంగణంలో బారులు తీరుతున్నారు.

రాష్ట్ర టెంట్ హౌస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

జాయింట్ సెక్రటరీగా అద్దంకికి చెందిన గార్లపాటి ఎన్నిక


టెంట్ హౌస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

అద్దంకి, జూన్ 25 : రాష్ట్ర టెంట్ హౌస్ అసోసియేషన్‌లో అద్దంకికి స్థానం దక్కింది. జాయింట్ సెక్రటరీగా అద్దంకి పట్టణానికి చెందిన టీడీపీ నేత, భాస్కర్ సప్లయర్స్ అధినేత గార్లపాటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ఎన్నిక విజయవాడలోని ఆశా ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులుగా విజయవాడకు చెందిన బాషా, వైస్ ప్రెసిడెంట్‌గా వైజాగ్‌కు చెందిన సుబ్బారావు, సెక్రటరీగా నెల్లూరుకు చెందిన వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా అద్దంకికి చెందిన గార్లపాటి శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుందని గార్లపాటి శ్రీనివాసరావు తెలిపారు. జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన గార్లపాటి శ్రీనివాసరావుకు అద్దంకి పట్టణానికి చెందిన పలువురు టెంట్ హౌస్‌ల నిర్వాహకులు అభినందనలు తెలిపారు.


బల్లికురవలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుభద్ర

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

పంగులూరు, జూన్ 25 : మండలంలోని అన్ని గ్రామాలలో కౌలు రైతులను గుర్తించి సీసీఆర్‌సీ కార్డులను జారీ చేసి రైతులకు అందచేయాలని తహసీల్దార్ కృష్ణప్రసాద్ సిబ్బందికి ఆదేశించారు. ఎమ్మార్వో కార్యాలయంలో మంగళవారం వి.ఆర్.ఓ., వి.ఎ.ఎ.లతో కౌలు రైతులకు కార్డులు జారీ చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకునే కౌలు రైతులు ఆధార్ కార్డు, పాస్‌ఫొటో, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీతో సచివాలయ వీఆర్వో, వీఏఏలకు అందజేసిన వెంటనే గుర్తింపు కార్డులు జారీ చేస్తామని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. సమావేశంలో వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

బల్లికురవ : కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించేలా గ్రామ సభలు నిర్వహించాలని తహసీల్దార్ సుభద్ర తెలిపారు. మంగళవారం గ్రామ రెవెన్యూ అధికారులకు వ్యవసాయ శాఖ సిబ్బందికి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అన్ని గ్రామాలలో అర్హత ఉన్న రైతులను గుర్తించి వారికి కైలు కార్డులను అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. గుర్తింపు కార్డులు ఉన్న రైతులకు ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని ఆమె తెలిపారు. సమావేశంలో ఏవో కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నూతన కమిటీ


ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ

చీరాలటౌన్, జూన్ 25 : ప్రభుత్వ ఉద్యోగల సంఘం చీరాల యూనిట్ నూతన కమిటీని ప్రతినిధులు మంగళవారం స్థానిక డ్రైనేజీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రోశయ్య, శ్రీనివాసరావు పాల్గొనగా చీరాల యూనిట్ అధ్యక్ష కార్యదర్శులుగా వినోద్, శ్రీనివాసరావులతో పాటు మరో 23 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు నూతన కమిటీను అభినందించారు. అలాగే సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాధ్యులు రాజేశ్వరి, చెన్నయ్య, కల్యాణి, భాగ్యలక్ష్మి, జయరాజ్ పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న చారులత

చినగంజాం, జూన్ 25 : కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని జిల్లా బాలికా అభివృద్ధి అధికారి (జీసీడీవో) ఎం.చారులత మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేజీబీవీలోని 6, 7, 8, 9, 10 తరగతులలో 40 శాతం సీట్లు పూర్తి అయి, వందశాతం నమోదైనట్లు తెలిపారు. ప్రహరీ గోడ నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు కానున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే కృషి చేయాలని సూచించారు. అనంతరం భోజనశాలను, నాడు-నేడు రెండవ దశలో మంజూరైన నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ రమేష్‌బాబుతో జీసీడీవో ఫోన్‌లో మాట్లాడి రోజూ విద్యార్థినులకు పండ్లు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో బి.అజయ్‌బాబు, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


బల్లికురవలో మాట్లాడుతున్న సమగ్ర శిక్షా ఏఎంవో మోజెస్

చినగంజాం, జూన్ 25 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందుతుందని మండల విద్యాశాఖాధికారి బి.అజయ్‌బాబు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం వారు నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని కడవకుదురు గ్రామంలో మంగళవారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బడి ఈడు పిల్లలను బడికి పంపించాలంటూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లమూరి శివకుమారి, ప్రధానోపాధ్యాయుడు కుర్రా రామారావు, విద్యా కమిటీ చైర్మన్ జీవీ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు సీహెచ్.హెలెన్‌రూత్, కే.రామారావు, ఎస్.ప్రసాద్, పి.కవిత, షేక్ జరీనా తాజ్, ఎస్.త్రిపురాంతకరావు, జే.శ్రీనివాస్, టీ.సంపతమ్మ, లక్ష్మి, పీడీ జే.దేవభిక్షం పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

కారంచేడు (పర్చూరు) : బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని సమగ్ర శిక్ష సీఎంవో పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 1633 మంది విద్యార్థులు బడి బయట ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ప్రతి ఉపాధాయుడు విధిగా గుర్తించి పిల్లలను బడిలో చేర్పించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు మొలబంటి వెంకటేశ్వర్లు, సత్యన్నారాయణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

యద్దనపూడి (మార్టూరు) : ఈ నెలాఖరు నాటికి బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులను ఎంఈవో చిలుకూరి గోపి కోరారు. మంగళవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో నేను బడికి పోతా, విద్యాప్రవేశ్ కార్యక్రమాల అమలుపై సమావేశం నిర్వహించారు. 1 వతరగతి విద్యార్థులకు ప్రతిరోజూ 2 గంటలపాటు భాషా జ్ఞాన, శారీరక అభివృద్ధి కృత్యాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శ్రీనివాసరావు వెస్లీ, వెంకటనారాయణ, కాలేషావలి, మార్కు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

బల్లికురవ : బడి ఈడు పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించాలని జిల్లా సమగ్ర శిక్ష ఏఎంవో మోజెస్ కోరారు. మంగళవారం విద్యావనరుల కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడికి పోతాం కార్యక్రమాన్ని జూలై 12 వరకు నిర్వహించి, పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మోజెస్ సూచించారు. కార్యక్రమంలో సమావేశంలో ఎల్ఎస్ కోఆర్డినేటర్ సత్యసాగర్, ఎంఈవో రమేష్‌బాబు పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలంలో బడి బయట పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని బాపట్ల జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ ఏఎంవో మోజేష్ తెలిపారు. సంతమాగులూరులోని ఎంపీపీఎస్ సీడీ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.



- టీడీపీ అధికారంలోకి రాగానే పరార్!
- కావలిలో వైసీపీ నాయకులే బినామీ కాంట్రాక్టర్లు
- ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకనే బిల్లులు?
- నగదు మొదలు మెటీరియల్ దాకా చేతివాటం
- కొత్త ప్రభుత్వం రాగానే మిగిలిన మెటీరియల్ కూడా మాయం
- నాయకులు, కాంట్రాక్టర్లు కనుమరుగు
- జరిగిన అవినీతిపై నివేదిక కోరిన ఎమ్మెల్యే కావ్య
- ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని అధికారుల్లో వణుకు

జగనన్న కాలనీ

భో క్తుం జంప్!

జగనన్న ప్రభుత్వంలో పేదవాడికి సొంతింటి కల దేవుడెరుగు పేదల పేరు చెప్పి వైసీపీ నాయకులు మాత్రం అందినకాడికి దండుకున్నారనే చేదు నిజాలు వెలుగుచూస్తున్నాయి. కావలిలో జగనన్న కాలనీల పేరుతో తక్కువ ధరకు రైతుల వద్ద భూములు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ప్రభుత్వానికి విక్రయించి భారీ కుంభ కోణానికి తెరతీసిన సంగతి తెలిసిందే. అలాగే భూముల లెవలింగ్ పేరుతోనూ రూ.కోట్లు దండుకున్నారు. ఇది చాలదన్నట్లు వైసీపీ నాయకులే బినామీ కాంట్రాక్టర్ల అవతారమెత్తి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అంతటితో ఆగక ప్రభుత్వం సరఫరా చేసిన నిర్మాణ సామగ్రిలోనూ చేతివాటం ప్రదర్శిం చారు. నాసిరకంగా అరకొరగా ఇళ్ల నిర్మాణంతోపాటు బిల్లులు చేసుకుని అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సదరు కాంట్రాక్టర్లంతా పత్తాలేకుండా పోయారు. కాలనీల్లో ఉన్న కొద్దిపాటి మెటీరియల్‌ను కూడా రాత్రికిరాత్రే తరలించినట్లు సమాచారం. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఇళ్ల నిర్మాణంపై సమగ్ర నివేదిక కోరడంతో అధికారుల్లో వణుకు మొదలైంది.



ముసునూరులోని మెగా లేఅవుట్‌లో వివిధ దశల్లో ఉన్న జగనన్న ఇళ్లు



కావలి, జూన్ 25 : కావలి పట్టణంలోని ముసునూరు వద్ద జగనన్న కాలనీలో 6,741 ఇళ్లు మంజూరు కాగా వాటిలో ఏ ఒక్కటీ పూర్తి చేసి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించలేదు. మంజూరైన 6,741 ఇళ్లలో 2,053 పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. మిగిలిన ఇళ్లలో 2,385 ఇళ్లు స్లాబ్‌లెవల్, 612 ఇళ్లు రూఫ్‌లెవల్, 25 ఇళ్లు లెంటిల్ లెవల్, 1062 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్, 102 ఇళ్లు ప్లింత్‌బీమ్ లెవల్, 474 ఇళ్లు బిలో బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి. ఇంకా 27 ఇళ్లు నిర్మాణానికే నోచుకోలేదు. అయితే ఈ ఇళ్లు మినహా మిగతా ఇళ్లకు రెండు దశలలో అవసరమైన స్టీలు, సిమెంట్, ఇసుకను గృహ నిర్మాణ శాఖ అందచేసింది.

• వైసీపీ నేతలే బినామీలుగా..

వైసీపీ నేతలే బినామీ కాంట్రాక్టర్ల అవతారమెత్తి ఇళ్ల నిర్మాణాలను చాలా వరకు నాసిరకంగా జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి సెంటు భూమి మాత్రమే ఇవ్వడంతో లబ్ధిదారులు ఎవరూ మక్కువ చూపలేదు. దీంతో ప్రభుత్వమే కట్టించి ఇస్తామని ప్రకటిం చడంతో ఇళ్ల నిర్మాణాలను వైసీపీ నేతలకు అప్పగించారు. ఒక్కో ఇంటికి రూ.1.8 లక్షలతోపాటు పొదుపు సంఘం నుంచి సభ్యులు రూ.30 వేల వరకు రుణం తీసుకోవచ్చు. అయితే, ఇదంతా కాంట్రాక్టరు ఖాతాకు జమవుతుంది. ఈ చాలీచాలని నిధుల లోనూ వైసీపీ నేతలు చేతివాటం ప్రదర్శించి ప్రభుత్వం సరఫరా చేసిన స్టీల్, సిమెంట్‌లలో కొంత బయట మార్కెట్‌కు తరలించారు. తూతూమంత్రంగా నిర్మించిన ఇళ్లు కూడా కొద్దిపాటి వర్షానికే పడిపోవటంతో అప్పట్లో విజిలెన్స్ విచారణ కూడా జరిగింది. అయితే, నిర్మాణాలు చేపట్టిన వారంతా వైసీపీ నేతలే కావటంతో జరిగిన అక్రమాలు బయటకు రాకుండా పాలకులు తొక్కిపెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఇళ్ల నిర్మాణాల్లో వేగం లేకపోవడంతో వైసీపీకి చెందిన ముగ్గురు బడా కాంట్రాక్టర్లను రంగంలో దించారు. వారు కూడా నిర్మాణాలను నాసిరకంగా చేపట్టారనే ఆరోపణలు ఉన్నాయి.

• రాత్రికిరాత్రే మెటీరియల్ మాయం

ఇళ్ల నిర్మాణాలకు స్టీలు, సిమెంట్, ఇసుక ఎంత ఇచ్చారు? వాటిలో ఎంత వినియోగించారో అర్థం కాని పరిస్థితి. బేస్‌మెంట్ వరకు ఒకసారి ఆ తర్వాత మరోసారి నిర్మాణ సామగ్రిని కాంట్రాక్టర్లకు అందజేశారు. అయితే మెటీరియల్ వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ జరిగితే తప్ప వాస్తవాలు వెలుగులోకి రావు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచే కాంట్రాక్టర్లు నిర్మాణాలు ఆపేసినా అధికారులు పట్టించుకోలేదు. కౌంటింగ్ అనంతరం ప్రభుత్వం మారటంతో జగనన్న కాలనీలో మిగిలిన మెటీరియల్‌ను కూడా రాత్రికి రాత్రే తరలించారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు అధికారులు ముందుగానే బిల్లులు చెల్లించి ఆ నిధులతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా కొందరికి సహకరించారు. ఇలా నగదు తీసుకున్న వారు కూడా పత్తాలేకుండా పోయారు.

• అధికారుల్లో వణుకు

కావలి ఎమ్మెల్యేగా గెలుపొందిన దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో అధికారుల్లో వణుకు మొదలైంది. గత నెలలో గృహ నిర్మాణ శాఖ డీఈ పదవీవిరమణ చెందగా ఈ నెలలో ఈఈ పదవీవిరమణ చెందనుండటంతో జగనన్న ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి అక్రమాలు వెలికి తీయడం సాధ్యపడదనే ప్రచారం నడుస్తోంది. ఒకవేళ ఉన్నతాధికారుల జోక్యంతో అక్రమాలు బయటకు వస్తే వాటికి క్షేత్రస్థాయి సచివాలయ ఇంజనీరింగ్ కార్యదర్శులను బాధ్యులను చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.



ఇది ఎవరి పని!?

బోగోలు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళ వారం వందల కొద్దీ సిమెంటు బస్తాలు పడేసి ఉండటం కలకలం రేగింది. దీనిపై ఆరాతీస్తే ఆ సిమెంట్ బస్తాలన్నీ జగనన్న కాలనీలకు చెందినది తేలింది. జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల కోసం 2023లో ప్రభుత్వం నుంచి సిమెంట్ బస్తాలు సరఫరా అయ్యాయి. వీటిని స్థానికంగా లభ్యమయ్యే గోదాములలో నిల్వ ఉంచి, అవసరమైన మేరకు కాలనీలకు సరఫరా చేశారు. అయితే, ఓ గోదాములో నిల్వ ఉంచిన బస్తాలు వర్షాలకు తడిచిపోయి, గడ్డలు కట్టాయి. మంగళవారం ఇది వెలుగులోకి రావడంతో ఆ బస్తాలను ఎమ్పీడీవో కార్యాలయ ఆవరణలోకి తరలించారు. దీనిపై గృహనిర్మాణ శాఖ ఏఈ రంగవరప్రసాద్‌ను వివరణ కోరగా గడ్డకట్టిన సిమెంట్ బస్తాలపై ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు తెలిపారు.

\- బిట్రగుంట



రామలింగేశ్వరుడి ఆలయం

రామతీర్థానికి బ్రహ్మోత్సవ శోభ!

- నేటి నుంచి రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు
- 4న కల్యాణం, 5న తీర్థవాది, భక్తులకు విస్తృత ఏర్పాట్లు

విడవలూరు : మండలంలోని రామతీర్థం గ్రామంలో బుధవారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. జిల్లా నలుమూలల నుంచేగాక తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తు లు తరలిరానుండటంతో ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

• శివతత్వాన్ని తెలిపేలా...

బ్రహ్మోత్సవాల్లో స్వామివారు శివతత్వాన్ని ప్రజలు తెలియచేసేలా వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నారు. ఈనెల 26న అంకు రార్పణతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు వచ్చేనెల 6న జరిగే ధ్వజావరోహణతో ముగుస్తాయి. 27న ధ్వజారో హణ, 28న చిలక వాహనం, 29న హంసవా హనం, 30న పులివాహనం, 1న రావణసేవ, 2న నందిసేవ, 3న రథోత్సవం, 4న కల్యాణం, గజవాహణ సేవ, 5న తీర్థవాది (సముద్రస్నానం), తెప్పోత్సవం, పారువేట, అశ్వవాహన సేవ, 6న ధ్వజావరోహణం, ఏకాంతసేవ నిర్వహిస్తారు. ప్రారంభ, ముగింపు రోజుల్లో పల్లవుల కాలం నాటి 200 కిలోల కంచు గంటను మోగిస్తారు. కాగా స్వామి, అమ్మ వార్ల కల్యాణానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమి రెడ్డి ప్రశాంతిరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. కల్యాణం మరుసటి రోజు స్వామివారికి సముద్రస్నానం చేయిస్తారు. దీన్నే తీర్థవాది అని పిలుస్తారు.ఆ రోజున స్వామివారితో కలసి లక్షలాది మంది భక్తులు సముద్రస్నానం ఆచరిస్తారు.

సమన్వయంతో నిర్వహణ

రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహాయ సహకారాలతోపాటు దాతలు, భక్తులు, అధికారులను సమన్వయం చేసుకుని విజయవంతం చేయడానికి ప్రయత్నిస్తాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నీ ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే రెవెన్యూ పోలీసు, వైద్య, అగ్ని మాపక శాఖ అధికారులతో సమీక్షించాము.

\- జీ రామకృష్ణ, ఆలయ ఈవో

• 5న తెప్పోత్సవం

వచ్చే నెల 5వ తేదీన తెప్పోత్సవం జరగనుంది. ఉభయకర్తలుగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వ్యవహరించను న్నారు. గతంలో ఈ ఉత్సవానికి ఉభయకర్తగా ఊటుకూరు గ్రామానికి చెందిన కలిసేటి వెంకారెడ్డి ఉండేవారు. ఆయన స్వర్గస్తులు కావడంతో నాలుగేళ్లుగా దేవ దాయ శాఖ అధికారులే నిర్వహించేవారు. బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. స్వామివారు ఊరేగే వాహనాలను అందంగా ముస్తాబు చేశారు. తాత్కాలిక గదులు, మరుగు దొడ్లను ఏర్పాటు చేశారు. నెల్లూరు, కావలి నుంచి రామతీర్థానికి ప్రత్యేక బస్సు లను నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

నర్రవాడలో భక్తజనం

వైభవంగా వెంగమాంబ గ్రామోత్సవం • నేడు కల్యాణం, ప్రధానోత్సవం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 25 : భక్తజనంతో నర్రవాడ గ్రామం కిక్కిరిసిపోతోంది. ఇక్కడ జరుగుతున్న వెంగమాంబ పేరంటాల బ్రహ్మో త్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం ప్రత్యేకంగా అలంకరించిన వాహ నంపై పేరంటాలమ్మ, గురవయ్యనాయుడు దంపతులు ఊరేగుతూ భక్తులకు ద ర్శనమిచ్చారు. సంతానంలేని మహిళలు ఉపవాసదీక్షతో వెంగమాంబ పేరంటా లను వరపడి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయం నుంచి గ్రామోత్సవం మొదలై నర్రవాడ, గుడేవారిపాళెం, ఉలవారిపాళెం, బీసీ కాలనీల మీదుగా సాగింది. తొలుత నర్రవాడలో ఉత్సవ విగ్రహాలకు వెంగమాంబ వంశీయులు వేదపండితుల ఆధ్వర్యంలో చక్రస్నానం చేయించారు. స్వామివార్లకు పులివర్తి వంశీయులు పట్టువస్త్రాలు సమర్పించారు. కాగా, బుధవారం వెంగమాంబ దంపతుల కల్యా ణం, రాత్రి ప్రధానోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా పసుపు, కుంకుమ ఉ త్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

• భారీ బందోబస్తు

బ్రహ్మోత్సవాల్లో ప్రధా న రోజులైన బుధ, గురు వారాల్లో భారీసంఖ్యలో భక్తులు తరలిరానుండ టంతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఉదయగిరి సీఐ వీ.గిరి బాబు, ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు. ఒక డీఎస్పీ, నలుగురు సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు 15, హెడ్ కానిస్టేబుళ్లు 56, కానిస్టేబుళ్లు 97, హోంగార్డులు 83 మంది, 30 మంది స్పెషల్, ఏఆర్ పోలీసులు బందోబస్తు విధుల్లో ఉంటారని పేర్కొన్నారు.



గ్రామోత్సవానికి తరలివస్తున్న ఉత్సవమూర్తులు

కరెంటు కనెక్షన్‌కు

అర లక్ష లంచం

ఏసీబీ వలకు చిక్కిన ట్రాన్స్‌కో ఏఈ • అదుపులోకి సిబ్బంది, ఫైళ్లు స్వాధీనం • అవినీతి అధికారి ఇళ్లలో సోదాలు



నెల్లూరు రూరల్, జూన్ 25 : ఓ ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి అక్షరాలా అరలక్ష లంచం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖ ఏఈని అవినీతి నిరోధక శాఖ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. హరిప్రసా ద్ అనే వ్యక్తి నుంచి నెల్లూరు రూరల్లోని ఆర్-2 (పడమర గ్రామాలు) సెక్షన్‌కు ఏఈగా పని చేస్తున్న వై శివశంకరయ్య రూ.50 వేలు లం చం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. కొత్తూరు సమీపంలోని కావేరి నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళ వారం ఈ సంఘ టన చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు... అనంతసాగరానికి చెందిన హరిప్రసాద్ నెల్లూరు రూరల్ పరిధిలోని ఓగూరుపాడు వద్ద ఇంటికి విద్యుత్ మీటరు అవసరమై అధికారులను సంప్రదించాడు. కనెక్షన్ ఇచ్చేందుకు రూ.80 వేలు ఇవ్వాలని ఏఈ శివశంకరయ్య కోరాడు. దీంతో అవినీతి బాగోతాన్ని హరిప్రసాద్ ఏసీబీ డీఎస్పీ శిరీష దృష్టికి తీసుకువెళ్లాడు. ఆమె సూచనలతో బాధితుడు రూ.50 వేలు లంచం ఇస్తుండగా అవినీతి అధికారిని ఏసీబీ బృందం పట్టుకుంది.

వసూళ్లకు ఏజెంట్

ఏఈ శివశంకరయ్య తన ఉద్యోగంతోపాటు ఆ శాఖలోనే కాంట్రాక్టరుగానూ వ్యవహరిస్తున్న ట్లు తెలిసింది. సన్నిహితుడైన ఓ వ్యక్తిని తెరపైకి చూపి కాంట్రాక్టు పనులన్నీ నిర్వహిస్తున్న ట్లు సమాచారం. అంతేకాదు తన అవినీతి సామ్రాజ్యానికి ఏజెంట్లను నియమించుకు న్నాడు. విద్యుత్ సంబంధ పనులకు ప్రజలనుంచి అవినీతి సొమ్ము తీసుకునేందుకు ప్రాంతాల వారీగా ఆయనకు ప్రైవేట్ సైన్యం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే కావేరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో డబ్బు వసూలు చేసేందుకు ఓ ఆపరేటర్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నాడని సమాచారం. అయితే మంగళ వారం ఆ వ్యక్తి అందుబాటులో లేనందున శంకరయ్యే స్వయంగా నగదు తీసుకునేందుకు వచ్చి ఏసీబీకి చిక్కినట్లు తెలిసింది. ఏసీబీ అధికారు లు సబ్‌స్టేషన్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని, కార్యాలయంలోని ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఏఈ సొంతూరైన వెం కటగిరిలో, ప్రస్తుతం నివాసముంటున్న నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లోనూ ఇళ్లలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదా లు నిర్వహించినట్లు సమాచారం. కాగా, ఏఈ శివశంకర య్యపై ఏప్రిల్ 15 నుంచి ఏసీబీ అధికారులకు వరుస ఫి ర్యాదులు అందుతున్నాయి. స్పష్టమైన ఆధారం కోసం అ న్వేషిస్తున్న సమయంలో బాధితుడు హరిప్రసాద్ ఏసీ బీని ఆశ్రయించడంతో వలపన్ని అవినీతి చేపను పట్టు కున్నారు. మంగళవారం రాత్రి వరకు కావేరినగర్ సబ్ స్టేషన్‌లోనే ఫైళ్లను పరిశీలిస్తున్న అధికారులు, శివశంక రయ్యపై కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరుపరచనున్నారు.



రయ్.. రయ్... రైల్వే స్టేషన్


- వేగంగా నెల్లూరు ప్రధాన స్టేషన్ అభివృద్ధి

నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో రూ.102 కోట్లతో జరుగుతున్న అభివృ ద్ధి పనులు వేగంగా సాగుతున్నా యి. 36మీటర్ల ఎయిర్ కాన్కోర్స్ నిర్మాణం, డెక్ స్లాబ్ కాంక్రీట్ పూర్తి అయ్యాయి. తూర్పువైపు నుంచి సబ్‌వే నిర్మాణం పూర్తి కావస్తోంది. ప్లాట్‌ఫామ్‌ల ఆధునికీకరణ, నూతన షెడ్ నిర్మాణం 90శాతం పూర్తయ్యా యి. తూర్పు, పడమర వైపు మూడు అంతస్తుల నూతన భవనాల నిర్మాణం కూడా పూర్తికావస్తోంది. నెల్లూరు స్టేషన్ పునరాభివృద్ధి పనులపై దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ప్రత్యేక దృష్టిసారించారు. ఇప్పటి వరకు 85శాతం పనులు పూర్తయినట్లు అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

\- నెల్లూరు (వెంకటేశ్వరపురం)

జిల్లాకు ఎంతో ప్రయోజనకరం

ప్రస్తుతం జిల్లాలో గూడూరు-విజయవాడ రైల్వే లైన్ ఒకటే ప్రధానంగా ఉంది. ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు ప్రాంతాలకు రైలు నడుపాయం లేదు. గూడూరు-విజ యవాడ మధ్య ఏదైనా అంతరాయం ఏర్పడితే రైళ్లు వెళ్లేందుకు మరో ప్రత్యామ్నాయం లేదు. ఈ నేపథ్యంలో నడికుడి-శ్రీకా ళహస్తి రైల్వే లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు జరిగాయి. ఈ మార్గం పూర్తయితే కొత్తగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పది లక్షలమందికి రైలు ప్రయాణ సౌకర్యం కలుగుతుంది. అలాగే తిరుపతి-హైదరాబాద్ మధ్య కూడా దూరం తగ్గుతుంది. ఉమ్మడి జిల్లాలో వింజమూరు, ఆత్మకూరు, ఓబులాయపల్లి, వెంకటాపురం, ఆదూరుపల్లి, రాపూరు, వెల్లంపల్లి, అల్లూరుపాడులో రైల్వే స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి.



మెట్టలో రైలు కూత

సా...గుతున్న నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే పనులు

జిల్లాలో సమస్యగా మారిన భూసేకరణ

ఐదేళ్లుగా ముందుకు పడని అడుగు

ఎకరాకు రూ.3.75 లక్షల పరిహారమట!

భూముల అప్పగింతకు ముందుకు రాని రైతులు


పాలకులు దృష్టి సారిస్తే కల సాకారం

ఎప్పటికో..!

నెల్లూరు, జూన్ 25 (ఆంధ్రజ్యోతి) : మెట్ట ప్రాంతంలో రైలు కూత ప్రజల కలగానే మిగిలిపోతోంది. ఏళ్లు గడుస్తున్నా నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్ మాత్రం పూర్తి కావడంలేదు. 2011-12 రైల్వేబడ్జెట్‌లో ఈ రైల్వేలైన్‌ను ప్రతిపాదించినా ఇప్పటికీ జిల్లాలో భూసేకరణ పూర్తి కాలేదు. 2014-19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వంలో ఈ రైల్వేలైన్ పనులు వేగం పుంజుకున్నాయి. అప్పటి ప్రభుత్వం కృషితో 2016 ఆగస్టులో ఈ రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.2,289 కోట్లు మంజూరు చేసింది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతుగా కొంతవాటాను భరించేందుకు ఒప్పుకుంది. ఈ మేరకు భూసేకరణకు నిధులను కూడా సమకూర్చింది. దీంతో పనులు వేగంగా జరిగాయి. అప్పట్లోనే నడికుడి-పిడుగురాళ్ల మధ్య 21 కిలోమీటర్లు, పిడుగు రాళ్ల-శావల్యాపురం మధ్య 45 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ పూర్తయింది. అలానే గుండ్లకమ్మ నుంచి దర్శి వరకు, దర్శి నుంచి కనిగిరి వరకు దశల వారీగా రైల్వేలైన్ పనులు పూర్తి చేశారు. కానీ వెంకటగిరి - కనిగిరి మధ్య మాత్రం పనులు జరగలేదు. ప్రణాళిక ప్రకారం రెండో దశలో వెంకటగిరి-అల్లూరుపాడు మధ్య 41.95 కిలోమీటర్లు, మూడో దశలో అల్లూరుపాడు- వెంకటాపురం మధ్య 95.55 కిలోమీటర్ల మేర పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ పూర్తి కాలేదు. అసలు ఇంతవరకు జిల్లా పరిధిలో భూసేకరణ కూడా పూర్తి చేయకపోవడం గమనార్హం. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ఒకటి ఉందన్న విషయాన్ని కూడా మరిచిపోయింది. తన వాటా నిధులు సమకూర్చక పోవడం, భూసేకరణను పట్టించుకోకపోవడంతో రైల్వేశాఖ కూడా నిస్సహాయస్థితిలో ఉండిపోయింది.

• ఎకరాకు రూ.3.75 లక్షలట!

జిల్లా పరిధిలో నెల్లూరు, ఆత్మకూరు డివిజన్లలో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులకు భూసేకరణ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ సుమారుగా పదేళ్ల నుంచి కొనసాగుతూనే ఉంది. అయినా ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. ఒక్క నెల్లూరు డివిజన్ పరిధిలోని పొదలకూరు, రాపూరు మండలాల్లోనే 174.77 ఎకరాలను రైల్వేలైన్ కోసం సేకరించాల్సి ఉంది. ఈ భూసేకరణ గత టీడీపీ ప్రభుత్వం లో వేగంగా జరిగింది. 2018లో ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికారులు భూసేకరణ నోటీసులు కూడా జారీ చేశారు. అయితే అప్పట్లో అధికారులు ఎకరా విలువను చాలా తక్కువగా లెక్కించారు. బహిరంగ మార్కెట్ ధరలో ఇది సగం కూడా లేకపోవడంతో భూములు ఇచ్చేందుకు రైతులు ఒప్పుకోలేదు. రాపూరు మండలం ఆదూరుపల్లి గ్రామాన్ని పరిశీలిస్తే ఇక్కడ ఒక్కో ఎకరానికి రూ.3.75 లక్షల చొప్పున ఇచ్చేలా నిర్ణయించారు. ఇది స్థానిక మార్కెట్ ధరతో పోలిస్తే చాలా తక్కువ. అన్ని గ్రామాల్లో పరిస్థితి ఇలానే ఉంది. దీంతో రైతులు అభ్యంతరాలు తెలపడంతో వాటిని 2018లో అధికారులు పరిశీలనకు తీసుకున్నారు. కానీ ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం దీన్ని గురించి పట్టించుకోక పోవడంతో భూసేకరణ ఆగిపోయింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో మళ్లీ ఆ ప్రక్రియలో కదలిక వచ్చింది. వారం రోజుల క్రితం రాపూరు తహసీల్దార్ కార్యాలయంలో భూములిచ్చే రైతులతో రెవెన్యూ అధికారులు సమావేశమ య్యారు. ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. కానీ రైతులు మాత్రం నష్టపరిహారం విలువ పెంచాలని అధికారులకు విన్నవించుకున్నారు. పరిహారం పెంచే వరకు భూములిచ్చేది లేదని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ విషయంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాల్సిన అవసరముంది. రైతులకు నష్టం లేకుండా మార్కెట్ ధరను ప్రభుత్వం నుంచి ఇప్పించగలిగితే భూసేకరణ వేగంగా పూర్తికానుంది.



శ్రీకాళహస్తి- నడికుడి రైల్వేలైను రేఖాచిత్రం

సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి

● అదనపు డీఎంహెచ్‌వో ఖాజావలి

సంగం, జూన్ 25: డయేరియా, సీజనల్‌వ్యాధులపై వైద్య సిబ్బందితో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాజావలి సూచించారు. మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలో జరుగుతున్న బీసీజీ టీకా కార్యక్రమం గురించి ఆరా తీశారు. ఎవరికైనా డయేరియా లక్షణాలు కన్పిస్తే స్థానిక వైద్యశాలకు వచ్చి వైద్య సేవలు పొందాలన్నారు. వైద్య సేవలపై అలసత్వం ప్రదర్శించరాదని వైద్య సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అశోక్, శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: డయేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శివకల్పన సూచించారు. స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై తెలియజేయాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు నీటిపరీక్షలు నిర్వహించి స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ వో శివకుమారి, హెచ్ఈ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



సంగం: వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాజావలి



అనంతసాగరం: మాట్లాడుతున్న ఎంపీడీవో తాజ్‌మస్రూర్



ఉదయగిరిలో మాట్లాడుతున్న వైద్యాధికారి శివకల్పన

అనంతసాగరం: మండల ప్రజలకు డయేరియా వ్యాధిపై అవగాహన కల్పించి, జాగ్రత్త చర్యలు సూచించాలని ఎంపీడీవో తాజ్‌మస్రూర్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశమై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్, స్థానిక వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

ఆత్మకూరు, జూన్ 25: జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా గురుశిష్యుల సంబంధాలను తెలియజేస్తూ ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక సభ్యులు మంగళవారం బి.చిరువెళ్ల, గొల్లపల్లి, నారంపేట గ్రామాల్లో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రబోధసేవా సమితి పొదలకూరు కమిటీ అధ్యక్షుడు పెంచల నరసయ్య, సభ్యులు సరోజనమ్మ, పద్మమ్మ, శేషాద్రి, విశ్రాంత ఉపాధ్యాయుడు మురగళ్ల సుధాకరాచారి పాల్గొన్నారు.

అప్రెంటీస్ లేని డీఎస్సీ ప్రకటించాలి

సీతారామపురం, జూన్ 25: నూతన ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో అప్రెంటీస్ విధానం లేకుండా నోటిఫికేషన్ విడుదల చేయాలని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు భోగ్యం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి గొడ్లవేటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బసినేనిపల్లి ఉపాధ్యాయులతో ఆయన సంఘం సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎడమ తిరుపతయ్య, కొండయ్య, రంతుజాని, పేరాల శ్రీనివాసులు, అన్నంగి ప్రసాదు, ఆనందేశ్వరయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సీతారామపురం, జూన్ 25: మారంరెడ్డిపల్లిలో అనారోగ్యంతో మరణించిన తెలుగుదేశం నాయకులు కలివెల దానమయ్య కుటుంబసభ్యులను మంగళవారం ఉదయగిరి మాజీ శాసనసభ్యుడు కంభం విజయరామిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా దానమయ్యతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

గ్యాస్ కనెక్షన్‌కు ఈకేవైసీ తప్పనిసరి

ఉదయగిరి, జూన్ 25: పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు మండలంలోని గ్యాస్ వినియోగదారులు ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని నిర్వాహకులు పవ్వాలి వెంకటయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పథకం సకాలంలో బ్యాంకు ఖాతాలో జమ కావాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కనెక్షన్ కుటుంబంలో మగ, ఆడ ఎవరి పేరు మీద ఉన్నా సబ్సిడీ వర్తిస్తుందన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

సంగం, జూన్ 25: అన్నారెడ్డిపాళెం గిరిజన కాలనీ పాఠశాల విద్యార్థులకు సహారా ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు మంగళవారం విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ఎస్.బాష పంపిణీకి సహకరించిన పఠాన్ బాషాసాహెబ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు గజేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాదర్ బాషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'సుజలధార'కు మరమ్మతులు

అనంతసాగరం, జూన్ 25: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న సుజలధార పథకానికి అధికారులు మరమ్మతులు చేపట్టారు. దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో పనులు పూర్తి చేసి నిర్దేశించిన గ్రామాలకు మినరల్ వాటర్ సరఫరా చేస్తామన్నారు. ఇటీవల ప్లాంట్‌లో మోటార్లు రిపేరు కావడంతో మూతపడిన సుజలధార ప్లాంట్ అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో ఆనం స్పందించారు. మంత్రి ఆదేశాలతో పనులు పూర్తిచేశామని మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్ తెలిపారు. ఎంపీడీవో తాజ్‌మస్రూర్ ప్లాంట్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

రైల్వే అభివృద్ధికి శాంతియుత పోరాటం

బిట్రగుంట, జూన్ 25: స్థానిక రైల్వే అభివృద్ధికి శాంతియుత పోరాటం చేస్తున్నామని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యుడు షేక్.నూరుద్దీన్ అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట లోని ఆయన స్వగృహానికి రైల్వే స్పెషల్ బ్రాంచ్ అధికారి రమణయ్య, ఆర్పీఎఫ్ ఎస్సై కిరణ్‌కుమార్‌తో పాటు నెల్లూరు, బిట్రగుంట రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ సిబ్బంది మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ఆస్తులు, అధికారుల విధులకు ఆటకం కలిగించేలా చర్యలు చేపట్ట కూడదని నిర్ణయించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మునుస్వామి, వేణుగోపాల్, రమేష్‌బాబు, బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్ఎస్ యాదవ్ పాల్గొన్నారు.

ముగిసిన గంగాభవాని ఉత్సవాలు

ఉదయగిరి రూరల్, జూన్ 25: గంగిరెడ్డిపల్లి అనంతపూరి గంగాభవాని ఉత్సవాలు మంగళవారం బండ్లపొంగళ్ల కార్యక్రమంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు అమ్మవారికి కాయకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



అలఘునాథుడి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



గ్రామోత్సవంలో గంగాభవాని అమ్మవారు

ఎడ్ల బండలాగుడు పోటీలు: ఉత్సవాల సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్య దర్శి మస్నేటి వెంకటరెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు ఎద్దులు బండలాగుడు పోటీలు ప్రారంభించారు. పోటీలో మూడు జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీల్లో నంద్యాల జిల్లా కుమ్మరికొట్టాలు గ్రామానికి చెందిన వినుకొండ రవీ ఎద్దులు ప్రథమస్థానం, వైఎస్ఆర్ కడప జిల్లా రాజువారిపేటకు చెందిన లింగారెడ్డి హిశ్వతి ఎద్దులు ద్వితీయస్థానం, అదే జిల్లా పత్తూరుకు చెందిన కవ్వా బాలయ్య ఎద్దులు తృతీయస్థానాల్లో నిలిచాయి. వారికి ఆలయ కమిటీ సభ్యులు వరుసగా రూ.25, రూ.20, రూ.15 వేలతో పాటు బహుమతులు అందజేసి సన్మానించారు.

వరికుంటపాడు: కొండ్రాజుపల్లిలో మూడురోజులుగా జరుగుతున్న పోలేరమ్మతల్లి తిరునాళ్ల మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా మహిళలు మేళతాళాలతో పొంగళ్ల సామగ్రిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన బండ్లను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదానంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



గంగిరెడ్డిపల్లిలో బండలాగుతున్న ఎడ్లు

ఆత్మకూరు: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథుని కల్యాణాన్ని భక్తులు నిర్వహించారు. ప్రతి నెలా జరిగే శ్రవణనక్షత్ర కల్యాణాలను, పర్వదినాల్లో జరిగే సరుగు కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి కృపాక టాక్షాలను పొందాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు. నిర్మాణంలో ఉన్న కల్యాణ మండప నిర్మాణానికి దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

'నేను బడికి పోతా'ను

విజయవంతం చేయండి

సంగం, జూన్ 25: ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమగ్ర శిక్ష అభిమాన్ అసిస్టెంట్ ప్రొగ్రామ్ కో ఆర్డినేటర్ ఉషారాణి కోరారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. స్కూల్లో జరుగుతున్న నాడు-నేడు పనులు, మధ్యాహ్న భోజన పథకం, ఎనిమిది రకాల సామగ్రితో స్టూడెంట్ కిట్ల పంపిణీ తీరును పరిశీలించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై సలహాలు ఇచ్చారు. వచ్చే నెల 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో 6 ఏళ్ల పైబడి 14ఏళ్ల లోపు పిల్లలందరినీ బడిలో చేర్పాలన్నారు. ఆమె వెంట ఎంఈవో 1, 2 జానకీరామ్, మల్లయ్య ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య పాల్గొన్నారు.



సంగం: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి

ఉదయగిరి: పట్టణంలో మంగళవారం నేను బడికిపోతా కార్యక్రమంపై అధికారులు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 తోట శ్రీనివాసులు మాట్లాడారు. 6-14ఏళ్లలోపు బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు అందే సౌకర్యాలు, ఉత్తమ బోధనపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. నేను బడికి పోతా కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, అధికారులు సమిష్టిగా నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. ఇటుకబట్టీలు, చేపల చెరువుల వద్ద ఉన్న బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు చదువు యొక్క విశిష్టతను వివరించి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాతబస్టాండ్ సెంటర్‌లో మానవ హారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాలకేశవులు పాల్గొన్నారు.

సీతారామపురం: పండ్రంగిలోని ఎస్టీ కాలనీలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని మండల విద్యాధికారి మస్తాన్‌వలి, ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాల హెచ్ఎం బాలిరెడ్డి, సీఆర్పీ వేంకటేశ్వర్లు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామాన్ని సందర్శించి బడిబయట పిల్లల వివరాలను సేకరించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను పాఠశాలకు పంపాలని కోరారు. ఈ సందర్భంగా బడి బయట ఉన్న 8మంది పిల్లలను గుర్తించి, అల్లూరురాజు అనే ఏడో తరగతి విద్యార్థిని సీతారామపురం హైస్కూల్‌లో చేర్పించారు. మిగిలిన వారు ప్రతిరోజూ బడికి వచ్చేలా హైస్కూల్ హెచ్ఎంకు బాధ్యతలు అప్పగించారు.



సీతారామపురం: అవగాహన కల్పిస్తున్న ఎంఈవో, ఎంపీడీవోలు



ఉదయగిరిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

అలుగు కాదు.. మురుగు కాలువే..!

ఆత్మకూరు, జూన్ 25: ఈ ఫొటోలో ఉన్నది మున్సిపాలిటీలోని ఎల్ఆర్‌పల్లి శివారు ప్రాంతం మురుగు కాలువ. ఆదేంటి ఇది వాగు అలుగు ఉందని అనుకుంటున్నారా..? అధికారులు, పాలకులు మాత్రం వీటిని డ్రైనేజీలు అంటున్నారు. పట్టణంలోని చాలా కాలనీల్లో మురుగు కాలువలు ఇలాగే ఉన్నాయి. కొన్నింటిలో డ్రైనేజీలు ఉన్నా శిథిలం అయ్యాయి. ఈ సమస్యతో మురుగునీరు ఎక్కడపడితే అక్కడ పేరుకుపోతుంది. మరికొన్నిచోట్ల రోడ్లపై పారుతూ దుర్వాసన వస్తుంది. ప్రజలు అస్తవ్యస్త డ్రైనేజీలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జెఆర్‌పేట, ముస్లిం వీధి, కందివీధి, వందూరుగుంట, జెండాదిబ్బ, ఉలవదిబ్బ ప్రాంతాల్లో మురుగు కాలువలు పరిస్థితి ఇలాగే ఉంది. దోమల బెడదతో రాత్రిళ్లు ప్రజలు జాగరణ కాయాల్సిన దుస్థితి నెలకొంది. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలం కావడంతో కొన్ని ప్రాంతాల్లోని డ్రైనేజీలు పొంగి మురుగునీరు ఇళ్ల లోకి చేరుతుందని స్థానికులు వాపోతున్నారు. అధి కారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎల్ఆర్‌పల్లి శివారు ప్రాంతంలోని మురుగు కాలువ

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ప్రారంభానికి నోచని బాలికల వసతిగృహం

● ఏడాది క్రితమే పనుల పూర్తి ● సిబ్బందిని నియమించని అధికారులు ● విద్యార్థినుల ఇక్కట్లు

లింగసముద్రం, జూన్ 25: మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలోగల ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలో ఉన్న బాలికల వసతిగృహం ప్రారంభానికి నోచుకోలేదు. ఏడాదిక్రితం భవన నిర్మాణం పూర్తి చేసినా అధికారులు, సిబ్బందిని నియమించలేదు. వసతిగృహంలో పని చేసేందుకు ఓ మ్యాట్రిన్, ముగ్గురు వంటవారు, వాచ్‌మన్ లను నియమించాలి. వంటకు అవసరమైన పాత్రలు కూడా సమకూర్చాలి.ఇది ప్రారంభం కాకపోవడంతో మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థినిలు 15 నుంచి 20 కి.మీ లోపు దూరం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ స్కూల్‌లో 7 నుంచి 10వ తరగతి వరకు, సీనియర్ ఇంటర్ చదివే మొత్తం బాలికలు 190 మంది ఉన్నారని ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హస్తార్ చెప్పారు. వసతి గృహం ప్రారంభమైతే బాలికల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వసతి గృహాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థినిల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రారంభానికి సిద్ధంగా బాలికల వసతి గృహం

అభివృద్ధే నా అజెండా

● ప్రజల అభిమానం మరువలేనిది
● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, జూన్ 25: ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధే తన అజెండా అని, నియోజకవర్గ ప్రజలు తనపై చూపిన అభిమానాన్ని ఎన్నటికీ మరువలేనని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకరం అనంతరం తొలిసారిగా మంగళవారం నియోజవర్గంలో అడుగుపెట్టిన ఆయన రాత్రి 8గంటలకు కలిగిరి మండలానికి చేరుకున్నారు. మండలంలోని 14వ మైలు వద్ద టీడీపీ శ్రేణులు ఆయన అపూర్వ స్వాగతం పలికారు. వందలాది బైకులతో ఆయన వెంట పయనించారు. ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.





జలదంకి : అభిమానులతో ఎమ్మెల్యే సురేష్, కలిగిరి : కాకర్లకు పుష్పగుచ్ఛం ఇస్తున్న చిరంజీవిరెడ్డి

కాకర్లకు అడుగడుగునా జననీరాజనాలు

జలదంకి : ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అసెంబ్లీలో శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారి నియోజకవర్గంలోకి రావడంతో మండలంలోని జమ్మలపాలెం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. బాణసంచా కాల్చి పూలవర్షం కురిపించారు. భారీ కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. జమ్మలపాలెం మిక్సిడ్‌కాలనీ వద్ద మాజీ సర్పంచు నక్కా మాధవరావు గజమాలతో స్వాగతం పలికారు. కాకర్ల గుర్రంపై ఎక్కి స్వారీ చేస్తూ అభివాదం చేశారు. అక్కడి నుంచి భారీ వాహన శ్రేణితో జాతీయ రహదారిపై విజయోత్సవ ర్యాలీ ప్రారంభమైంది. మార్గమధ్యంలో ఎల్ఆర్ అగ్రహారం, గట్టుపల్లి క్రాస్‌రోడ్, జలదంకి బస్టాండు కూడలి, కమ్మపాలెం, నాగిరెడ్డిపాలెం క్రాస్‌రోడ్స్, తిమ్మిదోష్షైలు, హనుమకొండపాలెం క్రాస్‌రోడ్, చినక్రాక మీదుగా కలిగిరి మండలం 14వ మైలు వరకు విజయోత్సవ ర్యాలీ జరిగింది. నేతలు అడుగడుగున ఘనస్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, పోలీస్‌హౌసింగ్‌బోర్డు మాజీ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పి.మధుమోహన్‌రెడ్డి, నియోజకవర్గం నాయకులు దామా మహేష్‌నాయుడు, చంద్ర మధుసూదనరావు, బొట్లగుంట హరిబాబు, వంటేరు జయచంద్రారెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, తల్లపనేని మధుసూదనరావు, మునగాల తిరుమలరెడ్డి, ఏగూరి రఘు, బీజేపీ, జనసేన నాయకులు కంచర్ల శరత్, తోట మురళీ, నిమ్మకాయల రామ్‌చైతన్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బిట్రగుంట, జూన్ 25: బోగోలు మండలం సీఆర్‌పాలెంకు చెందిన టీడీపీ జిల్లా రైతు కార్యదర్శి కోట వెంకారెడ్డి సోదరుడు బలరామిరెడ్డి (58) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మంగళవారం బలరామిరెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, నేతలు బడుగు వెంకయ్య, అన్నంగి ఆదిశేషయ్య, బోగిరి ప్రభాకర్ ఉన్నారు.



బలరామిరెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

ఎమ్మెల్యేకి ధన్యవాదాలు

సాగునీటి కోసం రైతుల కష్టాలను తెలుసుకున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో చర్చించి వ్యవసాయానికి ప్రతి రోజు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఇవ్వాలని చెప్పడంతో నాగులవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు యర్రం వెంకటేశ్వర్లురెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆయన జేపీగూడూరు, ఏటీకండ్రిక, బీజీపీ కండ్రిక, ఎస్‌జీపీ కండ్రిక రైతులతో కలసి ఎమ్మెల్యేని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నేత కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, కలివి రెడ్డి వెంకటసుబ్బారెడ్డి, గునపాటి క్రిష్ణారెడ్డి, పాపన రాఘవరెడ్డి, మస్తాన్‌రెడ్డి, బుర్రా వెంకారెడ్డి, బత్తల బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతి : ఎంఈవోలు

కావలిరూరల్, జూన్ 25: విద్యతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరవచ్చని ఎంఈవోలు బి.గోవిందయ్య, సీహెచ్ వెంకటసుబ్బయ్యలు పేర్కొన్నారు. కావలి మండలం సిరిపురం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మంగళవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలంటూ విద్యార్థులతో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి, ఉపాధ్యాయుడు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న, ఉపాధ్యాయులు విద్యార్థులు

కలిగిరిలో విద్యార్థుల మానవహారం

కలిగిరి : నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక జెడ్పీహైస్కూల్ విద్యార్థులు పాఠశాల నుంచి కలిగిరమ్మ దేవాలయం కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రంగ సుబ్బరాయుడు, ఎంఈవో జీ సురేష్, పంచాయతీ కార్యదర్శి చెంచుక్రిష్ణయ్య, సీఆర్ఎంటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మానవహారం నిర్మిస్తున్న విద్యార్థులు

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి : జేఏసీ

కావలిటౌన్, జూన్ 25: విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం విద్యుత్‌శాఖ డీఈ కేఎస్ బెనర్జీకి నోటీసు అందజేశారు. జేఏసీ నేతలు మాట్లాడుతూ కావలి డివిజన్ పరిధిలోని కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అనేక సార్లు ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇంజనీర్లకు సకాలంలో పదోన్నతులు లభిస్తున్నాయని, కార్మికుల విషయం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుందని వాపోయారు. వేధింపులు సైతం ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. పెండింగ్ టీఏ బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు 327 యూనియన్ కార్యదర్శి సందానిబాషా, అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, 1104 యూనియన్ నేతలు శ్రీనివాసులు, యు రవి, ఓసీ యూనియన్ నేతలు పెంచలనాయుడు, దేవీప్రసాద్, ఎస్సీ, ఎస్టీ యూనియన్ నేతలు కమల్‌కుమార్, కృష్ణమోహన్, బీసీ యూనియన్ నేతలు సత్యం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ డీఈకి నోటీసు అందజేస్తున్న జేఏసీ నేతలు


దాడులు హేయం : మాజీ ఎమ్మెల్యే

కావలిటౌన్, జూన్ 25: వైసీపీ నేతలు కార్యకర్తలు, వారి ఆస్తులపై దాడులు చేయడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దాడికి గురై తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటికొచ్చిన మాజీ వలంటీర్ రాజీవ్‌కుమార్(నటరాజ్)ను మంగళవారం ఆయన పరామర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక విధ్వంసక పాలన ప్రారంభించారని, ఇది ఎమ్మెల్యేకి తగదన్నారు. అలాగే బావా వ్యవస్థాపక కార్యదర్శి లేబాకుల సుధాకర్‌రెడ్డి మృతి కళారంగానికి తీరని లోటని, ఆయన సోదరుడు లేబాకుల శేషారెడ్డి అన్న మృతి జీర్ణించుకోలేక గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయన సతీమణి ఆదిలక్ష్మితో కలిసి లేబాకుల సోదరుల పార్థీవదేహాలను సందర్శించి నివాళులర్పించారు.

ముగ్గురు డీలర్ల రాజీనామా

లింగసముద్రం, జూన్ 25 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో మండలంలోని ముగ్గురు రేషన్‌షాపుల డీలర్లు రాజీనామాలు చేశారు. మండలంలోని గంగపాలెం గ్రామానికి చెందిన 3వ రేషన్‌షాపు డీలరు సీహెచ్ అనూష, వీఆర్ కోటలోని 12వ షాపు డీలరు వంకాయలపాటి శాంతి, మేదరమెట్లపాలెంలోని 24వ షాపు డీలరు కె మాలకొండయ్యలు తమ రాజీనామాలను తహసీల్దారు జి శ్రీచరణ్‌కు అందజేశారు. అయితే మండలంలోని మిగిలిన 24 రేషన్‌షాపుల డీలర్లు జూన్ నెల సరుకులను విక్రయించిన తరువాత రాజీనామా చేస్తారని అధికారులతో చెప్పినట్టు తెలిసింది.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి



కొండాపురం, జూన్ 25: పాఠశాలల్లో విద్యార్థుల వివరాలను సమగ్రంగా రికార్డులలో నమోదు చేయాలని మండల విద్యాశాఖాధికారి కె.రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కొమ్మి పంచాయతీలోని కుంకువారిపాలెం, రామానుజపురం ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాలలు, రామానుజపురం ప్రాథమికోన్నత పాఠశాల, కొమ్మి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, స్థానిక ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

నేడు నర్రవాడకు టీడీపీ శ్రేణులు

లింగసముద్రం, జూన్ 25 : కందుకూరు ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు గెలుపొందడంతో బుధవారం జిల్లాలోని నర్రవాడలో వెలసిన వెంగమాంబకు మొక్కులు తీర్చుకొనేందుకు 100 మందికి పైగా టీడీపీ శ్రేణులు వెళుతున్నట్లు లింగసముద్రం గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరంతా లింగసముద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన వారని తెలిపారు.

వరిగడ్డి వామి దగ్ధం

గుడ్లూరు, జూన్ 25 : మండలంలోని పొజర్లకు చెందిన రైతు కుందుర్తి మునలయ్యకు సంబంధించిన వరిగడ్డివామి దగ్ధమైంది. దీంతో సుమారు రూ.30 వేల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల మేరకు.. సోమవారం రాత్రి ఎవరో గుర్తుతెలియని ఆకతాయిలు సిగరెట్ కాల్చి పడవేయడంతో నిప్పంటుకుని అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న కందుకూరు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

మూగజీవాల ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలి

వలేటివారిపాలెం, జూన్ 25 : మూగజీవాల ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలని పశుసంవర్ధక శాఖ ఏడీ కసుకుర్తి వీరబ్రహ్మయ్య తెలిపారు వలేటివారిపాలెం పశువైద్యశాలలో మంగళవారం మూగజీవాల సంరక్షణపై వెటర్నరీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశుపోషకులకు అందుబాటులో ఉండి మూగజీవాలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం పశు బీమా తదితర పథకాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంచార పశువైద్యాధికారి కేశంరెడ్డి వాసంతి, సిబ్బంది కొండారెడ్డి, మౌనిక, మహిత, వాణి, సృజన, దినేష్, నవదయ్య తదితరులు పాల్గొన్నారు.



వెటర్నరీ సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీ వీరబ్రహ్మయ్య